నవశక్తి

Vol. 2, no. 6

(Jan. 18, 1939)

బెజవాడ, 1939

Navaśakti

Vol. 2, no. 6

(Jan. 18, 1939)

Bejavāḍa, 1939

Record no. 682

కాంగ్రెసులో కమ్యూనిస్టు లుండ వచ్చును

Regd. No. M. 3824

నవశక్తి

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారపత్రిక

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ. పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రామయ్య.

సంపుటం 2 | బుధవారం | 18-1-39 | బెజవాడ | సంచిక 6

ఈనాం రైతుల గగ్గోలు



మన రాజకీయాలు

పట్టాభిగారి కర్తవ్యం

పశ్చిమ కృష్ణా జిల్లా కాంగ్రెసు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పట్టుదలనే ప్రధానంగా ఎంచుకోక, తమకు చేరిన 35,372 కాంగ్రెస్ సభ్యత్వ ఫారాల తాలూకు సొమ్ము నంతటినీ (సుమారు రు. 4,000 లు) బ్యాంకులో డిపాజిట్టు చేశారు, బార్డోలీలో సమావేశమైన అఖిల భారత కాంగ్రెస్ వర్కింగు కమిటీ సభ్యుల సలహామీద. యీ సమాచారాన్ని వర్కింగ్ కమిటీకి టెలిగ్రాం ద్వారా తెలియజేశారు. దానిపై వర్కింగుకమిటీవారు పశ్చిమ కృష్ణా వ్యవహారాలు పరిష్కరించటానికి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీకే అధికారం ఇస్తూ తీర్మానించారు.

ఇకనైనా డాక్టరు పట్టాభిగారు ప్రతిష్టకై పెనుగులాడక, యీ 35,372 మంది కాంగ్రెసు మెంబర్ల హక్కుల్నీ నిలబెట్టి, తమ మొదటి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవలసి యుంది. కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులయిన శ్రీ పేట బాపయ్య, కాకాని వెంకటరత్నంగార్లపై తీసుకొన్న "శిక్షణ చర్య" ను రద్దు చేయాలి. తమవద్దనున్న 29,000 మంది సభ్యుల దరఖాస్తుఫారాలు, వాటి సొమ్ము, వారికి అందజేయాలి. జిల్లాలో కాంగ్రెసు ప్రతినిధుల ఎన్నికలు సక్రమముగా జరగడానికి నిష్పాక్షికమైన ఎలెక్షన్ ట్రిబ్యునల్ ఒకటి నియమించి, నియోజకవర్గాల విభజన వగయిరాలన్నీ నిష్పక్షపాతంగా జరిగేటట్టు చూడాలి. వెంటనే ఈవిధముగా జరిగితేనే గాని జిల్లాప్రజలలో విరివిగా వ్యాపించియున్న ఆగ్రహావేశాలు చల్లారవు. పట్టాభి గారు కాంగ్రెసు సంస్థ యొక్క గౌరవాన్ని జిల్లాలో యిప్పుడైనా కాపాడుతారని నమ్ముతున్నాం.

యు.పి. లో రాజద్రోహ నేరాలు

ఇండియాలో ప్రస్తుతము అమల్లో ఉన్న సెక్షన్ 124ఎ. (రాజద్రోహం) ఎంతనిరంకుశమైనదో మన కాంగ్రెసు నాయకులు అనేక సార్లు తెలియజేశారు. ఇట్టి నిర్బంధశాసనాలను రద్దుచేసి తీరుతాం అని కాంగ్రెసు ఎన్నికలప్రణాళికలో స్పష్టంగా ప్రకటించారు. కాంగ్రెస్ మంత్రులు అధికారంలో లేని పంజాబు, బెంగాల్ రాష్ట్రాలలో ఈ సెక్షన్ విచ్చలవిడిగా ప్రయోగించబడుతోంది. కాని, కాంగ్రెసు మంత్రులు అధికారములో ఉన్న యు.పి. లోకూడా ప్రయోగించబడడం ఆశ్చర్యం. యు. పి. రాష్ట్ర కాంగ్రెసు కమిటీ సభ్యులును, త్రిపురీ కాంగ్రెసుకు ప్రతినిధులును అయిన శివకుమార్, శికార్ నాథగంగూలీ అనే యిరువురు యువకుల్ని 124 ఎ. సెక్షన్ క్రింద ఎరస్టుచేసి, విచారణ కూడా ప్రారంభించారు. జమీందార్ల యెడల దౌర్జన్యం బోధించారని వీరిమీద అభియోగం. దేశంలో "శాంతి భద్రతలను" కాపాడే ఉత్సాహంలో మన కాంగ్రెసు మంత్రులు పూర్వం తమచే ఖండింపబడిన యిట్టి నిర్బంధ శాసనాలను రద్దుచేయకపోవడమే గాక, అమలుపరచడము విచారించతగ్గ విషయం. ఆ యిద్దరు యువకుల మీద వెంటనే యు. పి. ప్రభుత్వం కేసు ఉపసంహరించుకొని, కాంగ్రెసు సంస్థ యొక్క గౌరవాన్ని నిలబెట్టాలని కోరుతున్నాం. రాజకీయ ఖయిదీల విడుదలకై రాజీనామా యిచ్చిన యు. పి. ప్రధాని గోవిందవల్లభ పంతు ఈ విషయంలో కూడా ధైర్యం వహిస్తాడని ఆశిస్తున్నాం.

శాఖా విభజన

ఏ ప్రజాతంత్ర ప్రభుత్వములో నైనా న్యాయశాఖ, కార్యనిర్వాహకశాఖ, శాసన నిర్మాణశాఖ వేరు వేరుగా ఉంటాయి. ఇప్పుడు సాధ్యం కాకపోయినా, అట్టి శాఖావిభజన జరగడం ప్రజలకు శ్రేయస్కరం అని రాజనీతిజ్ఞులంతా అంగీకరిస్తున్నారు. మన దేశంలో న్యాయ—కార్యనిర్వాహక శాఖలు రెండూ కలిసే ఉన్నాయి. బ్రిటిషువారి పెత్తనం ఇండియాలో శాశ్వతంగా ఉండడానికి వేసిన ఎత్తులలో యిదొకటి. ఒక్క సెషన్సు కోర్టులు, హైకోర్టులు తప్ప క్రింది కోర్టులన్నీ కార్యనిర్వాహక శాఖ యొక్క చెప్పుచేతల్లోనే ఉన్నాయి. ఈవిధానం పూర్తిగా మారాలి అని ఎన్నో సంవత్సరాలనుంచి మితవాదపక్ష నాయకులు, కాంగ్రెసువారూ కూడా ఆందోళన చేస్తున్నారు. కాంగ్రెసు మంత్రులు అధికారంలో ఉన్న యు. పి. రాష్ట్రంలో యిందుకై ఒక కమిటీని నియమించారు. కాంగ్రెసేతరులు అధికారంలో ఉన్న సింధురాష్ట్రములో ప్రభుత్వం శాఖావిభజనకు పూనుకొని, పని చేస్తోంది. మొన్న శ్రీమాన్ శ్రీనివాస అయ్యంగార్ రాజమండ్రిలో జరిగిన జిల్లా లాయర్ల మహాసభలో ఉపన్యసిస్తూ శాఖావిభజన సూత్రాన్ని అంగీకరించనైనా అంగీకరించని మదరాసు మంత్రివర్గపు వైఖరిని తీవ్రంగా విమర్శించాడు.

ఈ మధ్యనే, గుజరాత్ సోషలిస్టు నాయకుడయిన దిన్‌కర్ మెహతా జిల్లా పోలీసు అధికారి యిచ్చిన ఉత్తరువును ఉల్లంఘిస్తూ ఊరేగింపు జరిపినందుకు మేజస్ట్రేటు ఆయనకు 3 వారాలు జైలు శిక్ష విధించాడు. సెషన్సు కోర్టులో అప్పీల్ చేస్తే, జడ్జీ శిక్షను కొట్టివేశాడు. జిల్లా పోలీసు అధికారి అప్పుడు అట్టి ఉత్తరవు యివ్వడానికి అధికారంలేదని తీర్పుచెప్పాడు. ఈ ఒక ఉదాహరణవల్ల బోధ పడుతుంది, శాఖా విభజన ఎంత అవసరమో. ఇకనైనా రాజాజీ మన రాష్ట్రంలోకూడా న్యాయ, కార్యనిర్వాహక శాఖల విభజనకు ప్రయత్నం చేస్తే, అధమం ఆ సూత్రాన్ని అంగీకరిస్తూ ఒక ప్రకటన అయినా చేస్తే, మంచిది.

బీహార్‌లో లంచగొండి సమస్య

బీహార్ రాష్ట్రంలో ప్రభుత్వోద్యోగుల లంచగొండితనాన్ని గురించి విచారణ జరపడానికి కాంగ్రెసు ప్రభుత్వంచేత నియమింపబడిన ఉప సంఘంవారు తమ నివేదికను ప్రకటించారు. వీరు తమ ప్రశ్నావళిని 677 సంస్థలకూ—వ్యక్తులకూ పంపగా, 256 జవాబులు వచ్చాయట. ఉప సంఘం ఎదుట ఈయబడిన సాక్ష్యాన్ని బట్టి "యించుమించు అన్ని గవర్నమెంటు శాఖలలోను" లంచగొండి తనం విరివిగా వ్యాపించి యున్నదనీ, దాన్ని నిర్మూలన చేయడానికి మూడు పద్ధతులు అవలంబించవలసి యుంటుందనీ తమ నివేదికలో వీరు వ్రాశారు. ఆ మూడు పద్ధతులు ప్రచారము, కాపుదల, శిక్షించుట.

ఈకమిటీవారి సిఫార్సులను కొంతవరకైనా బీహార్ ప్రభుత్వం అంగీకరిస్తుందని ఆశించవచ్చు. కాని, మన రాష్ట్రంలోనో? విచారణ సంఘాలమాట అటు ఉంచి, మన ప్రధాని శాసన సభలలోను, బహిరంగ సభలలోను లంచగొండి తనాన్ని ఒక విధంగా సమర్థిస్తూ మాట్లాడు తున్నాడు. లంచాలు పుచ్చుకొన్న ఉద్యోగస్థులకన్న లంచాలిచ్చిన వ్యక్తులే ఎక్కువ నేరస్థులని అనేక సభలలో ఉపన్యసించి యున్నాడు. ఇట్టి వైఖరి లంచగొండి తనాన్ని వృద్ధి చేస్తుంది కాని, తగ్గించదు.

బెంగాలులో నిషేధాలు సోదాలు

బెంగాల్ రాష్ట్ర కాంగ్రెసునే నియమింపబడిన ప్రజా ఉద్యమ ఉప సంఘంవారు యీ మధ్య "కొన్ని అసత్య ప్రకటనలకు జవాబు" అనే శీర్షికతో ఒక కరపత్రాన్ని ప్రకటిస్తే, బెంగాల్ ప్రభుత్వం దాన్ని నిషేధించి, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యాలయాన్ని సోదాచేసి, 718 ప్రతులను లాక్కుపోయింది.

ప్రజలలో కేవలం మతావేశాలను రెచ్చగొట్టి వారిలో ఆవిధంగా తన పలుకుబడిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తూన్న బెంగాల్ జాతీయవిద్రోహ మంత్రివర్గానికి ప్రతి కాంగ్రెసు కమిటీ ప్రజల ఆర్థిక, రాజకీయహక్కులకై పోరాడుతూ ఉంటే, నిర్బంధ విధానము తప్ప మరొక మార్గం కనపడ్డంలేదు. కాని ఇది ఎంత ఎక్కువయితే, ప్రజా ఉద్యమం అంత తీవ్రత పొందుతుంది.

మన సైన్యం

భారతీయ సైనిక దళా లన్నింటిలోనూ భారతీయులు మాత్రమే ఉండాలని కాంగ్రెసు, మితవాదపార్టీవారు, హిందూ మహా సభ, ముస్లిమ్ లీగ్—ఏకకంఠంతో, అనేక సంవత్సరాలనుంచి కోరుతున్నారు. 1926 లో ఇండియన్ సాండ్ హర్ట్సు కమిటీవారి సిఫార్సు ప్రకారము, యీ సమస్యను గురించి విచారించడాని కొక ఉపసంఘాన్ని నియమించాలి ప్రభుత్వము. గత ఢిల్లీ శాసన సభలో ఏకగ్రీవంగా ఆమోదించబడిన తీర్మానము ప్రకారము, శాసన సభ్యులచేత ఎన్నుకోబడినవారే ఆ ఉప సంఘములో అధిక సంఖ్యాకులుగా ఉండాలి. కాని, ఈ నెల 12 వ తేదీని వెలువడిన ప్రభుత్వ ప్రకటన అందరికీ ఆశాభంగము కలిగించినది. ప్రభుత్వం నియమించిన ఉపసంఘముయొక్క 13 సభ్యులలో ముగ్గురు మాత్రమే శాసనసభ్యులచేత ఎన్నుకోబడినవారు. అంతే కాదు. సైనికులందరిలో కాకుండా, ఒక ఆఫీసరుల లోనే ఎంతవరకూ పై సూత్రం వర్తింపజేయవచ్చునో విచారణ జరుపుతారట ఆ కమిటీ సభ్యులు.

తన చేతనే నియమించబడిన కమిటీల సిఫార్సులను ఈ విధంగా గౌరవిస్తోంది, మన ప్రభుత్వం. సైన్యం అంతా మన దేశీయులతో నిండినదై ఉంటే, ఎప్పుడెట్టి ప్రమాదం వస్తుందోనని భయం విదేశీయులకి; కనుకనే ఈ విధంగా ప్రజాభీష్టములను తిరస్కరించడం. శాసన సభలో ప్యాసైన తీర్మానానికి వ్యతిరేకంగా ప్రవర్తించిన ప్రభుత్వ చర్య యెడల తమ తీవ్ర అసమ్మతిని ప్రకటించడం శాసన సభ్యుల కనీస కర్తవ్యం.

మనవి

పండగ శెలవులగుటచే ఈ వారం నవశక్తి 20 పేజీలే ప్రకటించ గల్గినాము. వచ్చే వారంనుండి యథా ప్రకారం 24 పేజీలతోనే వెలువడును.

—మేనేజరు

నవశక్తి

18—1—39 బుధవారం

వర్కింగు కమిటీ తీర్మానాలు

అఖిల భారత కాంగ్రెసు వర్కింగ్ కమిటీ 11, 12, 13, తేదీలందు బార్డోలీ స్వరాజ్యాశ్రమంలో సమావేశ మయింది. ఈ సమావేశంలో పరిష్కరించిన వాటిలో ముఖ్యమయినవి, బీహార్ బెంగాలీ తగాదా, అల్పసంఖ్యాకుల విషయమై గాంధి గారి సూచనలు, రాంపూర్‌లో ఏజెంటు హత్య, ఆంధ్రదేశ ఎన్నిక తగాదాలు.

బీహారులో నివసించుచున్న బెంగాలీలకు బీహారు ప్రభుత్వం ఉద్యోగాలు వగయిరాలు యిచ్చుటలో అన్యాయం చేస్తూందనే బెంగాలి వారి ఆక్షేపణను విచారించి రిపోర్టును వర్కింగు కమిటీ ముందు రాజేంద్రబాబు పెట్టాడు. ఆ రిపోర్టు ననుసరించి కార్య సంఘము ఒక తీర్మానము చేసింది. (1) ఇండియాలో వివిధ ప్రాంతాలలో ఉన్న ప్రత్యేక విజ్ఞానము ఆచార వ్యవహారాలను పోషించి నిలబెట్టాలి. కాని దేశానికంతటికీ అవసరమైన జాతీయతకు భంగం కలుగకుండుట ముఖ్యావసరము. (2) ఒక రాష్ట్రములోని ప్రభుత్వోద్యోగాలు మొదలైనవాటిలో ఆరాష్ట్రంలో మొదటి నుంచి నివసించువారికి ప్రాధాన్యత యివ్వక తప్పదు. (3) ఇండియాలో ఒక రాష్ట్రములో నివసించేవారికి మరే రాష్ట్రంలోనైనా ప్రభుత్వోద్యోగాల నిచ్చుటకు ఆటంకం వుండగూడదు. (4) ఒక రాష్ట్రంలో ఆ రాష్ట్ర వాసులకే ఎక్కువ ఉద్యోగాలనిచ్చుటకు రాష్ట్ర ప్రభుత్వం తగిన నిబంధనలు ఏర్పరచాలి గాని ఆఫీసరులకు వదలివేయరాదు. ఒక రాష్ట్రంలో వేరు వేరు పద్ధతు లుండరాదు. అన్ని రాష్ట్రాలలోనూ ఒకే పద్ధతి వుండాలి. (5) ఒక రాష్ట్రంలోని ఉద్యోగాలను ఆ రాష్ట్రంలోని అన్నిసంఘాలకు న్యాయంగా పంచాలి. నిమ్నజాతులకు ఎక్కువ ప్రోత్సాహ మివ్వాలి. (6) బీహారులో పుట్టిన బెంగాలీలను బీహారీలతో సమానంగా చూడాలి. స్థిర నివాస పు సర్టిఫికేట్ల నిచ్చు పద్ధతి రద్దు చేయాలి. ప్రభుత్వోద్యోగుల నందరిని సమంగానే చూడాలి. సర్వీసు, సామర్థ్యంపట్టి ప్రమోష నివ్వాలి. (7) ఆ రాష్ట్రంలో పుట్టినా లేక పదేండ్లు రాష్ట్రంలో నివసించినా అతనిని ఆ రాష్ట్ర నివాసిగానే యెంచాలి. (8) పాఠశాలలో తగినంతమంది వున్న, వారి భాషలోనే బోధనకు ఏర్పాటు చేయాలి. బెంగాలీలు ఎక్కువున్న ప్రాంతాలలో బెంగాలీ పాఠశాలలు నెలకొల్పాలి. పాఠశాలలు తక్కువగా వున్న అందరికి న్యాయమైన ప్రవేశ అవకాశా లివ్వాలి.

ఈ తీర్మానం బెంగాలీ బీహారీ తగాదాను పరిష్కరించుటే గాక, సంకుచిత రాష్ట్రాభిమానాన్ని ప్రోత్సహించువారికి చక్కని జవాబు నిచ్చింది. మద్రాసు రాజధానిలో బ్రాహ్మణేతరులకు ఉద్యోగాలలో అన్యాయం జరుగుతుందని ప్రబోధించు జస్టిసు వాదుల కుటిల ప్రచారానికిక అవకాశ ముండదని తలుస్తాము.

కరాచీ ప్రధాన హక్కుల తీర్మానాన్ని అనుసరించి గాంధిజీ అల్పసంఖ్యాకుల సమస్యపై కొన్ని సూచనలు గావించాడు. (1) హిందువులు ఊరేగింపులు, భజనలు జరుపుకోవచ్చును. కాని మసీదుల ముందు, లోన ప్రార్థనలు జరుపుకొనువారికి యిబ్బంది కలుగునట్లు, ప్రదర్శనాలు చేయరాదు. ముస్లిములు గోవులను బలి ఇచ్చుటకు, చంపుటకు హక్కు కలిగి వున్నారు; కాని బహిరంగ ప్రదేశాలలోను, హిందువులకు కాన్పించుచోట్ల చేయరాదు; చంపుటకు ముందు గోవులను ఊరేగించుట వగయిరా ప్రదర్శనాలు చేయరాదు. వందేమాతరం పాట, కాంగ్రెసు జండా ముస్లిము లీగ్ వారు వాడాలని నిర్బంధం లేదు. ఉద్యోగాలు అర్హతలను బట్టి యివ్వాలి; ఐతే అల్పసంఖ్యాక సంఘాలవారికి తగిన ప్రాతినిధ్యం ఉండునటుల చూడాలి.

గాంధిగారి యీ సూచనలన్నీ చర్చించి వర్కింగు కమిటీ వీనిని పార్లమెంటరీ సబ్ కమిటీ వివిధ రాష్ట్ర కాంగ్రెసు ప్రభుత్వాలకు అమలులో పెట్టవలెనని సూచించినటుల తెలియుచున్నది. వర్కింగు కమిటీ జిన్నా వగైరా ముస్లిమ్ కమ్యూనల్ నాయకులతో రాయబారాలు విఫలమైన సమయాన, తామే స్వయంగా సాంఘిక సమస్యను పరిష్కరించుటకు ముందంజ వేయుట శుభ సూచన అనియే చెప్పాలి. కాంగ్రెసు తన కర్తవ్యం కొనసాగిస్తూ ముందుకు సాగిన, కమ్యూనల్ నాయకులు ప్రజల వత్తిడిచే కాంగ్రెసుతో రాజీకి దిగాలిసి వస్తుంది. దీనితో పాటు కాంగ్రెసు మంత్రివర్గాలు ప్రజాసామాన్యానికి సంబంధించిన రైతు, కార్మిక హక్కుల కాపాడు శాసనాలు చేసిన సాంఘిక సమస్య పరిష్కరించుట సులభమగును.

రాంపూర్ సంస్థానంలో ప్రజలు మేజరు బజలు గెట్టీగారిని హత్య గావించినందులకు సంతాపాన్ని వెల్లడించి, ఇది స్వాతంత్ర్య పోరాటానికి అవరోధం గలిగించుతుందనీ, యెంతటి ప్రబల కారణమున్నా దౌర్జన్యాన్ని అవలంబించరాదనియు అహింసా విధానమే అనుసరణీయమనియు తీర్మానించారు. ఇందు మేజరు బజలు గెట్టీ ప్రజలపై తుపాకుల పేల్చినందులకు నిరసన, కాల్పులలో చనిపోయినవారి కుటుంబాలకు సానుభూతికూడా తెలిపియుండవలసింది. ఇటువంటి సంఘటనలెన్ని జరిగినా ప్రజా పోరాటం ఆపరాదని నిర్ణయించాల్సింది.

ఆంధ్ర దేశంలో కాంగ్రెసు వాదులలో కలకలానికి కారణమైన కాంగ్రెసు ఎన్నికల గొడవలు, వర్కింగు కమిటీ చాలా చర్చించింది. పశ్చిమ కృష్ణా కాంగ్రెసు సంఘం చేర్పించిన 35 వేల సభ్యత్వాలను ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు రద్దుచేసిన విషయమై అప్పీలును, జిల్లా కాంగ్రెసు సంఘం రాష్ట్ర కమిటీ ఆజ్ఞానుసారం బ్యాంకులో డబ్బు కట్టలేదని త్రోసివేసారు. రాష్ట్ర కాంగ్రెసు సంఘముతోనే పరిష్కరించుకోవలసిందని నిర్ణయించారు. బ్యాంకులో సొమ్ము కట్టకపోవడానికి కారణాలు రాష్ట్ర సంఘాధికారులు జిల్లా సంఘాన్ని నిర్లక్షించి వ్యక్తులతో వ్యవహరించడము, వారు కొన్ని గ్రామాలలో జనసంఖ్యకు మించి సభ్యులను చేర్పించుట జిల్లా సంఘాధ్యక్షుడు పేట బాపయ్యగారు అప్పీలులో తెలియపర్చినా, వర్కింగు కమిటీ గమనించక తిరిగి రాష్ట్ర కాంగ్రెసు సంఘాన్నే పరిష్కరించమని తీర్మానించ కూడదు: ఒకవేళ తాము జోక్యం కలిగించుకొనినచో రాష్ట్ర కాంగ్రెసు అధికారుల ప్రతిష్ఠకు లోటు అని వదలిరేమో!

ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కార్య సంఘము కమ్యూనిస్టు భావాలు కలవారు కాంగ్రెసులో వుండరాదని తోసివేసిన కామ్రేడ్ సుందరయ్య అప్పీలును వర్కింగు కమిటీ అంగీకరించింది. కాంగ్రెసు కాంస్టిట్యూషన్‌లోని 1 వ నిబంధన అంగీకరించిన వారందరు కాంగ్రెసు ఎన్నికలలో నిలువవచ్చునని నిర్ణయించి. కొందరు మితవాదులు అతివాదులను ఏదో వంకపై కాంగ్రెసునుండి తరిమివేయుటకు చేయు ప్రయత్నాలను అరికట్టింది. ఈ తీర్పు కాంగ్రెసుతో సంయుక్త జాతీయ ప్రతిఘటన సాధ్యమా అను అనుమానం గల అతివాద మిత్రుల సందేహాన్ని తొలగించింది.

కాని ఈ తీర్మానము ఆఖరిలో "రాష్ట్ర కాంగ్రెసు కమిటీ, వారి చర్యలను గమనిస్తూ, కాంగ్రెసు 1 వ నిబంధన ఉల్లంఘించారేమో చూడాలి" అని వుంది. పట్టాభిగారివంటి కాంగ్రెసు నాయకుల యొక్కయు, వారికి తాళం వేసే రాష్ట్ర వర్కింగు కమిటీ చేతిలో ఇది అపాయకరమైన ఆయుధము. సోషలిస్టు పార్టీని కమ్యూనిస్టు పార్టీ అని పిలుస్తూ పత్రికలలో రచ్చకెక్కగలిగిన వ్యక్తి, ఒకరి చర్యలో దౌర్జన్యం లేకపోయినా సృష్టించగలడు: డిసిప్లినరీ చర్య తీసికొన గలడు. క్రిందటి ఏడాది పశ్చిమ గోదావరి ఎన్నికలలో తమ పార్టీవారు చేసిన అవకతవకలను కప్పిపుచ్చి, తన్ను 'తూలనాడె'నని కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణపై చర్య తీసికొనలేదా? గద్దకట్టిన కాంగ్రెసువాదులు, కానూరు బలరామయ్య వగైరాలపై నిరుడు, పేట బాపయ్య వగయిరాలపై యీ యేడాది, తన ఆజ్ఞ ఉల్లంఘించారని కాంగ్రెసు నుండి వెలిబెట్టలేదా? కాశీపట్నం రైతుల విషయంలో పోలీసు రిపోర్టునే నమ్మి అఖిల భారత కాంగ్రెసు సంఘంలో, సోషలిస్టులు దౌర్జన్యం బోధిస్తున్నారని ఏకరువు పెట్టలేదా? అట్టివారు నిరంతరం ప్రజాపోరాటంలో మున్ముందుండుటచే బ్రిటిషుద్యోగుల కోపానికి ఎక్కువ గురియగు సోషలిస్టులపై కాంగ్రెసు నిబంధన ఉల్లంఘించారని ఆరోపించుట సులభసాధ్యమైనపనే. అయినా కాంగ్రెసు సభ్యులపై కమిటీ యీ సి. ఐ. డి. పని యెందుకు?

మొత్తముపై కాంగ్రెసు వర్కింగు కమిటీ యీ సమావేశములో అభివృద్ధికరమైన పంథాయే అవలంబించింది.

సంయుక్త జాతీయ సామ్రాజ్య వ్యతిరేక ప్రతిఘటన వర్థిల్లాలి!

రైతులలో రగుల్తున్న చైతన్య జ్వాలలు



తూర్పు గోదావరిజిల్లా జమీన్ రైతు మహా సభ.

పై మహాసభ 6-1-39 వ తేదీని పిఠాపురంలో శ్రీ గొర్రిపాటి వెంకట సుబ్బయ్యగారి అధ్యక్షత క్రింద జరిగింది. మధ్యాహ్నం 2 గంటలకు పాదగయ క్షేత్రము నుండి సుమారు 4,000 మంది రైతులు పెద్ద ఊరేగింపుగా బయలుదేరారు. గాంధీజీ, ప్రకాశం, బోసు, నెహ్రూ మొదలైన నాయకులపటములతో అలంకరించబడిన మంటపమొకటి యరవై జతల ఎడ్లచే లాగబడింది. రైతుభజనలు, రైతుగీతాలు మిన్నుముట్టాయి. సాయంత్రం 4 గంటలకు ఊరేగింపు సభామంటపము చేరింది.

జాతీయ గీతాలతోను, రైతు గీతాలతోను మహాసభ ప్రారంభమయింది. సభాధ్యక్షులైన శ్రీ గొర్రిపాటి వెంకటసుబ్బయ్యగారు కాంగ్రెస్ ఎన్నిక ప్రణాళికలో జమీన్ రైతులకు చేయబడ్డ వాగ్దానములేవో వివరించి చెప్పారు. రైతుల ఋణబాధానివారణకై చేయబడిన చట్టం తగినంతగా ఉపయోగపడ్డంలేదన్నారు. ప్రామిసరీ నోట్లకు యీచట్టం చెల్లదని కోర్టులు డిక్రీలు యివ్వడం మరీ ఘోరం అన్నారు. తదుపరి ప్రకాశం పంతులుగారి ఎస్టేటుల్యాండు రివిన్యూ చిత్తు బిల్లులో ఉన్న ప్రధానాంశములను గురించి చెప్పారు. ఈ ఆక్టు విచారణసంఘంవారు విచారణ ప్రారంభించిన తేదీ లగాయతు అమలు జరగాలని సూచించారు. బిల్లులో రైతుల కవసరమైన సవరణలుకూడా చేర్చడానికి రైతాంగము తమ తమ సంఘాల ద్వారా ఆందోళన చేయవలసినదిగా హెచ్చరించారు.

అనంతరం శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, చెలసాని వాసుదేవరావు, వాసిరెడ్డి శివలింగప్రసాద్ గారలు జమీందారీ పద్ధతి క్రింద రైతులనుభవిస్తున్న దుర్భర పరిస్థితులను గురించి ఉపన్యసించారు.

తరువాత మహాసభలో అనేక తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి. ఈనాము రైతులకు సంబంధించినంతవరకు వారి హక్కులను కాపాడే మరొక చట్టము నిర్మింపబడే వరకూ ప్రస్తుతపు శాసనమే అమల్లో ఉంచవలెననీ, యీ చట్టం అమలుకు వచ్చే తేదీకి నిల్వ ఉన్న శిస్తుల బాకీ యావత్తూ రద్దుచేయబడాలనీ; రూపాయలో 4 అణాలుగాని, అంతకు తక్కువ గాని పండిన పంటలకు పూర్తి రెమిషన్ యిప్పించాలనీ; సాముదాయక భూములు గ్రామ పంచాయితీల వశములో ఉండాలనీ; జలాశయముల విషయంలో 3 సంవత్సరములకు మించకుండా డి. పి. డబ్ల్యు. అధికార్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే పెట్టుబడి పెట్టి జలాశయములు మరమ్మతు చేయించాలనీ; సదరు సొమ్ము ఆయా జమీందార్ల వద్ద రాబట్టుకోవాలనీ మొదలయిన సవరణలతో బిల్లు ప్రవేశపెట్టబడాలని కోరుతూ తీర్మానించబడింది.

కృష్ణాజిల్లా జమీన్, యీనాము రైతు మహాసభ.

పై మహాసభ యీనెల 8 వ తేదీని నూజవీడు తాలూకా, ఆగిరపల్లి గ్రామంలో శ్రీ డి. శ్రీనివాసయ్యంగారు, బి. ఏ. బి. యల్. గారి అధ్యక్షత క్రింద అతివైభవంగా జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి సుమారు రెండు వేలమంది రైతులు వచ్చారు.

ఆహ్వాన సంఘాధ్యక్షులైన శ్రీ కామినేని వెంకటప్పయ్యగారు, యీ జిల్లాలో జమిందారీ-మొఖాసా గ్రామాదులలో రైతులు పడుతూన్న యిబ్బందులు విశదీకరించారు.

పిమ్మట, అధ్యక్షులైన శ్రీనివాసయ్యంగారు తమ దీర్ఘమైన అధ్యక్షోపన్యాసం చదివి వినిపించారు. పెర్మనెంట్ సెటిల్మెంటు మన దేశంలో ఏవిధంగా ప్రవేశ పెట్టబడినదో స్పష్టీకరించారు. 1802, 1822, 1865, 1908, 1936 సంవత్సరాలలో చేయబడిన శాసనాలు కూడా రైతు యొక్క కష్టాలను నివృత్తి చేయలేకపోయాయన్నారు. ప్రకాశం కమిటీ రిపోర్టులోగల అంశాలన్నీ పేర్కొని చెప్పారు. 1802 నాటి శిస్తే న్యాయసమ్మతమైనదని నిర్ణయించడము సరికాదని కమిటీ సభ్యులను విమర్శించారు. జమిందారీ పద్ధతిని ఆచంద్రార్కముగా నిలబెట్టుటకు కమిటీవారు ప్రయత్నించడం ఏవిధంగాను సమర్థించదగిన విషయం కాదన్నారు. ఇంతవరకూ బాగానే ఉంది. కాని, రైతుయొక్క నేటి శిస్తు భారాన్ని చాలవరకూ తగ్గించుచున్న ప్రకాశం కమిటీవారి సూచనలను బలపరచుటకు మారు, శ్రీనివాసయ్యంగారు, కమిటీ సభ్యులతో ఏకీభవించని మహబూబ్ ఆలీబేగ్, ఎ. రంగస్వామి అయ్యంగారియొక్క జమిందారీ విధాన ఖండనను తాము కూడా సభలో వల్లించారు. కాని, తమ ఉపన్యాసాన్ని ముగిస్తూ శ్రీనివాసయ్యంగారు దూరాలోచనతో కూడిన సలహాయే యిచ్చారు. పర్మనెంటు సెటిల్‌మెంటుపద్ధతిని అంగీకరించినప్పటికీ, విచారణకమిటీ సూచిస్తున్న మార్పులవల్ల రైతు కొన్ని సౌకర్యాలను పొందగలుగును కాబట్టి వాటిని అంగీకరించవలసిందన్నారు. తగువైన సవరణలుకూడా కొన్ని సూచించాలన్నారు. రైతు ఆశయం అయిన జమిందారీ విధాన నాశనం పూర్తిగా సఫలమయ్యేవరకూ పోరాటం సాగించుట రైతుల కర్తవ్యం అని హెచ్చరించారు.

పిమ్మట చిత్తేల గ్రామ కాపురస్థులును రైతు నాయకులును అయిన శ్రీ కొల్లి బుచ్చయ్యగారు తిరువూరు తాలూకాలోని మొఖాసా రైతులు వ్యవసాయ కూలీలు పడుతున్న బాధలను గురించి ఉపన్యసించారు. ఆంధ్ర రాష్ట్ర రైతుసంఘాధ్యక్షులయిన శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు, కార్యదర్శి చెలసాని వాసుదేవరావుగారు, ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం సూచించిన సవరణలేవో సభికులకు తెలియజేశారు.

తీర్మానములు.

జమీందారీ విధానము వల్ల అంతరించిన అనాది సిద్ధములయిన హక్కులను రైతులకు కొంతవరకూ తిరిగి పునరుద్ధరించుచున్న ప్రకాశం కమిటీ నివేదికను బలపరుస్తూ తీర్మానించబడింది. అయినప్పటికీ, కొత్త బిల్లు కొంత కాల పరిమితికి లోబడి, జరిగిపోయిన అంశములకు కూడా వర్తించాలి; ఎస్టేట్లన్నింటిలోనూ జాయంటు పట్టాలు ఎప్పటి కప్పుడు విడదీయబడేటట్లు చట్టంలో విధించబడాలనీ; శిస్తు వసూళ్లు ఫిబ్రవరి 10 వ తేదీకి ముందు ప్రారంభించకూడదనీ; జూన్ 30 లోగా జప్తులు ప్రారంభించరాదనీ; జమీందారీ-రైతు తగాదాలను పరిష్కరించడానికి జిల్లాకొక్క సంచారపు ల్యాండ్ కోర్టు చొప్పున స్థాపించాలనీ; మూడు సంవత్సరాలలో ప్రతి ఎస్టేటులోనూ భూములు సాగుకు వచ్చేలాగును, రైతుల అర్జీలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వమే జలాశయములు బాగు చేయించి, ఆ ఖర్చును జమీందారువద్ద వసూలు చేయాలనీ; ఆక్టు అమలులోకి వచ్చినప్పటినుంచీ 1 సంవత్సరం లోపల సర్వేకాని ఎస్టేట్లలో సర్వే చేయించి తీరాలనీ; యిందుకైన రైతుల వద్ద ధనం వసూలు చేయకూడదనీ; జమీందారీ అడవులను కొండలను రైతుల సౌకర్యార్థం కొంత భాగాన్ని విడిచిపెట్టాలనీ; యిప్పుడు జమీందార్ల చేత స్వయంగా ఆక్రమింపబడినట్టిగాని, పట్టాలు యివ్వబడినట్టిగాని అడవి-కొండ ప్రదేశాలను శాసన రీత్యా తిరిగి సాముదాయక భూములుగా కేటాయింపు చేయాలనీ; వేలంలో జమీందార్లు కొన్న భూములు 3 సంవత్సరాల కంటె ఎక్కువ కాలం జమీందారుయొక్క స్వాధీనంలో ఉండకూడదనీ; పెదప వెనుకటి జిరాయతీదారునకే పట్టా వ్రాసి ఈయవలసిందనీ మొదలయిన సవరణల ప్రకారం బిల్లు శాసనముగా చేయబడాలని మహాసభలో తీర్మానించబడెను.

* * * * * *

16 వేల మంది రైతుల యాత్ర.

ఈనెల 7 వ తేదీని సోంపేట తాలూకా రైతులు 8 వేల మంది, మందాసా, బుదారు, సింగి-బాపు-జలంత్ర-తలతంపర మొదలైన ప్రాంతాల నుంచి మరొక 8 వేల మంది రైతు రక్షణ యాత్రగా బయల్దేరి, జిల్లా రైతు సంఘాధ్యక్షులైన శ్రీ గౌతు లచ్చన్నగారి నాయకత్వాన సోంపేట తాలూకా అఫీసు చేరుకున్నారు. అక్కడవారు ప్రకాశం కమిటీవారి నివేదికను బలపరుస్తూ, మరికొన్ని సవరణలతో కూడిన మెమోరాండమును తహసీల్దారుగారికి దాఖలా చేశారు.

ఇదేవిధంగా అనేక వేలమంది జమీందారీ, యీనాం రైతులూ, కొండవాలి రైతులూ టెక్కలి తాలూకా ఆఫీసు దగ్గరకు రైతు యాత్రగావచ్చి మెమోరాండంలు యిచ్చారు.

ఇంకా వేలకొద్దీ రైతులు నరసన్నపేట, పాతపట్నం మొదలైన తాలూకా ఆఫీసులకు ప్రయాణమై పోతున్నారు. ఈవిధంగా ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి వెల్లడి చేయడానికి రైతులు పూనుకున్నారు.

* * * * * *

ప. గో. జిల్లా జమీన్ ఈనాం రైతు మహాసభ.

పైసభ ధర్మాజీగూడెంలో 7-1-39 వ తేదీని శ్రీ సుంకర సూర్యనారాయణగారి అధ్యక్షతను జరిగెను. అనేక వందలమంది రైతులు, కూలీలు చుట్టుప్రక్కలనుండి జయజయధ్వానములతోను ఊరేగింపులుగా వచ్చారు. శ్రీ వాసిరెడ్డి శివలింగప్రసాద్ గారు మహాసభకు ప్రారంభోత్సవం జరిపారు. ఆంధ్రరాష్ట్ర రైతు సంఘాధ్యక్షులు శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు ప్రకాశం కమిటీ రిపోర్టును గురించీ, రాష్ట్ర రైతు సంఘము చేసిన సూచనలను గురించి ఉపన్యసించారు. బిల్లు ఏకారణం చేతనైనా ప్యాసుకాకపోయినట్లయితే రైతులు సత్యాగ్రహం చేయవలసియుంటుందని హెచ్చరించారు.

అధ్యక్షోపన్యాసం పూర్తి అయిన తరువాత మహాసభలో తీర్మానము అంగీకరించబడెను. ఆంధ్రరాష్ట్ర రైతు సంఘము సూచించే సవరణల ప్రకారం బిల్లు ప్యాసు చేయవలసిందని మదరాసు ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించబడెను.

* * * * * *

పోతురెడ్డిపల్లి.

నూజవీడు తాలూకా పోతురెడ్డిపల్లి గ్రామ రైతు సంఘం 10-1-39 వ తేదీని శ్రీ అక్కినేని వెంకట్రామయ్యగారి అధ్యక్షతను సమావేశమై, ప్రకాశం కమిటీ రిపోర్టును బలపరుస్తూ ఆంధ్రరాష్ట్ర రైతుసంఘంవారు సూచించిన సవరణలను ఆమోదిస్తూ తీర్మానించెను.

* * * * * *

మునగాల ఎస్టేటులో రైతు ప్రచారం.

ఈ నెల 6 వ తేదీని మునగాల రైతు ప్రచారకులు 2 దళాలుగా ఏర్పడి, ఒక దళం శ్రీ వెంకట్రామనర్సయ్యగారి నాయకత్వమున నేలమర్రి, కొమరబండ మొదలయిన గ్రామాలను, రెండవదళం శ్రీ కందుల రామయ్యగారి నాయకత్వమున నడిగూడెం, రామాపురం, మాధవరం గ్రామముల మీదుగాను ప్రచారం చేయుచున్నారు. ప్రతిగ్రామంలోను సభలు జరిపి ప్రకాశం కమిటీ నివేదికను బలపరుస్తూ ఆంధ్రరాష్ట్ర రైతు సంఘంవారి సూచనలకు ఆమోదం తెలియజేస్తూ రైతులు అధిక ఉత్సాహముతో ఉన్నారు. ఈ నెల 19 వ తేదీవరకూ ఎస్టేటు ప్రతి గ్రామములోనూ యీవిధంగా ప్రచారం సాగునని తెలుస్తోంది.

కమ్యూనిస్టులు కాంగ్రెసులో ఉండరాదా?


డా॥ పట్టాభిగారి అర్థంలేని ఆరోపణలు - సుందరయ్య సమాధానం

పట్టాభిగారి స్టేటుమెంట్

త్రిపుర కాంగ్రెస్ ప్రతినిధి, రాష్ట్రీ కాంగ్రెస్ సంఘ సభ్యత్వ ఎన్నికల సందర్భంలో పి. సుందరయ్య అభ్యర్థిత్వాన్ని గురించి యీ క్రింద సంగతులు తెలియజేస్తున్నాను.

నెల్లూరు జిల్లా కాంగ్రెసు సంఘాధ్యక్షుడు ఒక కాంగ్రెసువ్యక్తి తరచు జిల్లాసంఘఆఫీసుకు వస్తూ, ఆఫీసులలో కమ్యూనిస్టు సాహిత్యమున్న పెట్టెను దాస్తున్నాడు అని నాకు తెలియజేసాడు. జిల్లా కాంగ్రెసు అధ్యక్షుడు ఇటుల సాగనిచ్చుట అపాయకరమని తలంచి నాకు ఎరుక పరచాడు. నేను వారికి, మధ్యవర్తుల ఎదుట ఆసంగతి ఋజువుచేయాలనియు, దానిలో అట్టి సాహిత్యమున్న అందుకు సంబంధించిన వ్యక్తిని సంజాయిషీ అడుగవలసిందని సలహా యిచ్చాను. అందుపై జిల్లా కాంగ్రెసు అధ్యక్షుడు కాంగ్రెసుకు కొత్తయు, మితవాది అయిన జిల్లా బోర్డు అధ్యక్షుని, యింకా ముగ్గురు నల్గురు మిత్రులను పిలచి, వారియెదుట ఆ యువకుని ఆపెట్టె తెరువవలసిందని అడిగినాడు. ఆపెట్టె నిండా కమ్యూనిస్టు సాహిత్యము, ఆ ప్రదేశాన్నుండి ఇతర సెంటరులకు పంచబడుచున్న కమ్యూనిస్టు పత్రిక ప్రాతసంచికలు వున్నాయి. అందుపై ఆయువకుడు జిల్లాకాంగ్రెసు అధ్యక్షుడు ఆపత్రికలన్నీ పోలీసువారి స్వాధీనం చేస్తాడని భయపడి ఆసాహిత్యమంతా తీసుకు వెళ్ళాడు. ఒకదిమాత్రం వృద్ధ కాంగ్రెసువాది అయిన బి. పెరుమాళ్ళనాయుడు, ఎం.ఎల్.ఏ. చదువుతున్నాడు. కొంతసేపటికి జిల్లా కాంగ్రెసు అధ్యక్షుడు ఎవరో పిలుచుటచే బయటకు వెళ్ళాడు. అతడు బయట వెళ్ళుటతోనే, ఆదిశేషయ్య అను ఆ యువకుడు ఆ వృద్ధ కాంగ్రెసువాది బల్లపై వురికి చదువుచున్న పత్రికను లాక్కుపోయాడు. శ్రీ సుందరయ్య యీ రాష్ట్రములో పక్కా కమ్యూనిస్టుపార్టీవలే పనిచేస్తున్న కాంగ్రెసు సోషలిస్టు పార్టీ నాయకుడు, ఈ మధ్య ఆపార్టీలో వచ్చినతగాదాలన్నిటిలో ముఖ్యపాత్రగావుండెను. కమ్యూనిస్టు సాహిత్యం కాంగ్రెసు ఆఫీసులో దాచుట, కాంగ్రెసు ఆఫీసును చాలా అభ్యంతరకరమైన కమ్యూనిస్టు సాహిత్యాన్ని వ్యాపింపజేయడానికి కేంద్రముగా చేయుట, శ్రీ సుందరయ్య ఎరుక, అనుమతి లేకుండా జరుగజాలదు.

కాంగ్రెసు ప్రతినిధుల ఎన్నికలలో, నామినేషన్లు దాఖలు చేసినపుడు, నెల్లూరు జిల్లా కాంగ్రెసు ఎలెక్షను కమిటీ సుందరయ్య నామినేషను నిరాకరించింది. సుందరయ్య ఆతీర్పుపై అప్పీలు చేయుటకు 31—12—38 తేదీ నావద్దకు వచ్చాడు. అప్పీలును నేను అధికార రీత్యా సభ్యుడనైన, ముగ్గురు సభ్యులతోకూడిన ఎన్నికల కమిటీకి వ్రాతలో దాఖలు చేయవలసినదని చెప్పాను. అందుపై సుందరయ్య ముఖ్యసూత్రంపై ఆధారపడినది కాబట్టి తన అప్పీలును ఎన్నికల కమిటీ ముందుగాక పూర్తి కార్యసంఘము ముందే పెట్టవలసిందని కోరాడు. నేను కార్యసంఘము యెదుట పెట్టుటకు అంగీకరించాను. అతను కొన్ని ప్రశ్నలకు జవాబిచ్చాడు. అతడు కమ్యూనిస్టుననియు, కమ్యూనిస్టు పుస్తకాలు చదువుచున్నాననియు, కమ్యూనిస్టు పత్రికలు వస్తున్నాయని చెప్పాడు. కాని అవి యెచటినుండి వస్తాయో, ఎవరెవరికి వాటిని పంపుచున్నాడో మాత్రం చెప్పలేదు. అతని జవాబులనుబట్టి కాంగ్రెసు ఆఫీసులో కమ్యూనిస్టు సాహిత్యం వుంచుటకు, అచటి నుండి పంచుటకు అతడే బాధ్యుడని తేలుతూంది. నిషేధింపబడిన వాఙ్మయం విషయం ఒకపార్టీ నాయకుడు ఇలాచేయడం చాలా తగని పని. ఇంతేగాక అప్పీలు పిటీషనే ఒక చిత్రమైన పత్రము. ("ఇది మీరు చూడటానికి అనువదింపబడి చివర చేర్చబడింది" అని వ్రాసి కొట్టివేయ బడింది) ఈపత్రంలో అతడు మార్క్సు అనుచరుడననియు, మార్క్సిస్టుగా సమస్యా పరిష్కారికోసం హింస అవసరమౌతుందని నమ్ముతానని ఒప్పుకొన్నాడు. కాంగ్రెసు ప్రమాణపత్రంపై సంతకముచేసి అహింస యెడల రాజనీతిగా (పాలసీ) తప్ప నమ్మకం లేదనుట వేరు; విధానం, ఆదర్శము ఒకటే కాదంటూ తనకు నమ్మకంలేని ప్రమాణపత్రముపై సంతకం చేయుటవేరు. ఇది జాగ్రత్తగా గమనించవలసిన సంగతి.



ఆంధ్రదేశంలో నిజంగా కమ్యూనిస్టు పార్టీ నుండి ఉత్సాహాన్ని పొందుచున్న కాంగ్రెసు సోషలిస్టు పార్టీకి చెందిన యువకులు ఇదివరకు చాలా ఉద్రేకపూరితమైన ఉపన్యాసాలు ఇచ్చారు. వారు ఎల్లపుడు బొంబాయిలోని కమ్యూనిస్టు పార్టీ నాయకులతో సంబంధం కలిగివున్నారు. పార్టీలో ప్రధానమైన వారు మొదలు సామాన్య సభ్యులవరకు, యిచ్చు ఉపన్యాసాలు నిప్పులు గ్రక్కు, హింసా ప్రకృతి గల్గినవి. కొన్ని ఉపన్యాసాలు అఖిలభారత కాంగ్రెసు వర్కింగు కమిటీ ముందు పెట్టబడినవి. ఈ ఉపన్యాసాల ఫలితంగా కాంగ్రెసు వర్కర్లు గ్రామాలలో ప్రచారంచేయుట అసాధ్యమవుతూంది. ఈ యువకులను ఆవిషయమై హెచ్చరించినపుడు, అవన్నీ సి. ఐ. డి. వారి లేక తమకు వ్యతిరేకులైన కాంగ్రెసువారి లేక జమీందారీ హితుల రిపోర్టులని ఉడిచి వేసారు. పైన చెప్పినవారిలో ఎవరో ఒకరి వద్ద నుండి వచ్చిన రిపోర్టులు, వీటికితోడుఇతర స్నేహితులనుండి వచ్చు రిపోర్టులనుండియే మనకు సంగతులు తెలుస్తాయి. ఆంధ్ర కార్యసంఘం, పార్టీనాయకుడే యీరకపు ప్రచారానికి,వాఙ్మయపంపకానికి బాధ్యుడనియు, సుందరయ్య అహింసను మతంగాగాక పాలసీగా కూడ అంగీకరించుట లేదనియు, నిర్ణయించింది.

మచిలీపట్నం
జనవరి 5 } (సం.) బి. పట్టాభిసీతారామయ్య.

కామ్రేడ్ సుందరయ్య జవాబు

డాక్టరు పట్టాభిగారి స్టేట్మెంటు యదార్థ పరిస్థితుల్ని మరుగు పరుస్తోంది. కామ్రేడ్ ఆర్. ఆదిశేషయ్య నెల్లూరు జిల్లా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో సభ్యుడు. అతడు నెల్లూరు పట్టణ కాంగ్రెస్ కమిటీకి సంయుక్త కార్యదర్శిగా కూడ ఉన్నాడు. ఒకనెల క్రితంవరకూ కాంగ్రెసు సోషలిస్టు పార్టీకి ప్రత్యేక కార్యాలయం ఉండేది. కామ్రేడ్ ఆదిశేషయ్య ఆకార్యాలయంలో నివసిస్తూ ఉండేవాడు. ఈ మధ్యనే అతడు తన ట్రంకు, పరుపు తీసుకొని వెళ్ళి కాంగ్రెస్ ఆఫీసులో ఉంటూవచ్చాడు. ఎందువల్లనంటే, పట్టణ కాంగ్రెస్ కమిటీ కార్యాలయం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలోనేఉంది.

నేను, తమిళనాడు కాంగ్రెసు సోషలిస్టు పార్టీ మహాసభ జరిగిన తర్వాత రాజపాళయం నుంచి తిరిగిరాగానే, కామ్రేడ్ ఆదిశేషయ్యలేని సమయాన, డిసెంబరు 28 వ తేదీని అతని ట్రంకు తెరువబడినదని నాకు నెల్లూరు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సభ్యులు తెలియజేశారు.



ట్రంకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుని గదికి చేర్చబడినది. ఆయన బందరువెళ్ళి 30 వ తేదీని తిరిగి వచ్చేవరకూ దానికి తాళం వేయబడింది. గదివద్ద ఒక మనిషికూడా కాపలాగా ఉంచబడ్డాడు. పిమ్మట కామ్రేడ్ ఆదిశేషయ్యను లోనికి పిలిచారు. అతని యెదుట ట్రంకును తిరిగి తెరిచారు. దాంట్లో, "కమ్యూనిస్టు" పత్రిక యొక్క 4 సంచికలు, ఒక్కొక్క సంచికను ఒక్కొక్క ప్రతి చొప్పున, కనపడ్డాయట. ఇక యేమీ లేవట. వాటిలో ఒక సంచికను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఉంచుకొన్నాడట. బహుశ, ఆంధ్ర వర్కింగ్ కమిటీవారికి దాన్ని రుజువుగా తీసుకొని వెళ్ళడానికి ఆవిధముగా చేసి యుండవచ్చు. 30 వ తేదీ మధ్యాహ్నం 3 గంటల ప్యాసింజరులో నేను నెల్లూరు విడిచిపెట్టి, బెజవాడ వెళ్ళాను. ఆసంచిక ఏవిధంగా "లాగుకొనబడిందో" నాకేమీ తెలియదు.

వర్కింగ్ కమిటీ యెదుట నన్ను క్రాసపరీక్షచేసినప్పుడు, కామ్రేడ్ ఆదిశేషయ్య ట్రంకులో "కమ్యూనిస్టు" పత్రికలుండడానికి నేను ఏవిధంగాను బాధ్యుడను కానననీన్నీ, కమ్యూనిస్టుసాహిత్యాన్ని నేను పంచిపెట్టడములేదనిన్నీ, ఆంధ్ర రాష్ట్రంలోగాని మరెక్కడగాని నేను కమ్యూనిస్టు పార్టీనాయకుణ్ణి కానననిన్నీ; ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు సోషలిష్టుపార్టీకి నేను కార్యదర్శిని మాత్రమేననిన్నీ; స్పష్టంగా తెలియజేశాను.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సోషలిష్టుపార్టీ కమ్యూనిష్టుపార్టీ గానే పనిచేస్తున్నదను ఆరోపణకు నేను జవాబు చెప్ప నవసరం లేదు. అది అసత్యం మార్క్సు, ఎంగిల్సు, లెనిన్ల సిద్ధాంతాలను ఆధారం చేసుకొని, ఆంధ్ర కాంగ్రెస్ సోషలిష్టుపార్టీ తన కార్యక్రమం ప్రకారం పనిచేస్తోంది. మీరట్, ఫెయిజ్పూర్లలో ఆమోదించబడిన అఖిలభారత కాంగ్రెస్ సోషలిష్టుపార్టీ థీసిస్పైననే ఆధారపడియుంది ప్రతి వ్యతిరేకినీ, ప్రతి సోషలిష్టునీ, కమ్యూనిష్టు అనిగాని - కమ్యూనిష్టుపార్టీ సభ్యుడనిగాని నిందారోపణలుచేయడం కొత్తకాదు ఇండియాలో. మనకు కావలసినంత అనుభవం ఉన్నదని నా విశ్వాసం.

స్పెయిన్లో నేడు ఉన్న ప్రజాస్వామిక ప్రభుత్వం "కమ్యూనిస్టు" ప్రభుత్వం అని ప్రపంచం అంతటా ఫ్రాంకో ఏజంట్లు ప్రచారం చేస్తున్నారు. మన దేశంలో, 1930-34 సంవత్సరాల మధ్య కాంగ్రెసుసంస్థనే "కమ్యూనిస్టు" సంస్థ అని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ..చారోపణ చేశారు. కాంగ్రెసునుంచి అతివాదుల్ని తరమడానికి డాక్టరు పట్టాభికీ యింతకంటె మరొక మార్గం కనబడలేదా అని మాత్రంనేను చింతిస్తున్నాను.

"పార్టీ సభ్యులలో తగవులున్నా" యనీ, "నేనే వాటిలో ప్రధాన పాత్ర వహిస్తున్నా" ననీ అన్నారు పట్టాభిగారు. ఆ మిత్రులు నేడు పార్టీ పనిని మామూలుగానే కొనసాగిస్తూ, పట్టాభిగారికి యిదివరకే తగిన జవాబుచెప్పారు. మాలో తగవులుండిన మాట వాస్తవమే. ఇక ముందుకూడా ఉంటాయి. కాని, యిది ఏ విధంగా నేను కమ్యూనిస్టు పార్టీ ఏజంటునని రుజువు చేయడానికి పనికి వస్తుందో బోధపడ్డం లేదు.

"నీవేమైనా కమూనిస్టు సాహిత్యాన్ని చదివితివా అనీ; ఇండియాలోను గల కమ్యూనిస్టు ఉద్యమ సిద్ధాంతాలు నీకుతెలుసునా అనీ" నన్ను డాక్టరు పట్టాభిగారు, ఆంధ్ర వర్కింగుకమిటీలోని వారి అనుచరులు, ప్రశ్నించారు. "తెలుసు" నని నేను చెప్పాను, ఈ సాహిత్యాన్ని నేను ఏవిధంగా సంపాదిస్తున్నానని వారడిగారు, పోస్టులో వస్తుందని నేను జవాబుచెప్పాను. విదేశపరిపాలనను ఎదిరిస్తూ, ఎడతెగని పోరాటాన్ని సాగిస్తున్నందుకు రాత్రింబగళ్లు బ్రిటిష్ గూఢచారులవల్ల వెంబడించబడుతూన్న కమ్యూనిస్టు మిత్రులపేర్లు, వారి చిరునామాలు నేను బట్టబయలొనర్చి, నేను కూడా ఒక ప్రభుత్వపు ఏజంటువలె ప్రవర్తించలేదు; ప్రవర్తించజాలను డాక్టరు పట్టాభిగారికి మాత్రం ఆపని ఎంతో సులభంగా కనపడింది. అందువల్లనే, ఎక్కడనుంచి గ్రంథాలు బ్రిటిష్ పోస్టాఫీసువారు తెచ్చి పెడుతున్నారో నేను చెప్పకపోవడం డాక్టరు పట్టాభిగారొక నేరముగా గోరంతలు కొండంతలుగా చేసి చెపుతున్నారు.

ఇది డా॥ పట్టాభి చేయవలసిన పని కాదు.

"అహింసా సిద్ధాంతము నొక రాద్ధాంతముగా చేయకూడదు"

జనవరి 11 వ తేదీన ఆంధ్రప్రభ సంపాదకీయంలో యిలా వ్రాసింది....

"నేటి ఉదయము "ఇండియన్ ఎక్స్ప్రెస్" పత్రికలో ప్రకటితమై యున్న ఆ లేఖలను చూస్తే— అందొక ముఖ్య మూల సూత్ర మిమిడి యున్నదని తెలియగలదు.

సుందరయ్యగారి నామినేషను పత్రము రద్దుచేయబడుటకు కారణము, అతని రాజకీయాభిప్రాయములే- అతడు తాను "కమ్యూనిస్టు"నే అని ఒప్పుకొన్న హేతువే, అని పట్టాభిగారే అంగీకరించుచున్నారు. దానిని బట్టి "కమ్యూనిస్టు" లయినవారికి కాంగ్రెసులో స్థానమే లేదా, అన్న ప్రశ్న రాక తప్పదు. "కమ్యూనిస్టులు" అనే ఒక జాతికో, వర్గమునకో చెందినవారు కాంగ్రెసులో నుండకూడదన్న నిబంధన ఎచ్చటనూ లేదు. కాబట్టి సుందరయ్యగారికి ఎన్నికలలో నిలచుటకును, పాల్గొనుటకును, గల హక్కు నిరాకరించుటకు వీలులేనిది.

డాక్టరు పట్టాభి శీతారామయ్యగారిందుకు సమాధానమిస్తూ, సుందరయ్యగారు, రాష్ట్రీ వర్కింగు కమిటీకి చేసిన అప్పీలులో తాను సామ్యవాదులలో మార్క్సు సిద్ధాంతమునకు చెందినవాడననియు, అందువల్ల దౌర్జన్య రాహిత్యమును, కేవలము తన ప్రస్తుత విధానముగా (పాలసీగా) మాత్రమే అంగీకరించు చున్నట్లును, ఎప్పటికైనా తప్పనిసరిగా దౌర్జన్యము రాక తప్పదనే, తన విశ్వాసమనిన్నీ, వ్రాసి యుండుటచేత—కాంగ్రెసు మూల సూత్రమైన దౌర్జన్య రాహిత్యముపై సంతకము చేసినను, అందు ఆత్మ విశ్వాసములేని వాడగుటచేతనే అతనిని కాంగ్రెసులో చేర్చుకొన వీలులేక పోయినదని డాక్టరు పట్టాభిగారు సమర్థించుచున్నారు....

ఈ సమర్థన మంతా హేతు బద్ధముగా కన్పడుట లేదు....

సుందరయ్యగారు, విశ్వాసముగా కాకపోయినా, విధానముగానైనా, దౌర్జన్య రాహిత్యమును స్వీకరించు చున్నంత కాలము కాంగ్రెసు సభ్యత్వపు హక్కును వారికి నిరాకరించుటకు అధికారములేదు.

ఆచరణలో వ్యతిరేకముగా ప్రవర్తించనంత కాలం వారు త్రికరణశుద్ధిగా అహింసా విధానమునకు బద్ధులై యుందురనియే నమ్మవలసి యుండును.

ఈమధ్యనే మద్రాసు ప్రధానమంత్రియైన రాజగోపాలాచార్యులుగారే, ఈ అహింసాసిద్ధాంతము, రాజ్యాంగ నిర్వహణపు ఒత్తిడిలో సంపూర్ణంగా, త్రికరణశుద్ధిగా, ఆచరణ సాధ్యమగుట లేదని, ఆత్మానుభవపూర్వకంగా చెప్పలేదా?

సత్యము, అహింస, అనునవి మహోత్కృష్టమయిన ఆదర్శ గుణములు. మహాత్ముని జీవితమంతా వాటి సాధన మాత్రమే, అని పలుమార్లు అతడే ప్రకటించు చుండ, ఆ ఆదర్శ గుణములు కాంగ్రెసు లోని ప్రతి ఒక్కనియందు కలవా లేదా, అని పరీక్ష చేయబూనుకొనుట రాష్ట్రీ వర్కింగు కమిటీకి శక్తికి మించిన పనియే అగును.

ఏది యెట్లున్నను, సుందరయ్యగారివంటి యువకులను కాంగ్రెసు నుండి బలవంతముగా వెళ్ళగొట్టుటకు యీ అహింసా సిద్ధాంతము నొక రాద్ధాంతముగా చేయకూడదు.

కమ్యూనిజం....కమ్యూనిజం.... అని ఏదో ప్రళయ భయంకర స్వరూపమును మానసవీధిని సృష్టించుకొని, దాని విధ్వంసము చేయవలసిన మహత్తరమైన కార్యభారము తమ భుజస్కంధములపై నున్నదని పరిభ్రమించుట వెనుకటి కాలపు నిరంకుశ సామ్రాజ్య వాదులకు గాని, పట్టాభిగారివంటి కాంగ్రెసు నాయకులకు తగియుండలేదు....

సామ్యవాదులనబరగు యువకులలోనే భావి భారత స్వాతంత్ర్య యోధులు కలరు. ప్రజా నాయకులయిన పట్టాభిగారివంటి పెద్దలు, నూతన భావావిర్భావపూరితులయిన యువకుల పట్ల చూపవలసిన ఆదరణమిదికాదు.

నాకు అహింసా విధానం యెడల విశ్వాసం లేదని నా అప్పీల్ పిటిషన్లో నేనే ఒప్పుకొన్నానని అపార్థం చేస్తున్నారు. ఆంధ్రరాష్ట్రీ వర్కింగ్ కమిటీ వారికినేను చేసిన అప్పీల్ పిటిషన్ యొక్క ప్రతిని యిక్కడ ఇస్తున్నాను.

అప్పీల్ పిటీషన్

క్యాంప్, మచిలీపట్నం.
31—12—38

"ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘాధ్యక్షులకు,

ఆర్యా,

నెల్లూరు జిల్లా కోవూరు తాలూకా నియోజక వర్గానికి నేను అఖిల భారత జాతీయ మహాసభ ప్రతినిధిత్వానికి అభ్యర్థిగా నిలువబడదలచి దరఖాస్తు దాఖలు చేసితిని. నిన్న, మా జిల్లా కాంగ్రెసు సంఘాధ్యక్షుడు, ఎన్నిక కమిటీ అధ్యక్షుడు, నా దరఖాస్తును నిరాకరించినట్లు తెలియజేసెను. కారణము, నేను కమ్యూనిస్టు ననియు, కమ్యూనిస్టు పార్టీతో సంబంధ మున్నదనియు వారికి బాగా అనుమాన ముండుటచేతను, కమ్యూనిస్టులు హింసావలంబకులు గాన కాంగ్రెసులో వారికి స్థానముండకూడ దనియు ఉద్దేశించి నిరాకరించినట్లు తెలియజేశారు.

"నేను ప్రస్తుతము అ॥ భా॥ కాంగ్రెస్ కమిటీ (ఎ. ఐ. సి. సి.) సభ్యుడుగను, జిల్లా కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సభ్యుడుగను ఉన్నాను. కాంగ్రెసులో నేను ఉండకూడదని పక్షాన మొదట నాపై డిసిప్లినరీ చర్య తీసుకోవలసినదే గాని నా దరఖాస్తును త్రోసివేయడము న్యాయము కాదు.

"కమ్యూనిస్టు పార్టీ నిషేధింపబడి ఉంది. అందులో నేను సభ్యుడనుగానని వేరే చెప్ప నవసరము లేదు. కాని, కమ్యూనిస్టు సిద్ధాంతాలను నేను విశ్వసించుచున్నాను. మార్క్సు, ఏంగిల్సు, లెనిన్ సిద్ధాంతాల ననుసరించి పనిచేసే ప్రతి వ్యక్తీ కమ్యూనిస్టుగా ఉండక తప్పదు. కమ్యూనిస్టులు హింసావలంబకులు కాదు. నూతన సమాజాన్ని నెలకొల్పడాన్ని ప్రస్తుతము అధికారమున నున్నవారు, హింసను ఉపయోగించి నాశనము గావించేటప్పుడు, క్రొత్త ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి ఆఖరిపోరాటము సాగినప్పుడు అధికారమందున్నవారు ఉపయోగించు హింసను ఎదుర్కొడానికి, ప్రతిహింసను ఉపయోగించక తప్పదని కమ్యూనిస్టులు విశ్వసిస్తారు. ఈ లోపల శాంతియుతముగానే ప్రజా చైతన్యమును వృద్ధిపొందించడానికి ప్రయత్నిస్తారు. అందుచేతనే కాంగ్రెసులోనుండు కమ్యూనిస్టులందరు, కాంగ్రెసు ఆశయమైన శాంతియుత—ధర్మయుత మార్గాలను పాలసీ (రాజనీతి) గా అంగీకరించి పని చేస్తున్నారు.

"ఈ పరిస్థితులలో కమ్యూనిస్టు భావాలు కలవారు కాంగ్రెసులో ఉండకూడదనే ఉద్దేశముతో నా దరఖాస్తును నిరాకరించినప్పుడు, ఇది కేవలము ఒక ఎన్నిక సమస్యగా పరిగణించక, ఆంధ్ర కాంగ్రెసు వర్కింగ్ కమిటీయే ఈవిషయాలను పరిష్కరించవలసియుండునని ఉద్దేశముతో, వర్కింగ్ కమిటీ ముందు ఈ విషయము మీరు తీసుకొనిరావలసినదిగా కోరుచున్నాను. వర్కింగ్ కమిటీ కూడ, కమ్యూనిస్టులకు కాంగ్రెసులో స్థానము లేదు అనే అభిప్రాయానికే వచ్చినచో నా దరఖాస్తును త్రోసివేయడము సరియే, లేనిచో, జిల్లా ఎన్నికోద్యోగి నిర్ణయము తప్పు. ఈవిషయము మీరు ఏదో ఒక నిర్ణయమునకు వచ్చువరకు, ఆ నియోజక వర్గములో ఎన్నిక కూడా ఆపుచేయ వలసినదిగ కోరుచున్నాను."

భవదీయుడు
(సం.) పు. సుందరయ్య

డాక్టరు పట్టాభి దీనిని ఏవిధంగా అపార్థం వచ్చేటట్లు కనపరిచాడో గ్రహించవచ్చు. కమ్యూనిస్టులు తమ ప్రభుత్వాన్ని, సాధ్యం అయితే హింసా రాహిత్య పద్ధతులవల్లనే స్థాపించాలని కోరుతారు. ఈ విషయాన్ని నేను మరొకసారి చెపుతున్నాను. కాని, స్పెయిన్వంటి ప్రజాయత్త రాజ్యాలలో మాదిరిగా, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యాకులుగా ఎన్నుకోబడి సమాజంలో మార్పులుకోసి వచ్చుటకు ప్రారంభిస్తే, ధనిక వర్గాలు ఆయుధాలు తీసుకొని న్యాయసమ్మతమైన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలబడుదురనీ, అప్పుడు వారవలంబించే హింసా విధానాన్ని ఎదుర్కొనడానికి ప్రతి హింసను ఉపయోగించకుండా మరొక మార్గం ఉండదనీ కమ్యూనిస్టులు విశ్వసిస్తారు. కాని, ఆవిధంగా రాజ్యాంగాధికారాన్ని వశపరచుకోవలసిన అంతిమ పోరాటం వచ్చేవరకు, కమ్యూనిస్టులు ఉద్యమాన్ని శాంతియుత—సక్రమ పద్ధతులన్నింటి ద్వారా వృద్ధి చేస్తారు.

హింసారాహిత్య పద్ధతులలో రాజనీతిగా సహితం, నాకు విశ్వాసము లేదని ఋజువు చేయడానికి డాక్టరు పట్టాభిగారు ఆంధ్రదేశంలో యువకులచేత ఈయబడ్డ "అనేక ఉద్రేకపూరిత ఉపన్యాసాల"ను గురించి వ్రాశారు. పోలీసుల యొక్క, ధనికవర్గాలయొక్క, తప్పుడు రిపోర్టులను పట్టాభిగారు ఆధారంగా చేసుకొని యీ విధంగా వ్రాస్తున్నారని నేను ఘంటాపథంగా చెప్పుచున్నాను. నేను స్వయంగా ఒక పోలీసు రిపోర్టు నకలు చదివి, దానియందలి భాగాల్నే డాక్టరు పట్టాభి, క్రిందటి అ. భా. కాం. కమిటీ సమావేశంలో, ఏవిధంగా మాటకుమాట వల్లించాడో విన్న తరువాతనే నేనీ విషయాన్ని ఇంత గట్టిగా నమ్ముతున్నాను. ధనికవర్గాల నిరంకుశత్వాన్ని ఎదుర్కొనడానికి ప్రజాసామాన్యంలో తమ హక్కుల్ని గురించి బోధించే ఉపన్యాసాలు ఉద్రేకపూరితంగాను, దౌర్జన్య యుతంగాను, డాక్టరు పట్టాభివంటి ధనికతత్వంతో గడ్డ కట్టిన మనుష్యులకు కనుపించడంలో ఆశ్చర్యంలేదు.

ఇక వీరంతా బొంబాయి కమ్యూనిస్టు పార్టీ నాయకులతో ఎల్లప్పుడూ దగ్గర సంబంధాన్ని గలిగియుంటున్నారని ఆరోపించ బడింది. డాక్టర్ పట్టాభి యీ విషయం కూడా ఆధార రహితమైన ఊహా ప్రపంచంలో సంచరిస్తూ వ్రాసిన వ్రాతలైనా అయి ఉండాలి లేదా పోలీసుల రిపోర్టులు ఘంటతావల్లించిన తరువాత తాను తప్పుత్రోవలలో నడుస్తూనైనా ఉండాలి.

ఇంత దీర్ఘమైన జవాబు సరిపోవునను కుంటా. డాక్టరు పట్టాభిచేసిన దాడి అపరాధ భూయిష్ఠమై పోలీసులకూ బ్రిటిష్ సామ్రాజ్యవాదులకూ అప్పగించేదిగా ఉన్నందున యింత దీర్ఘంగా వ్రాయవలసి వచ్చింది. ఇదంతా పూర్తిగా మీ పత్రికలో ప్రకటిస్తారని కోరుతున్నా

కాంగ్రెసులో కమ్యూనిస్టు లుండ వచ్చును

—వర్కింగు కమిటీ నిర్ణయం.

"శాంతి భద్రతలు కాపాడుట పోలీసు వాని పని, దానికీ పట్టాభికీ.......?"

"ఇండియన్ ఎక్స్ప్రెస్"

పత్రిక (మదరాసు) 10-1-39 వ తేదీ సంపాదకీయంలో యీ విధంగా వ్రాసింది:—

"పి. సుందరయ్యాగారు త్రిపురి కాంగ్రెస్ ప్రతినిధి ఎన్నికలలో నిలబడకూడదంటూ నెల్లూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిచ్చిన నిషేధపు ఉత్తరువుపై మేము వ్రాసిన వ్యాఖ్య డాక్టరు పట్టాభిగారివద్ద నుంచి ఒక స్టేట్మెంటును తెప్పించింది. ఆ స్టేటుమెంటు, సుందరయ్యగారి జవాబు, యీసంచికలో వేరొక చోట ముద్రించబడినది. కాంగ్రెసు ఎన్నికలలో అవసరమైన అర్హత లెట్టివో, ఉచితానుచిత సందర్భాలెట్టివో, అనే ఒక ప్రధాన సమస్యను ఆ స్టేటుమెంటు జవాబు— రెండూ తీసుకువస్తున్నాయి. కాబట్టి, సంబంధంలేని యితర విషయాలను దీనితో ముడిపెట్టకూడదు. ఆంధ్రరాష్ట్ర మందలి కాంగ్రెసు సభ్యుల హక్కులను కాపాడే అత్యున్నతమైన సంస్థ ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీ. దానికి డాక్టర్ పట్టాభిగారు అధ్యక్షులు. ఇంత బాధ్యతగల హోదాతో, దురదృష్ట వశాత్తు, డాక్టరు పట్టాభిగారు సుందరయ్యగారి కేసుకు సంబంధించిన సమస్యను పూర్తియైన నిష్పాక్షిక దృష్టితో ఆలోచించలేక పోయారు. సుందరయ్యగారు కమ్యూనిస్టు అనీ, కమ్యూనిస్టు భావాలను కలిగియున్నాడనీ, ఆయన కాంగ్రెసు ప్రతినిధి స్థానమునకు దాఖలు చేసిన నామినేషన్ నిరాకరించబడుటకు కారణం యిదే ననీ, ఉభయులూ అంగీకరిస్తున్నారు. కమ్యూనిస్టు భావాలు కలిగియుండడంవల్ల కాంగ్రెస్ ప్రతినిధిగా నిలబడకూడదని కాంగ్రెస్ నియమావళిలో ఎక్కడా చెప్పబడి ఉండలేదు. కాంగ్రెసు సభ్యుడుగా చేరిన ప్రతి వ్యక్తి కాంగ్రెసుప్రతినిధిగా నిలబడుటకుకూడ హక్కును కలిగి యుంటాడు. దీన్ని నిరాకరించడానికి ఎవ్వరికీ అధికారము లేదు. సుందరయ్యగారుకూడా కాంగ్రెసు సభ్యుడే కాబట్టి, ఆయనకు యీ హక్కు ఉండి తీరాలి. కాని, డాక్టర్ పట్టాభిగారు కమ్యూనిజంలో గల అంతరార్థాలను గురించి ఒక కొత్త సిద్ధాంతాన్ని తీసుకువస్తున్నారు కాంగ్రెసు సభ్యత్వానికి అత్యవసరమైన హింసా రాహిత్య పద్ధతినే అంగీకరించడని వాదిస్తున్నారు.

విచిత్రమైన సిద్ధాంతం

ఆంధ్ర కాంగ్రెసు వర్కింగు కమిటీ ఎదుట సుందరయ్యగారు చేసిన అప్పీలునే ఆధారంగా తీసుకొని, డాక్టరు పట్టాభిగారు యిలా వ్రాస్తున్నారు:

"అప్పీలు పిటీషనే ఒక విచిత్రమైన పత్రము. ఈ పత్రంలో అతడు (సుందరయ్యగారు) మార్క్సు అనుచరుడననియు; మార్క్సిస్టుగా, సమస్యా పరిష్కారము కోసం హింస అవసరమౌతుందని నమ్ముతాననియు ఒప్పుకొన్నాడు. కాంగ్రెసు ప్రమాణ పత్రంపై సంతకంచేసి అహింస యెడల రాజనీతిగా తప్ప నమ్మకము లేదనుటచేరు; విధానం, ఆదర్శం ఒకటి కాదంటూ: తనకు నమ్మకంలేని ప్రమాణ పత్రంపై సంతకం చేయుటచేరు". కాని, సుందరయ్యగా రిచ్చిన జవాబులో తాను దాఖలు చెసిన అప్పీలు పిటీషన్కూడా ఉంది. దానిని పూర్తిగా చదివిన యెడల, డాక్టరు పట్టాభిగారు దానికి యిచ్చిన అర్థం కనపడదు ...

ఆ పత్రం ఎంతో స్పష్టంగా వ్రాయబడి ఉంది. అహింసా సిద్ధాంతంలో నమ్మకం లేకుండా, నమ్మకం ఉన్నట్లు చెప్పే అర్థం దానిలో ఎక్కడా కనపడదు. దాని భాష అతి సులభమైనది. అర్థంకూడా సులభంగా బోధ పడుతుంది. ఇట్టి పరిస్థితులలో, తప్పుడు అర్థం తీయుట చాలా అన్యాయం. సుందరయ్యగారిమీర అపరాధమే మోపదలచుకొంటే, ఆయన అహింసా విధానాన్ని ఒక మతముగా కాక, ఆచరణ విధానముగా మాత్రమే విశ్వసిస్తాడని చెప్పాలి. కాని, కాంగ్రెసు సభ్యుడుగా ఉండడానికి యిది సరిపోవునని డాక్టరు పట్టాభిగారికి తెలిసియుండవలసింది. రాజాజీ (మదరాసు ప్రధాని) వంటి సంపూర్ణమైన అహింసా వాదులే

వర్కింగు కమిటీ నిర్ణయము

కామ్రేడ్ సుందరయ్యగారి అప్పీల్ విషయమై అ॥ భా॥ కాం॥ వర్కింగు కమిటీ ఈ దిగువ నిర్ణయమును చేసినది.

కాంగ్రెసు నిబంధనావళి ఆర్టికల్ 1 ననుసరించి ప్రమాణ పత్రముపై సంతకము చేసినంతకాలము, కాంగ్రెసు ఎన్నికలలో పోటీ చేయుటకు వారు అర్హత కలిగి యుందురు.

ఈ తీర్మానం ప్రకారం కామ్రేడ్ సుందరయ్య త్రిపురి కాంగ్రెసు ఎన్నికలకు పోటీ చేయడానికి ఒప్పుకుంటూ డా॥ పట్టాభిగారు కామ్రేడ్ సుందరయ్యకు, జిల్లా ఎన్నికోద్యోగికి తంతి ఇచ్చారు.

పరిపాలనానుభవం యొక్క తికమకలో యీ సూత్రానికి కొన్ని హద్దులున్నట్లుగా అంగీకరించవలసి వచ్చినది. అహింసా సిద్ధాంతం సత్యావలంబనంవలె, సంపూర్ణత్వాన్ని పొందుటకు ఆదర్శ ప్రాయమయిన ఒక గమ్య స్థానం. దాని నిబంధనల ప్రకారము నడచుట ఎల్లప్పుడూ సాధ్యం కాక, అప్పుడప్పుడు వ్యతిరేకింపవలసి వస్తూంది. మానవ స్వభావంలో అతిక్రమింప జాలని పరిస్థితులు ఎన్నో ఉండుటవల్ల యిది తప్పడంలేదని అహింసా సిద్ధాంతాన్ని కాఠిన్యముగా ఆరాధించే వారే అంటున్నారు. తామే అహింసను ఎక్కువగా పాటించే వారమని చెప్పు కొంటూన్న హేమా హేములను విడిచిపెట్టి, పాపం సుందయ్యగారిపై ఈ బ్రహ్మాస్త్రం ప్రయోగించి ఆయన్ని త్రిపురీ కాంగ్రెసు ప్రతినిధిగా నిషేధించడం ఏమి న్యాయము? కాంగ్రెస్ సభ్యత్వము, ప్రతినిధిగా వెళ్ళే హక్కూ, రెండూ ఒకదాన్ని అనుసరించి ఒకటి ఉంటాయి. ఒక వ్యక్తిని ఎట్టి ఆక్షేపణ గాని లేకుండా కాంగ్రెసులో సభ్యునిగా చేర్చుకొన్నప్పుడు, అకస్మాత్తుగా కొన్ని ఆరోపణలు చేసి ప్రతినిధిగా వెళ్ళే హక్కును అతనికి యకబోవడంలో అర్థంలేదు. మార్క్సు సిద్ధాంతాలను అంగీకరించే కమ్యూనిస్టులకు కాంగ్రెసులో స్థానంలేదని చెప్పడానికి పూర్వం, కాంగ్రెస్ అధికార పదవిలో ఉన్న ఏ వ్యక్తి అయినా తన పైగల అత్యంతమైన బాధ్యతను గుర్తెరిగి యుండవలసినది.

ఇది ఆయన పనికాదు

సుందరయ్యగారి పార్టీలో తగవు లున్నాయనడం సందర్భ రహితం. డాక్టర్ పట్టాభిగారు అట్టివి వ్రాసి, కాలుజారకుండా ఉండవలసింది. ఎందువల్ల నంటే, నిజంగా తగవులు ఉన్నాయని రుజువైనప్పటికీ, కాంగ్రెసుకు ప్రతినిధిగా వెళ్ళే అర్హత యిందువల్ల పోదు. నిజం చెప్పవలసి వస్తే, కొంత మంది చాలా పెద్ద పెద్ద కాంగ్రెసు నాయకులలోనే అనేక తగవు లున్నాయి. కొందరు సోషలిస్టులు ఉద్రేక పూరితమైన ఉపన్యాసాలిస్తున్నారని పట్టాభిగారు తన డ్యూటీ ఏదో సరిగా తెలుకోకుండా ఆయన యీ ఆరోపణ చేసినట్టు తెలుస్తోంది. ఎందువల్లనంటే, శాంతి భద్రతలు కాపాడటం పోలీసువాని డ్యూటీ దానికీ, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధికారులకూ, ఎట్టి సంబంధమూ లేదు. కమ్యూనిజం యెడల డాక్టరు పట్టాభిగారు కనపరుస్తూ ఉన్న అసహ్య భావాన్ని మేము మెచ్చుకొనలేకున్నాం. కాంగ్రెసు మంత్రులు అధికారంలోకి రాక పూర్వము నుంచీ కమ్యూనిస్టు పార్టీ అక్రమ సంఘంగానే ఉంది. ఆ నిషేధాన్ని ఒక కాంగ్రెసు నాయకుడు గొప్పగా భావించడం తగనిపని. 1934 లో నిషేధించబడిన కమ్యూనిస్టు పార్టీపై గల నిషేధాజ్ఞను నేటి కాంగ్రెసు ప్రభుత్వాలు రద్దుచేయక పోవడం అంత గర్వించ తగిన విషయంకాదు. మార్క్సు, లెనిన్ మహా పురుషులని మా విశ్వాసం. తాము జీవించియున్న కాలంలో వారు అనేక మార్పులు తీసుకొని రాగలిగారు. నాటి ప్రజలపై వారికి నేటికికూడ అధికమగు ప్రభావం కలదు ఇండియాలో ఉన్న వారి అనుచరుల యెడల డాక్టరు పట్టాభి గారి వంటి కాంగ్రెస్ నాయకులు చూపుతూన్న దానికంటె ఎక్కువ గౌరవ మర్యాదలకు వారు తగియున్నారు.

"ప్రజాబంధు"

13—1—38 తేదీ తన సంపాదకీయంలో ఇలావ్రాసింది.

"పబ్లిక్ ప్రాసిక్యూటర్లను రాత్రి రాత్రి కాంగ్రెసు అభ్యర్థులుగా మార్చి, నెత్తిన గాంధీ టోపీ తగిలించి జిల్లాబోర్డులకు నిలుపవచ్చు గాని—జస్టిస్పార్టీలో చేరి కాంగ్రెసుమీద కత్తి కట్టి యెంతోకాలము పోరాడినవారిని కాంగ్రెసువారిగా ఆలింగనము చేసికోవచ్చు గాని—నిత్యమూ కాంగ్రెసుతరపుననే ప్రజా సమూహములలో పని చేస్తూవుండే సుందరయ్యగారు మార్క్సిస్టు సిద్ధాంతము కలిగివున్నందుకు కాంగ్రెసుకు ప్రతినిధిగా వెళ్ళడానికి వీలులేదు! పట్టాభి గారి ధోరణిని ఆంధ్రులు హర్షింపలేరు సరేగదా, చివరకు తీవ్రముగా విమర్శింపకుండా కూడా వుండలేరు. ఇటువంటి నాయకత్వము వల్లనే ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసులో భేదాభిప్రాయములు ఏర్పడి యేమీ పని జరుగకుండా పోతుందని పట్టాభి గారి వంటి నాయకులు యెంత త్వరగా తెలుసుకుంటే అంత మంచిది."

రైతులంతా ప్రకాశంగారిని బలపరుస్తున్నారు.

నెల్లూరు జిల్లా రైతు మహా సభ.

చిత్తూరు జిల్లాబోర్డు అధ్యక్షులైన శ్రీ రామకృష్ణారెడ్డిగారి అధ్యక్షతను నెల్లూరు జిల్లారైతు మహా సభ జయప్రదంగా జరిగెను. మంత్రులైన శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, మునుస్వామి పిళ్లెగారలు సమావేశానికి వచ్చారు. అధ్యక్షులు తమ ఉపన్యాసంలో రాష్ట్ర స్వపరిపాలనక్రింద మన కాంగ్రెసు మంత్రులు రైతులకు కొంతవరకు మాత్రమే ఉపకారం చేయగలరనీ; సంపూర్ణాధికారం కేంద్రప్రభుత్వానికే ఉన్నదనీ; 136 ఏండ్లనుంచి జమిందారీవిధానం అనే మత్తేభం యొక్క కాళ్ళక్రిందపడి నలిగిపోతూన్న జమీన్ రైతులకు ఆంధ్రకేసరి యీనాడు అమృతమూర్తి అయి సార్థకనాముడైనాడనీ; ప్రకాశం కమిటీవారి సూచనలన్నీ చట్టబద్ధం చేయబడితే చివరకు గలిగే ఫలితం జమిందారీల అంతమే ననీ తెలియజేశారు. కమిటీ నివేదికకు మహాసభవారు పూర్తిగా ఆమోదిస్తూ తీర్మానించారు.

* * *

సభలు - తీర్మానాలు.

ఈనెల 5 6 తేదీలలో కృష్ణాజిల్లా మంటముక్కలలోను, వెంకటాపురంలోనూ, చెవుటూరులోను ప్రకాశం కమిటీ రిపోర్టును బలపరుస్తూ బహిరంగ సభలలో తీర్మానము లామోదించబడెను. శ్రీ అనుమర్లపూడి వెంకట శీతారామారావుగారు రిపోర్టు యందలి భాగములను గురించి, అవసరమైన సవరణలను గురించి ఉపన్యసించారు. ఆంధ్రరాష్ట్ర రైతు సంఘము వారు సూచించిన సవరణలతో మదరాసు ప్రభుత్వము బిల్లును ప్రవేశ పెట్టవలెనని కోరుచూ తీర్మానించబడెను.

* * *

బొబ్బిలి రైతులలో ప్రచారం.

ఈ నెల 3, 4, 5, 6, 7, 8 తేదీలలో శ్రీయుతులు నగిరెడ్డి నారాయణనాయుడు, నర్సుపల్లి సీతానాయుడుగారలు బొబ్బిలి ఎస్టేటు గ్రామములైన లోచర్ల, ఉద్దవోలు, గలావిల్లి, గంగాడ, వంతరాం, లింగాపురం, అంట్లవార, పెదపెంకి, బర్లి, చింతాడ, పక్కి, శివడవలస, పినపెంకి, రేజేరు. నందిగాం, గ్రామాలును విజయనగరము ఎస్టేటు గ్రామములయిన కమిటి, సతివాడ, నెమలాం, బూర్జవలస, సుందరాడ మొదలైన గ్రామాలును,కాలినడకను సంచారము చేసి, ప్రకాశము కమిటీరిపోర్టునందలి అంశాలను రైతులకు తెలియపరిచారు. ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘంవారి సూచనలతో బిల్లు ప్రవేశపెట్టవలెనని అన్ని బహిరంగ సభలలోను తీర్మానములు గావించబడెను.

* * *

మైలవరం ఫిర్కా రైతు దళం.

పైదళం వారుకృష్ణాజిల్లా రైతుసంఘ సహాయ కార్యదర్శిగారి నాయకత్వమున బయలుదేరి 10 వ తేదీని చంద్రగూడెం, 11 వ తేదీని పుల్లూరు, మొరుసుపల్లి, రామచంద్రపురం, కృష్ణారావుపాలెం; 12 వ తేదీని రుద్రవరం, వంగాపురం, పోబులాపురం, తోలుకోడు, నాగలూరు,కీర్తిరాయనగూడెం గ్రామాలలో సంచారం చేశారు. ఆంధ్రరాష్ట్ర రైతుసంఘంవారి సవరణలతో బిల్లు ప్యాసు చేయవలసిందని కోరుతూ సభలలో తీర్మానములు చేయబడెను.

రావూరిపాలెం.

ఈ గ్రామంలో 6-1-39 వ తేదీని శ్రీ కావూరి కోదండరామయ్యగారి అధ్యక్షతను జరిగిన రైతు సమావేశంలో రైతు ప్రచారకులైన సుసర్ల కృష్ణమూర్తిగారు, కాకర్ల చంద్రశేఖరరావుగారు, గొత్తికొండ కోదండరామయ్యగారు రిపోర్టునుగురించి ఉపన్యసించారు. ఆంధ్రరాష్ట్ర రైతు సంఘమువారు చేసిన సూచనలతో జమిందారీబిల్లును ప్యాసు చేయవలసిందని శాసన సభ్యులను కోరుతూ తీర్మానించబడింది.

* * *

గరికపర్రు - కుమ్మమూరు.

పై గ్రామములందలి జమీన్ రైతులు 12 వ తేదీని శ్రీ పొట్లూరి బాపయ్యగారి అధ్యక్షతను సమావేశమై ప్రకాశం కమిటీ రిపోర్టును బలపరుస్తూ, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘంవారి సూచనలను ఆమోదిస్తూ తీర్మానములు చేసిరి.

* * *

> ## రైతు సేవకులు గమనించాలి
>
> జమీన్ రైతు రక్షణ దినము 20—1—'39
>
> రైతు సంఘ సభ్యులుగా జేరుటకు గడువు 31—1—'39
>
> ఆంధ్రరాష్ట్ర రైతు సంఘము.

* * *

కావలి తాలూకా రైతు సంఘం.

పై సంఘపు కార్యనిర్వాహక వర్గము 9-1-39 వ తేదీని శ్రీ కూరపాటి వీరారెడ్డిగారి అధ్యక్షతను సమావేశమై, బిట్రగుంట, మునునూరు, గౌరవరం, యళ్లూరు వగయిరా గ్రామాలలో చెరువు నీరు సప్లయి లేకుండానే వర్షాధారమువల్ల పండించుకొను భూములకు నీటి తీరువ వసూలుచేయుట అక్రమం కాబట్టి సదరు భూములకు మెట్ట శిస్తు మాత్రమే కట్టులాగున ఉత్తరువు చేయవలసిందని రివెన్యూ మంత్రిగారిని కోరుతూ తీర్మానించబడెను. ఆంధ్రరాష్ట్ర రైతు సంఘంవారు సూచించిన సవరణలతో టెనెన్సీ బిల్లును త్వరలో ప్యాసు చేయవలసిందని మదరాసు ప్రభుత్వాన్ని కోరుతూ మరొక తీర్మానం చేయబడెను.

* * *

నందిగామ తాలూకా ప్రచారకుల సమావేశము.

5-1-39 వ తేదీని నందిగామలో జరిగిన తాలూకా కాంగ్రెసు—రైతు ప్రచారకుల సమావేశంలో ప్రకాశం కమిటీ రిపోర్టును బలపరుస్తూ ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘంవారి సవరణలతో బిల్లు ప్యాస్ చేయవలసిందని మదరాసు శాసన సభ్యుల్ని కోరుతూ, తీర్మానించబడెను.

ఈ సమావేశానికి 50 గ్రామాలనుంచి ప్రచారకులు వచ్చి చర్చలలో పాల్గొన్నారు. శ్రీ కాట్రగడ్డ వెంకట నారాయణరావు ఎం. ఎల్. ఏ, నండూరి ప్రసాదరావు మొదలయిన రైతు నాయకులుకూడా సమావేశానికి వచ్చారు.

* * *

కృష్ణా జిల్లా రైతు సంఘము

ఈ నెల 8 వ తేదీని ఆగిరపల్లి గ్రామంలో శ్రీ మాదల సత్యనారాయణ గారి యింటి వద్ద సమావేశమైన పై సంఘపు సాధారణ సమావేశంలో, జమీందారీ విధానమును శాశ్వతంగా అంగీకరించుచూ రానున్న కొత్తశాసనపీఠికలో ఆవిధముగా వ్రాయవలెనని సూచించిన ప్రకాశం కమిటీవారి సిఫార్సుకు సభవారు తమ అసమ్మతిని ప్రకటించారు. ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం సూచించిన సవరణలతో వెంటనే శాసనము గావించవలెనని మదరాసు ప్రభుత్వమునూ, శాసన సభ్యులనూ కోరుతూ తీర్మానించబడెను.

కైకలూరు తాలూకా, పెదలంక గ్రామాలలోని బంజరు భూములను భూమి లేని వ్యవసాయదారుల కిప్పించవలెనని సభవారు ప్రభుత్వమును కోరిరి. నవంబరులో సంభవించిన తుపాను వల్ల నష్టపడ్డ భూములకు శిస్తురెమిషన్, స్వల్ప వడ్డీపై ఋణములు, ఇప్పించి రైతులకు సహాయపడవలెనని ప్రభుత్వమును కోరిరి. కృష్ణా యీస్టరన్ డెల్టాలో మురుగు యిబ్బందుల గూర్చి విచారించి ఒక్క స్కీమును తయారు చేయుటకు ఇంజనీరింగు సిబ్బందిని నియమించవలెననీ, వారి రిపోర్టు ప్రకారం 5 సంవత్సరాలలో మురుగు వసతులు పూర్తి చేయించవలసినదని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించబడెను.

* * *

చల్లపల్లి ఎస్టేటులో జమీన్ రైతు ప్రచారము.

దివి తాలూకా (కృష్ణాజిల్లా) రైతు సంఘాధ్యక్షులయిన కాకర్ల చంద్రశేఖరరావుగారు, కోనేరు రాజగోపాలరావుగారు, మరికొందరు రైతు సేవకులతో కలిసి యీ నెల 1 వ తేదీ నుంచి చల్లపల్లి ఎస్టేటు గ్రామాలలో జమీన్ రైతు ప్రబోధము చేస్తున్నారు. కాజ, కాజపాలెం. పెదకళ్ళేపల్లి. రామన్నపేట, ఎండకుదురు, తూర్పు చిట్టూరు, పాత మాజేరు, కొత్తమాజేరు, రావివారిపాలెం, కొక్కిలిగడ్డ, బొబ్బర్లంక మొదలయిన గ్రామాలలో బహిరంగ సభలు జరుపబడెను. రాష్ట్ర రైతు సంఘంవారి సవరణలతో ల్యాండ్ రివెన్యూ బిల్లు ప్యాస్ చేయవలసిందని తీర్మానము లంగీకరించబడెను.

* * *

నందిగామ తాలూకా.

11-1-39 వ తేదీ నుంచి నందిగామ తాలూకాలో పెద్దవరం, చెర్వుకొమ్ముపాలెం, కాంచ్రపాడు, కోనాయిపాలెం, బొచ్చిళ్ళపాడు, చందర్లపాడు, పాటెంపాడు, కొత్తపాలెం, జోపూరు, విపరింతలపాడు. యేటూరు, చింతలపాడు, పెండ్యాల. కంచెల మొదలయిన గ్రామాలలో వాసిరెడ్డి నారాయణరావు, వీరమాచనేని వెంకటేశ్వరరావు, జి. రామిరెడ్డిగార్ల నాయకత్వమున ప్రకాశం కమిటీ రిపోర్టును బలపరుస్తూ సభలు ప్రచారం చేయబడెను.

రాజోలుతాలూకా రైతు మహా సభ.

పై మహాసభ 13-1-39 వ తేదీని కొత్తపేటలో శ్రీమతి గంధం అమ్మన్నరాజా ఎం. ఎల్. ఏ., గారి అధ్యక్షతను జరిగెను శ్రీ క్రొవ్విడి లింగరాజుగారు జాతీయపతాకోత్సవం, శ్రీ సోమంచి లింగయ్యగారు ప్రారంభోత్సవం జరుపారు. శ్రీ కొరపాటి పట్టాభిరామయ్య మద్దూరి అన్నపూర్ణయ్య. పుసులూరి కోదండరామయ్య. సుసర్ల బ్రహ్మదేవశాస్త్రిగారలు ప్రకాశం కమిటీ నివేదికనుగురించి ఉపన్యసించారు. సదరు నివేదికను ఆంధ్రరాష్ట్ర జమీన్ రైతు సంఘములవారి సవరణలతో తక్షణమే శాసనమగుటకు పూనుకొనవలసినదని మదరాసు ఎసంబ్లీ సభ్యులను హెచ్చరిస్తూ తీర్మానించబడెను.

* * *

అగ్రహారం రైతుల అవస్థలు.

1936 ఈనాం ఆక్టు వచ్చినప్పటినుంచి వినుకొండ తాలూకా రైతులలో కొంత చలనము కలిగినది. ప్రతి అగ్రహారంలోను అగ్రహారందారులు పాత ఆక్టుకు ముందే చాలా స్వంత క్రమతములకు మార్చినారు. రైతులు ఆర్థిక దుస్థితికి ముందు ఉన్న శిస్తులు చెల్లించలేక, కొంతమంది ఆక్టు విషయము తెలుసుకొనకయే వదలినారు. 1937 డిశెంబరు నెలలో అగ్రహారం రైతులు అగ్రహారీకులను పట్టాలు అడిగినారు. ఇంతవరకు పట్టాలు యిచ్చియుండలేదు. సరికొండపాలెం అగ్రహారములో రయితులకు అగ్రహారందారులకు తగవులు బెరుగుట వలన 144 సెక్షను మొదలయినవి ప్రయోగించడమయినది. పిఠాపురం అగ్రహారంలో రైతులు పట్టాలకొరకు దావాలు వేసినారు. మిగిలిన అగ్రహారములలో మీటింగులు జరుపబడుచున్నవి. ప్రతి అగ్రహారం రైతు ప్రకాశం కమిటీ రిపోర్టును తమ అగ్రహారమునకు వర్తించునా అని, పన్నులు తగ్గుతవా అని ప్రశ్నలు వేయుచున్నారు. జనవరి నెల 19 వ తేదీన తాలూకా అగ్రహారం రయితుల సభను వినుకొండలో జరుపుటకు, రయితురక్షణయాత్ర సాగించుటకు, ప్రకాశం గారి రిపోర్టు అంగీకరించుచూ రయితు సంఘము సూచించిన తీర్మానములను బలపరుచుటకు నిశ్చయించినారు.

సరికొండపాలెం. చిఠాపురం, నరగాయపాలెము, పెరుమాళ్ళపల్లె మదమంచిపాడు, కొండ్రప్రోలు, వివంరాజుపల్లె, పెద్దవరం, గుండేపల్లి, వనికుంట, అంగలూరు అగ్రహారములలో రయితులు సభలు జరుపుచున్నారు అని శ్రీ గిరిరాజు సత్యనారాయణ (గుంటూరుజిల్లా రయితుసంఘ ఆర్గనైజరు) గారు వ్రాస్తున్నారు.

* * *

ఒక సవరణ

11—1—39 వ తేదీ "నవశక్తి"లో 7 వపుట 3 వ కాలంలో, "సొంతబావుల క్రింద సాగు చేయు మెట్టకు గొఱ్ఱు 1 కి రూ. 4—0—0 ఎరకున్నూ, పైర్లవారీ శిస్తు గొఱ్ఱు 1కి రు. 5-0-0 వరకున్నూ, రహితుల వద్ద ఏవిధంగా వసూలు చేయుచున్నారో" అని ఉన్నది. రు. 4-0-0 అనునది రు. 40-0-0 అనీ, రు. 5-0-0 అనునది రు. 50-0-0 అనీ ఉండవలెను. అచ్చు పొరపాటునకు పాఠకులు క్షమించవలెను.

జర్మనీ వేస్తూన్న కొత్త యెత్తులు

ఛాంబర్లేను, స్పెయిన్ ప్రజా ప్రభుత్వాన్ని నట్టేట ముంచుతున్నాడు!

మన అలవాటు ప్రకారము మనము ఈవార ముకూడ ప్రపంచ మంతా ఒక పర్యాయము తిరిగి చూద్దాం.

జర్మనీ : యూరపు

జెకోస్లోవేకియా హంగేరీల మధ్య తగాదా అతివేగంగా సాగుతూఉంది. రెండు దేశాల మధ్య తటస్థ స్థలాన్ని ఏర్పరచడానికి, ఖైదీ లనుకూడ విడుదల చేయడానికి ఒప్పుకొన్నారు. కాని మరునాడే మరియొక స్థలములో హంగేరీ సైనికులు జెకోస్లోవేకియా సైనికులపై తుపాకులు పేల్చారని, కొందరు చనిపోయారని వార్తలు.

హంగేరికి ఈమధ్య ఇటలీ విదేశాంగ మంత్రి సియానో రావడము, రోము బెర్లిను సమ్మేళనముతో కలసి పని చేయడానికి హంగేరీ ప్రభుత్వము ఒప్పుకోవడము పా కులకు తెలిసినదే. నేడు హంగేరీ సోవియటు యూనియను వ్యతిరేకంగా జర్మనీ జపాను ఇటలీ సమ్మేళనంలో తాను చేరినట్లు తెలియజేసింది. ఈవిధంగా హంగేరీ కేవలము జర్మనీ ఇటలీ చేతులలో కీలుబొమ్మ గావడము, హంగేరీ పార్లమెంటులోని ప్రభుత్వ ప్రతిపక్షులకు ఇష్టం లేదు. వారు కౌంటు బెత్లేను, డాక్టరు ఎక్ హార్డులు నాయకత్వాన వ్యతిరేకిస్తూ ఉన్నారు.

బెల్జియం తన బంగారాన్ని లండనులో దాచు కోవడమేగాక, స్పెయినులో తటస్థ విధానం వ్యర్థమయింది. అందుచే తటస్థ సంఘములో సభ్యురాలుగా ఉండడము లాభములేదని విరమించుకొన్నది. ఇది బ్రిటను తటస్థ సంఘాన్ని రద్దుచేసి ఫ్రాంకోకు బెలిజిరెంటు హక్కులు ఇవ్వడానికి మొదటి మెట్టు.

అయితే జర్మనీ పలుకుబడి నుండి తప్పించు కోవాలని బెల్జియం, హాలండులు ఎంత ప్రయత్నించినా జర్మనీ మాత్రము తనపట్టు సడల నివ్వడము లేదు.

హాలండులో రెండు వారాలక్రితము, జర్మనీ హాలండు దేశములమధ్య ఒక కాలిబంటి ఆటను ఆపివేశారు. ఆ ప్రదేశములో యూదుల ఎక్కువగా ఉండుటచే వారు జర్మనీకి వ్యతిరేకంగా ప్రదర్శనాలు చేస్తారేమోనని భయముతో ఆలా చేశారు. అప్పటినుండి జర్మనీ హాలండుపై వ్యతిరేకంగా ఆందోళన ఆరంభించింది. హాలండును తన పలుకుబడి క్రిందకు తీసుకురావడానికి ఆర్థికంగా ఒత్తిడి తెస్తూఉంది.

1. జర్మనీగుండా ప్రవహించే హాలండులో సముద్రములో కలియు రైన్‌నదిలో హాలండు (డచ్) నావల రాకపోకలకు కొన్ని ఆర్థికంగా దాడు కలిగించడము 2. ఇదివరకు హాలండులోని ఆమ్‌స్టర్‌డామ్ రేవును చేసే జర్మనీ వర్తకమును సకలము, నేడు బెల్జియములోని ఆంట్వెర్పునకు మార్చడము. 3. హాలండులో పండే పంటలో ఈవరకు నాలుగవ వంతు వరకు జర్మనీకి వెళ్లేది. ఇప్పుడు దానిని తగ్గించడమువలన జర్మనీ హాలండుపై ఒత్తిడితెస్తూ ఉండని తెలుస్తూఉంది. అంతేగాక హాలండు సరిహద్దున జర్మనీ యుద్ధసన్నాహాలు కూడ చేయడానికి పూనుకుంది. ఆ విషయము ఇటలీకి కూడ హిట్లరు తెలియజేశాడని వార్తలు వస్తూ ఉన్నాయి. హాలండు జర్మనీ రాయబారివద్ద కార్యాలయాలమీద ఎవరో కుహనులు ప్రేల్చారన్న ఆరోపణను విచారించడానికి ఒక కమిటీని వేసింది. ఎవరో నాజీలు నాజీలతో వేసిన దాడిగ్నాటు కు మనీరుగారని అది సిద్ధ యానికి వచ్చింది. ఒక జర్మను పత్రిక అప్ప

యంత్రాన్ని హాలండు ప్రభుత్వము వశపరచుకుంది. పత్రికలలో చాల ఆక్షేపణీయమైన వ్యాసాలుంటూ వున్నాయని. అందుచే జర్మనీ మరింత మండిపడుతూంది.

జర్మనీ ఆస్ట్రియాలో నున్న కాథలిక్కుల ఆస్తినంత లెక్క వేయమని ఒక ఆజ్ఞనుచేసింది. యూదులపై దురంతాలు జరిపి, వారి ఆస్తులను లాక్కోవడానికి పూర్వము ఇట్టి లెక్కలనే తయారుచేశారు. అందుచేత ఇప్పుడు ఆస్ట్రియాలోని కాథలిక్కులు తమ ఆస్తికి ముప్పు వస్తుందని భయపడుతూ ఉన్నారు.

జర్మనీ నుండి ఒక లక్షమంది ఈవరకే ఫ్రాంసులో రక్షణపొందారనీ, ఇంతకన్న అధికంగా రానివ్వడము సాధ్యము గాదని ఫ్రెంచి విదేశాంగమంత్రి బోనెట్ ప్రకటించారు. జర్మనీ



ఇటలీ ఫ్రాంసులకు ఛాంబర్లేను కుదర్చబోయే స్నేహం ఇదే:

వదిలివేయడానికి యూదులకు అవకాశాలు కల్గించడానికి డాక్టరుష్ట్ బెర్లినుకు వెళ్ళారు. ఇతడు అంతర్జాతీయ యూదుల సహాయక కమిటీకి అధ్యక్షుడు. ఇతడు డాక్టరు షాక్ట్‌తో సంప్రదింపులు ఆరంభించారు. డాక్టరు షాక్ట్ రాయనరాలు. జియ్యూప్రదముకుమ్యే పక్షాన జర్మనీలోని యూదులకు వ్యతిరేకంగా మరెట్టి చర్యలు తీసుకోమని వాగ్దానము గావించాడు. కాని, ఇవి జయప్రదము కావడానికి లండనునుండి డబ్బు రావాలని షాక్ట్ కోరుతున్నాడు. అంతేగాక జర్మను వస్తుబహిష్కరణ కూడ మానివేయాలంటున్నారు. దీనినిబట్టి, యూదులపైనిఈదాడిక్కి యూదుల ఆస్తుల పెరుక్కోవడానికి కారణం, జర్మనీలో ఆర్థిక దుస్థితి తీవ్రమయ్యేకొలదీ, మరే ఉపాయము తోచక యూదుల ఆస్తినైనా మింగితే కొంతవరకు అది తొలగుతుందను భావమేనని స్పష్టమౌతూంది.

ఛాంబర్లేను:ముస్సోలినీ

ఛాంబర్లేను, ముస్సోలినీని జర్మను ప్రభావమునుండి తొలగించుటకు ముందుగా జాగ్రత్తపడ్డాడు హిట్లరు, డాక్టరు షంటును ఇటలీకి పంపాడు. జర్మనీ, ఇటలీల ఆర్థిక విధానాల రెంటిని మరింత దగ్గరికి తెచ్చి బలపర్చడానికి సంప్రదింపులు జరిగాయి. డాక్టరు షంటు రానువెళ్లినపని జయప్రదమైనదంటూ జర్మనీకి తిరిగి వచ్చాడు. జర్మను పత్రికలు బెర్లిను—రోము సమ్మేళనము చాల దృఢంగా ఉందనీ, జర్మనీ కేవలము స్పెయినులోనేగాక మధ్యధరా సముద్రములోకూడ తన లాభాలను రక్షించుకోవడానికి పెనుదీయదని ప్రకటించాయి.

ఛాంబర్లేను లండను నగరమునుండి బయలుదేరినప్పుడు నిరుద్యోగులు చాల వ్యతిరేక ప్రదర్శనాలు గావించారు.

సూయజుకాలువ, ట్యూనిస్, స్పెయిను విషయాలు చర్చించరు గాని ఏమీ నిర్ణయాలు రావు రాదేమో. ఇంత త్వరలో రావడముకూడ సాధ్యమూకాదని పత్రికలు వ్రాస్తున్నాయి. మధ్యధరాసముద్రములోని విషమస్థితి తొలగిపోవాలంటే ఫ్రాంకోను, బెలిజిరెంట్ హక్కులు ఇవ్వాలని (యుద్ధముచేసే స్వతంత్రప్రభుత్వముగా గుర్తించాలని) ముస్సోలినీ ఛాంబర్లేనును కోరారు. ఫ్రాంసు, ఇటలీల మధ్య తగాదాకూడ పరిష్కారము గావాలంటే స్పెయిను ప్రభుత్వాన్ని బలపర్చడము ఫ్రాంసు మానివేయాలని ముస్సోలినీ చెప్పారు. ఈ విధంగా వెంటనే ఫ్రాంసుకు సలహా యివ్వాలనికూడ ముస్సోలినీ ఛాంబర్లేనును కోరారు. బెలిజిరెంటు హక్కులనిస్తే ఇటలీ సైనికులను స్పెయిను నుండి వెనక్కి పిలుస్తానని ముసోలిని ఆశచూపారు. ముసోలిని ఫ్రాంసు నుండి తనకు కావాలన్న కోర్కెలను మానుకోననికూడ తెలియజేశారు.

ఫ్రాంసుకు ఇటలీకిమధ్య రాజీ కుదర్చడానికి ఇంగ్లండు తన సర్వశక్తులు వినియోగిస్తుందని ఛాంబర్లేను వాగ్దానము గావించారు. కాని అట్టి ఒడంబడికకు రావాలంటే "ఫ్రాంసుకు వ్యతిరేకంగా ప్రదర్శనాలు చేస్తే రాజీ చెడిపోతుంది. ఫ్రాన్సుతోనే రాయబారాలు మొదలు పెట్టు. వెనుకనుండి ఫ్రాన్సు మీకోర్కెలను అంగీకరించేటట్లు నేను ప్రయత్నిస్తాను" ఛాంబర్లేను ముస్సోలినీకి సలహా ఇచ్చారు. ఫ్రాంసు నేడు ఇటలీకి ఏమీ ఇవ్వనని విశ్రవనిని కూర్చోడానికి కారణము ఇటలీలో ఫ్రాంసుకు వ్యతిరేకంగా జరిగిన ప్రదర్శనాలే నన్నారు. నాలుగు రాజ్యాల సమావేశము లాభములేదు. ఫ్రాంసు దానికి ఏమాత్రమూ ఒప్పుకోదు అని కూడ తెలియజేశారు.

ఫ్రాంసుపై వెనుకనుండి ఒత్తిడితెచ్చి ఇటలీ కోర్కెలను కొంతవరకైనా అంగీకరించేటట్లు చేయడానికి ఛాంబర్లేను తయారయ్యాడనడానికి ఈక్రింది విషయాలు దర్శనాలు

1. బ్రిటిషు ప్రభుత్వ దృక్పథమును తెలియజేసే లండను టైమ్సు పత్రిక ఛాంబర్లేను ప్రయాణమయినపుడు ఈలా వ్రాసింది. "ఆఫ్రికా ఖండములోని ప్రస్తుత పరిస్థితిని అచ్చటచ్చట కొంతవరకు మార్పు చేయడానికి అవకాశము ఇంకా ఉంది. బ్రిటనును బాధించేది స్పెయిను సమస్య." స్పెయిను ప్రభుత్వము ఓడిపోక తన పోరాటము సాగిస్తూనే ఉంటే ఛాంబర్లేను ఎత్తులన్నీ భగ్నమవుతాయి అని టైమ్సు భయము. అంతేగాక ఒకవేళ జనరలు ఫ్రాంకో (విద్రోహం చేసేవారి) గెలిస్తే, జర్మనీ ఇటలీలు స్పెయినులో ప్రాబల్యము వహించి జిబ్రాల్టరుకు, తన వర్తక మార్గాలకు ఏమి ముప్పు తెస్తాయోనని కూడ టైమ్సుకుభయము. కాని ఆఫ్రికా ఖండములో ఫ్రాంసు కాలనీలు పోతే ఇంగ్లండుకు వచ్చిన నష్టమేమీ లేదు.

2. ఆంగ్లో ఇటాలియను ఒడంబడిక ప్రకారము ఇంగ్లండు, ఇటలీల సైనిక ఏర్పాటులను ఒక దేశము నుండి జరిగేవి తెలిపి దేశానికి తెలియ జేయడము, ఛాంబర్లేను రోము నగరానికి కొట్టపెట్టిని లాగుడు ఆరంభమయింది. ఒక ప్రక్క ఇటలీ తన కోర్కెలను

వదులుకోదు. ఫ్రాంసుతోచేరి బ్రిటను ఏమి ర్కొన్నా, హిట్లరుతో కలసి తన కోర్కెలను నెరవేర్చు కొంటానని ముస్సోలినీ చెప్పారు. ఒకవేళ ఇటలీ కోర్కెలను నెరవేర్చడానికి బ్రిటను తగినంత కాకపోతే, ముస్సోలినీ యుద్ధము వస్తుంది. తాను త్వరలో యుద్ధము చేయబోతున్న దేశానికి తన సైనిక ఏర్పాటులను వ్రాసి తెలియజేస్తాడను అనుకుంటాడా? దీనినిబట్టి కూడ బ్రిటను ఇటలీ కోర్కెలను నెరవేర్చడానికి పూనుకుంటుందని తెలుస్తూంది.

3. ఈ సంప్రదింపులు జయప్రదంగా ముగిసినాయని ఛాంబర్లేను హాలిఫాక్సులు సంతృప్తి చెందారు. ముస్సోలినీ, కౌంటుసియానో కూడ తృప్తి చెందారు. ఇటలీ ఉద్యోగస్థులు లండను సంతృప్తి చెందారు. ఇంగ్లండు ఇటలీ మధ్య స్నేహము మరింత దృఢపర్చడానికే సంప్రదింపు లుద్దేశించబడ్డాయనీ, ఆ ఉద్దేశము నెరవేరినదని తెలియజేయ బడింది. అందుచేతనే గైడా ఈవిధంగా ప్రకటించారు:—"రోము బెర్లిను సమ్మేళనానికి, ఫ్రాంసు ఇంగ్లండు సమ్మేళ

4. ఇటలీకోర్కెలు నెరవేరడానికి అవకాశముందని గ్రహించబట్టే ఫ్రాంసుతో సంప్రదింపులు చేయడానికి పూనుకుంటూ ఉంది. ఫ్రాంసు ఏ మాత్రమూ లొంగనిపక్షాన ఈ సంప్రదింపులకు అర్థముండదు.

5. తిరిగి త్వరలోనే బ్రిటిషు విదేశాంగ మంత్రి రోముకు వెళ్ళుతాడు; ఈలోపల పారిసు ఫ్రెంచి విదేశాంగ మంత్రి బోనెట్‌ను కలుసుకుంటారు. ఇద్దరు లాలోచి పడిన పిదప హాలిఫాక్సు తిరిగి రోముకు వెళ్ళి తదనంతరం జరుగవలసిన విధానాన్ని తెలియజేస్తారు.

ఈ లోపల స్పెయిను ప్రభుత్వ స్థితి మరింత హీనమవుతుంది. ఫ్రాంకో ఇంకా చాలా దేశాన్ని ఆక్రమిస్తాడు. ఫ్రాంసు ఆ పరిస్థితులలో స్పెయిను విషయము గట్టిపట్టు పట్టక వదలుకుంటుంది. చుట్టూ ఫాసిస్టు రాజ్యాలు. దానికితోడు ఇంగ్లండుకూడ ఇటలీ కోర్కెలు నెరవేర్చు మని పట్టుబట్టితే ఫ్రాంసు లొంగక తప్ప

నేటి ప్రపంచం

నానికి నేడున్న స్పర్థ ఎప్పటికీ ఉండదు. సంప్రదింపులవల్ల పరిష్కరించ వలసిన విషయాలు చాల ఉన్నవి. ఆలా పరిష్కరించడము సాధ్యమవుతుందని ఛాంబర్లేను అంగీకరిస్తున్నారు. "ఛాంబర్లేను కూడ ఇటలీకి బ్రిటనుకు స్పర్థ లేదనీ, అయితే ఇంగ్లండు ఫ్రాంసులతో తన మిత్రత్వ సంబంధాన్ని మానుకోదని తెలియజేశారు. కాని ఇంగ్లండు రోము—బెర్లిను సమ్మేళనము ఉండకూడదని గాని, దానికి వ్యతిరేకమనిగాని భావించవలదని ఛాంబర్లేను తెలియజేశారు. అతడు కోరేదంతా, ఇంగ్లండు ఫ్రాన్సు



అరబ్బు స్వాతంత్ర్య యోధులు.

టుకూడ, ఇటలీ జర్మనీలతో కలసి పనిచేయడానికి అవకాశముండాలని ఇటలీ జర్మనీల ప్రపత్రింపాలి. అంతే మెల్లమెల్లగా ఇంగ్లండు ఫ్రాంసులతో ప్రజాభిప్రాయాన్ని దెబ్బకొట్టి తరువాత ఇటలీ జర్మనీల కోర్కెలు నెరవేర్చడానికి కావలసిన వ్యవధిని మాత్రము ఇమ్మని

దని వీరి ఆలోచన. కాని స్పెయిను ప్రభుత్వము జనరలు ఫ్రాంకోయొక్క ఈ దాడినికూడ ఎదుర్కొన గలిగితే, ఫ్రెంచి ప్రజా సామాన్యము స్పెయినుకు సహాయము చేయమని ఫ్రెంచి ప్రభుత్వంమీద ఒత్తిడి తప్పించుకోడానికి వీలులేనంత ఒత్తిడి తెస్తే, ఫ్రెంచి ప్రభుత్వము ఆ ఒత్తిడికి ఆగలేక, స్పెయిను ప్రభుత్వానికి ఆయుధాలు, ఆహారము పంపితే, ఆరోజు ఇటలీ విసిగి ట్యూనిసును ఆక్రమించుకోడానికి

పూనుకోవచ్చు. అప్పుడు ఇంగ్లండులోని అమెరికను రాయబారి కెన్నడీ, ఫ్రాంసులోని అమెరికను రాయబారి బుల్లిట్, అమెరికను సైనిక వ్యవహారాల కమిటీ ముందు ప్రకటించినట్లు ప్రపంచ యుద్ధం

రాబోవు వేసవిలో ఆరంభము కావచ్చు. జర్మనీ యుక్రెయినును ఆక్రమించుకోడానికి ప్రయత్నించవచ్చు. ఆ పరిస్థితులలోకూడ ప్రపంచ యుద్ధము ఆరంభము కావచ్చుననికూడ ఈరాయబారులే తెలియజేశారు. స్పెయినే ఓడిపోతే యూరపంత ఫాసిస్టు మయమవుతుంది. నాగరికత వెనక్కి పోతుంది. అందుకనే స్పెయిను ప్రభుత్వానికి అందరూ సాయం చేయాలి.

శాంతిశక్తులు:స్పెయిను

స్పెయినులో యుద్ధము మహా తీవ్రంగా సాగుతూంది. గత ప్రపంచయుద్ధములోగాని, తరువాతగాని ఇంత తీవ్రంగా, ఇంత ఘోరంగా ఎప్పుడూ సాగలేదని విలేఖరులు వ్రాస్తున్నారు. మర ఫిరంగులతో, విమానాలతో ప్రభుత్వసేనలను ఫ్రాంకో విద్రోహసేనలు ముంచెత్తివేస్తున్నాయి. ఈ అగ్నివర్షానికి ముందు నిలబడడమే అసాధ్య మనిపించేటట్లు మరఫిరంగులు బాంబులు ప్రేలుతున్నాయి. అయినా ప్రభుత్వసేనలు తమ స్వాతంత్ర్య రక్షణకోసం ఎదుర్కొంటూనే ఉన్నాయి. వెన్నిచ్చి పారిపోవడము లేదు. అధైర్యపడడము లేదు, నిరాశ చెందడము లేదు. ఈ అగ్నివర్షమువలన ఒక కోటను వదిలివేయవలసివస్తే, దాము ముందు రక్షిస్తూన్న స్థానాన్ని వదిలివేయవలసి వస్తే, క్రమముగా మరియొకస్థానానికి మరలి యుద్ధము సాగిస్తూనే ఉన్నారు. డిశంబరు 23 వ తేదీ నుండి యుద్ధము చేస్తూన్నను 50 వేల మంది సైనికులనే ప్రభుత్వము పోగొట్టుకుంది.

విద్రోహిసేనలు ఈక్రిందివిని దాటినవి. టార్తోసానగరాన్ని ఆక్రమించుకున్నాయి. టర్రగానా పట్టణమువైపుకు దక్షిణముగా వస్తూ ఉన్నాయి. మరికొన్ని సేనలు సెరిరా—మాంట్‌బ్లాంక్‌ల మధ్యనున్న ప్రాంతం ఆక్రమించుకొని, మాంట్‌బ్లాంకుకు దక్షిణమున నున్న వాల్లు పట్టణాన్ని ఆక్రమించుకున్నారు. వాల్లు పట్టణానికి మరింత దక్షిణానవున్న రుయస్ పట్టణానికి 9 మైళ్ళు దూరముకు వచ్చారు. మరియొక విద్రోహ సైనికదళము పడమట గండెసా పట్టణమునుండి పోర్టెల్ మీదకు దాడికి వెడలి దానిని ఆక్రమించి, రియూస్‌ను ఆక్రమించడానికి నూగుతున్నారు. పడమర, ఉత్తరము దక్షిణము నుండి వచ్చుసేనలు రియూస్‌ను, టర్రగానా పట్టణాలను త్వరలో ఆక్రమించుకుంటాయని విలేఖరులు వ్రాస్తున్నారు.

విద్రోహుల సైనికదళము మరియొకటి ఉత్తరాన ఆల్ట్రిసాది నిర్గమించి దక్షిణమునవున్న సెర్విరావట్టణమునకు ఆరుమైళ్ళ దూరముకొచ్చింది. మాంట్‌బ్లాంకునుండి బయలుదేరిన మరియొక సైనికదళము—సెరిరా—సెర్విరానుండి ప్రభుత్వసేనలు వెనుకకు మరలడానికి కూడ వీలులేకుండ చేయడానికి సెర్విరా—బార్సిలోనా మధ్యరస్తా ఆక్రమించడానికి వెళ్తూ ఉంది. అది అప్పుడే పదిమైళ్ళు ముందుకు సాగిందట.

ఈక్లిష్టపరిస్థితిలో స్పెయిను ప్రభుత్వము 17 సంవత్సరముల మొదలు 55 సంవత్సరముల

లోపల నుండు స్త్రీపురుషులంతా సైనికదళాలలో చేరాలని ప్రకటించింది. దీనివలన సైన్యములో మూడున్నర లక్షలమంది ఎక్కువవుదురు. అంతేగాక "వాన్గార్డియా" అను స్పెయిను ప్రభుత్వ పత్రిక యిలా వ్రాసింది. శత్రువులకు ఆయుధ పరికరాలు అమితంగా ఉన్నాయి. దానిని ఎదుర్కొనడానికి మనకున్నది మనుష్యుల సంఖ్యాబలమే. కడకు జయాపజయాలను నిర్ణయించేది ఆయుధాలుగావు, మనుష్యుల స్వాతంత్ర్యము, అంతేగాదు స్పెయిను దేశస్థులు తమ కర్తవ్యంత ప్రియతమ మైనదనుకొను హక్కులన్నీ నాశన మయ్యేస్థితివస్తుంది ఇటలీ జర్మనీలు జయిస్తే అందుచేత అవసరమయితే 15-80 సంవత్స



ప్రపంచ దృష్టిలో బ్రిటిష్ ప్రతిష్ఠ!

రాలలోపల వయస్సుగలవారినందరినీ ఆహ్వానిస్తాము.

ఎంతభయంకర ప్రతిజ్ఞ!

చైనా

చంగుకేషేకు నేత, చైనా ఏ మాత్రమూ లొంగదనీ, యుద్ధముచేసే సైనికులలో కొంత ప్రసక్తి లేదనీ ప్రకటించింది. జపాను కాంటను నగరములోని చైనా హక్కుల నన్నింటిని స్వాధీనము చేసుకుంది. కాని విదేశస్థుల హక్కులను, తాము చైనాలో "శాంతి" నెలకొల్పదానికి అడ్డు తగులుతుందా ఉండునట్టి వానిని గుర్తిస్తామని ప్రకటించింది.

బర్మా—సరిహద్దు చైనాదేశస్థులు రస్తాపూర్తి చేసిన పిదప, ఈరస్తాద్వారా చైనాతో వర్తక వ్యాపారము వృద్ధి చేసుకోవచ్చునని బ్రిటిషు వారు గుర్తించారు. యూగిల్సియాంగు నది జపాను చేతిలోకి పోవటం తమకు వచ్చినవస్తాన్ని

బర్మాలోని బనావతినది ద్వారా ఈ బర్మా—చైనా రస్తాద్వారా చైనాతో వర్తకమును పెంపొందించుకొని, పూడ్చుకోగలమని బ్రిటిషు వారు గుర్తించారు. అందుచేతనే చైనాకు లారీలు కొనడానికి 5 లక్షల పౌనులు అప్పు ఇవ్వదలిచిరని లండను టైమ్సు పత్రిక ప్రకటించింది. మేము నెల రోజులకు పూర్వమే వచ్చే లాభాన్ని పోగొట్టుకోవడ మెందుకని బ్రిటను ఆయుధాలను బర్మాగుండా పోనిస్తూ ఉండేదని మరేమీ కాదన్నాము. దాన్ని ఇది రుజువు చేస్తూఉంది.

పాలెస్టయిను

అరబ్బు విప్లవ నాయకుడు ముఫ్తీని, లండనులో జరుగబోయే కాన్ఫరెన్సుకు వెళ్లకూడ ఉన్న అరబ్బు ప్రతినిధులు వెళ్ళి కలుసుకున్నారు. ఇరాక్ ప్రభుత్వ ప్రతినిధులు కూడ లండనుకు ఈ కాన్ఫరెన్సులో పాల్గొనడానికి బయలుదేరారు.

అరబ్బు ఖైదీని పంపారన్న నేరానికి వివారించ బడుతూన్న నల్గురు బ్రిటిషు సైనికులు దోషులని కోర్టు నిర్ధయించింది. ఒకరికి మూడేండ్లు, మరొకరికి ఒక సంవత్సరం కఠిన శిక్ష విధించింది. మిగిలిన ఇద్దరిని ఒక సంవత్సరము వరకు 50 పౌనుల పూచీకత్తు తీసుకొని వదిలి వేసింది. ఆయుధాలు కలిగిఉన్నారన్న నేరానికి అరబ్బులకు మరణదండన, ఖైదీని హత్యగావించినా బ్రిటిషు సైనికులకు ఇంత స్వల్పశిక్షయు. ఇదే బ్రిటిషు న్యాయము; అందుకనే బ్రిటను దురంతాలను పాలెస్టయినులో చేయడముల్లేదా బ్రిటిషు యుద్ధకాల ప్రకటించినపుడూ ఒక నిష్పాక్షిక కమిటీని ఏర్పరచమని అరబ్బులు కోరుతున్నారు.

అరబ్బులు ఒక బ్రిటిషు సూపరింటెండెంటు ఇంటిని తగులబెట్టారు. కర్ఫ్యూ ఆర్డరు బ్రిటిషు ప్రభుత్వము ప్రకటించింది. కొనావరిని సైనికులకు ఆహారము తీసుకొనివెళ్లే ఒక బ్రిటిషు లారీని అరబ్బులు ముట్టడించారు. కాని ఇంతలో విమానాలు వచ్చి బాంబులు గురిపించుటచే అరబ్బులు వెళ్లగొట్టబడ్డారు.

పాలెస్టయిను అరబ్బు స్వాతంత్ర్య పోరాటాన్ని అణచడానికి, స్వాతంత్ర్యపోరాటముతో పాల్గొనేవారితో లేదనికి లేదావాకి బ్రిటిషు ప్రభుత్వము పూనుకుంది. ఈవరకే సెరోప్లేనీకూడ కట్టుకుంది. నేటివార్తల అబ్దుల్ రహమాను నాయకత్వమును విరమించుకొని దమాస్కసుకు వెళ్ళినట్లు తెలియజేస్తున్నాయి. మనదేశములోకూడ కాంగ్రెసునుండి అతివాదులను తొలగించడానికి బ్రిటిషు ప్రభుత్వము కృషి చేస్తూఉంది. ఈవాదాను వర్కింగు కమిటీ కమ్యూనిష్టును కూడ కాంగ్రెసులో ఉండవద్దునని నిర్ణయించింది. ఈ యెత్తులను భగ్నము చేసింది.

అచ్చులో ఉంది

పాలస్టైన్

పాలస్టయిన్ ప్రాముఖ్యత ఏమిటి?
ఎలా బ్రిటిష్ మాండేట్ క్రిందకు వచ్చింది?
యూదుల — అరబ్బుల సంబంధం ఏమిటి?
పాలస్టయిన్ స్వాతంత్ర్య పోరాటం ఎందుకు, ఎలా ఆవిర్భవించేయ బడుతున్నది?
పాలస్టయిన్ పట్ల ఫాసిస్టుల వైఖరి ఏమిటి?
మన కర్తవ్యం ఏమిటి?
మొదలైన సమస్యలెన్నో వివరించే ఆధునిక గ్రంథం.
నేడే మీ ఆర్డరు పంపండి.
నవశక్తి కార్యాలయము,
గవర్నర్ పేట, బెజవాడ.

రైతులను క్రుంగదీయుచున్న 'అమ్మవారి కడవ'

ధర్మారావుపేట అగ్రహారం రైతుల బాధలు

కామ్రేడ్ గారపాటి సత్యనారాయణ

ఈ గ్రామంపేరు అప్పలరాజుగూడెం అనే ధర్మారావుపేట యిది పశ్చిమ గోదావరిజిల్లా చింతలపూడి తాలూకాలోనిది. చింతలపూడికి 15 మైళ్ళు దూరంలోవున్న మన్యప్రదేశము. జమీందారీ విచారణ కమిటీవారిచే ప్రకటింపబడిన ప్రకాశంగారి రిపోర్టును గురించి రైతులకు తెలిపి, రైతులకు కావలసిన ముఖ్యకోరికలను సూచించుటకున్నూ, యీ తాలూకాలో ప్రచారంచేయు జిల్లా రైతుసంఘ ప్రధాన కార్యదర్శి పేటేటి వెంకటరత్నం, నేను, చిలుకూరి వెంకటప్పారెడ్డి (జిల్లా కాంగ్రెసు సభ్యుడు) గార్లు మల్లాయగూడెం, శాంతంపాలెం, రేచర్ల, చింతలపూడి, ఎర్రగుంటపల్లి, ముక్కినవారి గూడెం, గంగిసీడుపాలెం, బండివారి గూడెం, కోయగూడెం వగైరాగ్రామాలలోసభలుచేసితిమి. ప్రకాశం కమిటీవారి రిపోర్టును బలపర్చుచునూ ఆంధ్రరాష్ట్ర రైతు సంఘంవారి సూచనలను రానున్న "ఎస్టేటు ల్యాండు రివిన్యూ బిల్లు"లో చేర్చి వెంటనే చట్టం చేయించమనియూ ప్రచారం చేసుకుని, ది 5-1-39 తేదీ వుదయానికి ధర్మారావుపేట చేసుకున్నాం. ఆగ్రామ రైతులు తమ కష్టాలను గురించి చెప్పుతూంటే చాలా చిత్రమనిపించింది. ఈ గ్రామాన్కి యిద్దరు వాటాదారులు. 1. శ్రీమత్ ప్రతివాది భయంకరాండం గోవిందాచార్యులు 2. శ్రీమత్ కందాడై గోవిందాచార్యులుగార్లు. యిందు మొదటివారి మేనమామ శ్రీమత్ కందాడై శ్రీనివాసాచార్యులు ట్రైనాఫీసరు (అనగా మునసబు - కరణము ఒకరే) ఈ గ్రామంలోను నూరు రైతు కుటుంబాలున్నాయి. జనాభా సుమారుగా 800 మంది వుంటారు. యీగ్రామానికి యింతవరకు సర్వే చేయించలేదు. యావత్తు భూములు అగ్రహారీకులవేనని అగ్రహారందార్లు చెప్పుచున్నారు. పంట పండించి రైతు తన వాటాకువచ్చినపాలు తీసుకొని పోవలెను. పల్లవుభూమి సాగుచేస్తే పాలు, పాలున్నర చొప్పున నిర్ణయించుకుంటారు. ఆపద్ధతిగానే అగ్రహారీకులూ మొదట్లో వప్పుకుంటారు. కాని కష్టించి సాగుచేసి పండించిం తరువాత. కుప్పలు నూర్పుసరికి అగ్రహారందార్లు ఒక కొల "కడవ"తో సిద్ధమౌతారు. యిక కొలగారం ప్రారంభమౌతుంది. రాశి ఎంత చిన్నదైనా "కడవ" మామూళ్ళు తగ్గవు. రైతుకు ఆపాలంలో ఏమీ మిగలక పోయినా వేరే ఎచ్చటనైనా అప్పుతెచ్చి మామూళ్ళ "కడవ"లు అగ్రహారందారుకు చెల్లించవలసిందే.

" అమ్మగారి కడవ "

'కడవ' అనగా 10 మానికలు; కుంచం అనగా 2 మానికలు.

మామూళ్ళు:—అమ్మగారికి ఒక "కడవ" అయ్యగార్కి ఒక "కడవ" బంట్రోతు, గుమాస్తాకు కలిసి ఒక "కడవ" కొలగారపు మనిషికి కుంచెడు, అయ్యగారు బండిఎక్కి కళ్ళంలోకి వచ్చినందుకు బండి మనిషికి కుంచెడు, అయ్యగారి చాకలికి కుంచెడు, అయ్యగారి మంగలికి కుంచెడు, అయ్యగారింటివద్ద అమ్మగారికి తోడుగావుండి వాకిలి వూడ్చే పనిమనిషికి కుంచెడు, అయ్యగారి గుర్రపు మనిషికి కుంచెడు, మొత్తం రాశిలోనుండి తీసుకుంటారు. మామూళ్ళుపోగా మిగిలిన ధాన్యం పాలున్నర రైతుకు, పాలు అగ్రహారందారు తీసుకుంటారు ఒకరాశి 4 బస్తాలు అయితే మొత్తం మామూళ్లతో కలిపి లెఖవేస్తే పాలున్నర, పాలు చొప్పున గిట్టవలసిన వాళ్ళకు చెరిసగం వంతున గిట్టుతుంది.

పై మామూళ్ళగాక, కోతలు కోసిన తరువాత అయ్యగారి బంట్రోతుకు ఒక వరిమోపు యివ్వాలి. ఆ వరిమోపు 10 మానికల ధాన్యమౌతుంది. మెరక భూములకు రెండు రూపాయలు మెదలు అయిదు రూపాయలవరకు శిస్తురేట్లు వసూలు చేయుచున్నారు. భూములపైగల యావత్తు చెట్లు, అందలి ఫలసాయము అయ్యగారికి సగంపంతు పంచిపెట్టాలి. ఏ రైతైనా ఏ భూమిపైన ఏ చెట్టును తాను వేసుకున్నా అది అయ్యగారే స్వాధీనపర్చుకుంటాడు, చెట్లు కొట్టుకునే హక్కు రైతుకు అసలే లేదు. అడవికి పశువులు మేతకు పోతే మొదటి అయ్యగారికి రు. 10-0-0 లు పుల్లరి చెల్లిస్తే రెండో అయ్యగారికి కూడా రు. 10-0-0 లు చెల్లించి తీరాలి. యీ విధంగా యిద్దరి అయ్యగార్లకు ఒకరికి ఎంత యిస్తే అంతా రెండోవారికివ్వాలి.

ఇండ్లకు తాటిఆకు కావలిస్తే అయ్యగారి అనుమతి లేనిదే తెచ్చుకోకూడదు. రైతులు చెట్లువేసిన భూమికికూడా అయ్యగారికి శిస్తు యివ్వాలి. అగ్రహారందార్లకు రైతులు వెట్టి చాకిరీ చెయ్యాలి. ఒక వేళ ఏ రైతైనా నిరాకరించాడా ఆ రైతు తాలూకు పశువులు బయటకు వస్తే అవూళ్లో బందెలదొడ్డి (పౌండు) లేకపోయినా అయ్యగారి స్వంత దొడ్డిలో పెట్టి పశువుకు రు. 0-4-0 వంతున వసూలు చేస్తారు.

ఈ విధంగా ఆ గ్రామ రైతులు కాళ్ళ బాధలను గురించి చెప్పుకొంటూ "అయ్యగోరూ పెకాశం మంత్రిగారంట రైతోళ్ళకు లాభం చూపే బిల్లు పెట్టుతుండారంటగా, బాబూ మా జోటోళ్ళకు ఏమైనా లాభం వత్తుందయ్యా?" అంటూ అడిగారు పాపం! ఆ రైతులకు ఏమి చెప్పాలో మాకు తోచలా. ప్రకాశంగారి రిపోర్టులో ఈనాం, అగ్రహారాలు లేకపోవడంచేతా, మమ్ముల నడిగిన రైతులు, అగ్రహారీ రైతులవడంచేతా, రానున్న బిల్లు వాళ్ళకు వర్తించని కారణంవల్ల ఆ రైతులడిగిన దానికి సమాధానం చెప్పలేకపోయాం. వెంటనే సభ జరుపబడింది.

ఆ సభలో ప్రకాశంగారి రిపోర్టు విషయాలను గురించి చెప్పుతూ, ఆంధ్రరాష్ట్ర రైతు సంఘంవారి సూచనలు గురించి చెప్పి వాటిని బలపరుస్తూ చెప్పి, అగ్రహారీ, ఈనాందారీలకు కూడా యీ రానున్న బిల్లు వర్తించునట్లు, దాని ద్వారా కష్టాలు పోగొట్టుకొనుటకుగాను యావత్తు రైతులు తీవ్ర ఆందోళన చేయవలసియున్నదనియూ, ఆందోళన చేసిన తప్పక అగ్రహార్లకు కూడా వర్తించునట్లు ప్రభుత్వం రైతుల వత్తిడికి లొంగుననియూ చెప్పితిమి. దానిపైన రైతులు వారికి కావలసిన కోరికలతో తీర్మానం చేయబడినది.

అమ్మగారి "కడవ" అనే మామూలు రావడానికి కారణాలు వున్నాయి. ఏమందురా! యీ అగ్రహారం దారులలో రెండవవారు మామగారి ఆస్తికి హక్కుదారుడై వచ్చినాడు. మామగారికి మగసంతానము లేకపోవుటచే, వున్నది ఒక్క కూతురే అగుటచే అల్లుడే మామగారి ఆస్తికి హక్కు కలిగిన వాడైనాడు. కాని యీఆస్తి అంతయూ భార్యపేర వున్నదనిన్నీ, తాను అమ్మగారి రైతుననీ, రైతులందరిచేత కవుళ్లు తనపేర వ్రాయించుకొన్న తరువాత చెప్పినాడు ఈనాం ఆక్టుకూడా వర్తించకుండా వుండాలని యీఎత్తు వేసినాడు. యీ కారణం చేతనే తానూ రైతునని చెప్పుతూ అమ్మగారికి మామూలుగా అమ్మగారి కడవలు తీసుకుంటూ వుంటారు.

ఈ అగ్రహారందారు యిదివరకు భూమి మీద ఎప్పుడో ఏర్పడియున్న సరిహద్దు రాళ్లపీకి మరొకచోట పాతించుటలో పేరుబడినవాడు. అంతేగాక ఏ గేదెలైనా తప్పిపోయి తన దొడ్డిలోకి వస్తే వాటిని కట్టివేసి తనవేననిచెప్పి స్వాధీన పర్చుకొనుటలో కూడా వెనుకంజవేయడు.

చల్లపల్లి ఎస్టేటులో రైతుల కడగండ్లు

కామ్రేడ్ అన్నే వెంకటేశ్వర్రావు

ది 2-1-39 సాయంత్రం నేనున్నూ, ఏలూరు తాలూకా సోషలిస్టుపార్టీ సభ్యులగు కామ్రేడ్ పి. భుజంగరావు, టి. అప్పలస్వామి గార్లున్నూ ప్రకాశం కమిటీ రిపోర్టును గురించి ప్రచారము చేయుటకు మొండూరు ఫిర్కా జమీన్ గ్రామాలకు బయలుదేరాము.

జోగన్న పాలెం

రాత్రికి జోగన్న పాలెం జేరాము. తాలూకా రైతుసంఘ కార్యవర్గసభ్యులగు ఆలూరి లక్ష్మీనారాయణగారు ఆ గ్రామములో నున్న మారుతీ గ్రంథాలయములో మీటింగు ఏర్పాటుచేశారు. సభకు చాలమంది రైతులు విచ్చేశారు. రిపోర్టును గురించిన్నీ మంత్రివర్గాన్ని బలపర్చే విధానాన్ని గురించి, పత్రికపఠనావశ్యకతనుగురించిన్నీ వుద్బోధించబడెను. తదుపరి ప్రకాశం కమిటీరిపోర్టును బలపర్చుచు త్వరగా ఆంధ్రరాష్ట్ర రైతుసంఘమువారి సవరణలతో చట్టం గావించాలనీ; ఈనాందారీ, ఏజన్సీ ప్రాంతాలకు కూడా వర్తింపజేయాలనీ, జిల్లా శాసన సభ్యులంతా జిల్లా జమీన్ రైతు సభకు విచ్చేసి బిల్లును బలపర్చాలనియు తీర్మానములు గావించబడెను. మొఖాసాదారు ఆ గ్రామమున గల హరిజనులకు కొందరికి చెర్వులో దట్టు భూమిని అమ్మి, కొంతవరకు కక్షలను కల్గించినను, వారున్నూ మొఖాసాదారుని చర్యల గుర్తించినట్లు తెలిసినది.

మొండూరు

ది 3-1-39 వుదయం మొండూరు వెళ్ళాము. రాత్రి 7 గంటలకు మీటింగు జరుగునని చాటింపు వేయించితిమి. మున్సబుగారి యింటివద్ద భోంచేసి చక్రాయిగూడెం, వేగివాడ, తాళ్ళ గోకవరం గ్రామాలకువెళ్లాము. బిల్లునుగురించివారికి తెలియజెప్పాము. బిల్లును బలపరుస్తూ మహజరు పంపితే కర్ణంగారు ఏమి యిబ్బంది కల్గిస్తారోనని చక్రాయిగూడెం రైతులు భయపడ్డారు. అయినా, తమ కష్టాలు నివృత్తి కాగలవనే ధైర్యంతో అప్పటికప్పుడే సంతకాలు, నిశానీలుచేసి మహజరు పంపారు. ఈబిల్లు మాకేమైనా లాభిస్తుందా అని కొందరు కూలీలు అడిగారు. జమిందారుల స్వంత కమతములు కౌలుదార్లకు జిరాయితీహక్కు గావలయునని రైతుసంఘంవారు సూచించిరనీ అట్లా చేయడానికి మీరుకూడ ఆందోళన చేయాలనీ చెప్పాము. రాత్రి 8 గంటలకు మొండూరు సత్రం ఆవరణలో ఆళ్ళ సుబ్బయ్యగారు (గ్రామ కాంగ్రెసు సంఘాధ్యక్షులు) అధ్యక్షతను సభ జరిగినది. బిల్లును బలపర్చుచున్నూ, జిల్లా శాసనసభ్యులు తమతమ నియోజక వర్గాలలో ప్రచారము గావించాలనీ, తీర్మానములు గావించబడినవి. తమ జమీందారు వుయ్యూరురాజాగారు కొంత వుదారవంతులైనా జమిందారీ విధానము రద్దు గావలసిన ఆవశ్యకతను రైతులు గుర్తించారు.

ది 4-1-39 వుదయం పెదవేగి వెళ్ళాము. అచ్చట బిల్లును గురించి విపులంగా తెలియపర్చాము, వారు వెంటనే మహజరు పంపుకొనుటకు ఉద్యుక్తులై ఉన్నారు.

గార్లమడుగు

ఈ గ్రామం పెదవేగిశవారు, చల్లపల్లి ఎస్టేటుకు చెందినది. పెదవేగిలో మీటింగుజరుగునని ఆగ్రామంలోకూడ తెలియపర్చాము, అయినను పనిపాటలు చేసుకునేరోజుల్లో వారు పొరుగూరురావడం కష్టమని తలచి మేమే ఆగ్రామం వెళ్ళాము. కాని జమీందారీ విధానమువల్ల కల్గే కష్టనష్టాల్లో ఒకపూట పని చెడడం ఒక లెఖ్క అన్నట్లు వారంతా ఎదురేగి వెళ్ళారు. మొదట మేమొక దొంకవెంట గార్లమడుగు వెళ్ళాము. ఆ గ్రామానికి ఒక చెర్వు క్రింద 25 ఎకరాలు, మరొక చెర్వుక్రింద 18 ఎకరాలు సేద్యం వుందనీ, ఎ. 1కి రు 24 లు శిస్తువుందనీ, పండినా, ఎండినా రెమిషన్ యివ్వరనీ, అడవి అంతా చాలాభాగం అమ్మేశారనీ, తెలిసినది. చల్లపల్లి జమిందారీలో రైతులీవిధంగా బాధించబడుచున్నారు.

★ మునగాల రైతుల విజయం ★

8 నెలల పోరాటంవల్లనే జమీందారు లొంగివచ్చాడు!

కామ్రేడ్ నండూరి ప్రసాదరావు

నేను 8 వ తేదీ మధ్యాహ్నము 2 గంటలకు మునగాల జేరుకున్నాను. అచ్చటి క్యాంపులో విచారింపగా గొట్టిపాటి బ్రహ్మయ్యగారు ఎప్పుడు వచ్చునదీ తెలియదని చెప్పినారు. ఇంతలో మునగాల బంగళాను ది 9 నుండి 12 వరకు తమకొరకై ప్రత్యేకించి యుంచవలసినదిగా జిల్లా కలెక్టరుగారు వార్త నంపినటుల తెలియవచ్చుటచే, బహుశః రాజీచేయుటకే వారు క్యాంపు చేయబోతున్నారనీ, బ్రహ్మయ్యగారు రాబోవుచున్నారనీ భావించాము. అనుకున్నట్లుగానే ది 9 న మధ్యాహ్నం జిల్లా కలెక్టరుగారు, బ్రహ్మయ్యగారు వచ్చినారు. వారితోబాటు జిల్లా రైతు సంఘాధ్యక్షులగు కామినేని వెంకటప్పయ్యగారు వచ్చుటచే రైతులకు కొండంత ధైర్యము కల్గినది. కాని విచారణ సమయంలో ఉందురనితెల్పబడ్డ కాట్రగడ్డ వెంకటనారాయణ ఎం.ఎల్.ఏ., పార్లమెంటరీ సెక్రటరీ బి. యస్. మూర్తిగార్లు రాకపోవుట ఏలనో తెలియలేదు. విచారణ ఎట్లా జరుగుతుందో మాకెవ్వరికి తెలియదు. బ్రహ్మయ్యగారి భోజనాలు వగైరా పూర్తియైనపిమ్మట మేము వెళ్ళి కలుసుకున్నాము. ఎస్టేటులోని ఒక్కొక్క గ్రామంలో ఏ ఏ రైతుకు ఏయే కష్టాలున్నాయో తెల్పుచూ మహజరును వ్రాసియిమ్మని వారన్నారు. ప.కృ. కాంగ్రెసు సంఘంవారి నివేదికనుబట్టి విచారణ జరుపమంటే వీలుకాదన్నారు. మేము మరునాడు 10 గంటలవరకు వ్యవధికోరి వచ్చినాము. మరునాడు మేము మహజరును ఇవ్వక పూర్వమే చాకలి, మంగలి, కుమ్మరి, మాదిగ వగైరా ఈనాందార్లను పిలిపించి, "ఈనాములను దావావేసి రాజాగారు గెల్చుకున్నారు; వాటికి శిస్తుకట్టి పట్టాలిస్తారు. తీసుకుంటారా?" అని అడిగారట. కాని వారు మా కమిటీద్వారానే వ్యవహరించాలిగాని మేము స్వయంగా తెల్పజాలమని జవాబిచ్చారు. పిమ్మట మేము మహజరు నిచ్చినాము.

మాపై చార్జిషీటు

దానిపై మధ్యాహ్నం 2 గంటల నుండి విచారణ ప్రారంభమయినది. ప్రథమంలో బారిష్టరు తుర్లపాటి వెంకటేశ్వరరావుగారు మాపై చార్జిషీటును చదివారు. బెజవాడలో రాజీ చేసుకొనుటకు మాటలు జరిగిన పిమ్మట ఎస్టేటులో కొక్కిరేణి వర్తకులను నిర్బంధపర్చి వారివద్ద రు 200 లు కాంగ్రెసు విరాళాలు ప్రోగుచేసామట. జగ్గుగూడెంలో కొల్లు [illegible]య్యగార్ని కాంగ్రెసులో జేరమని ఇంటిముందు సత్యాగ్రహం జేసామట. తాడువాడు గ్రామకర్ణం ఇంటి తల్పులకు అసుద్ధం కొట్టినామట. కలవకోన కూలీల విజయోత్సవమును జర్పితిమట. కొక్కిరేణి విషయం విని బ్రహ్మయ్యగారు ఆగ్రహం చెంది, తామావిషయాన్ని విచారిస్తామన్నారు. (మరునాడు కొక్కిరేణినుండి కాకిపల్లి నాగయ్యగార్లు వచ్చి తాము సంతోషపూర్వకంగా రు 100 లను విరాళమిచ్చితిమనియు, కాంగ్రెసు భవనాన్ని కట్టిస్తే మరొక రు 100 లను ఇస్తామనియు, తమ్మి ఎవ్వరు నిర్బంధపర్చలేదనియు బ్రహ్మయ్యగారికే తెల్పారు.) అటుపిమ్మట మా మహజరును చదివి, వాటిలోని కోర్కెలపై తమ సూచనలనిచ్చి, ఎస్టేటువారు అంగీకరించునదీ లేనిదీ తెలుసుకొని, మరునాడు తమ నిర్ణయముల నిచ్చెదమని తెలియజేసిరి.

రాజీ

ఆ మరునాడు మరల మధ్యాహ్నము సమావేశము జరిగినది. ఆలోపుగా ఎస్టేటుపక్షీయులగు కొందరు వర్తకులు తమకు చాకళ్లు, మంగళ్లు వగైరా పనిపాటలు చేయుటలేదని మొరపెట్టుకున్నారు. దానిపై కలెక్టరుగారు విచారణ జరిపి చాకళ్ళకు నెల 1కి రు. 1 చొ॥ ప్రతి కుటుంబము జీతమియ్యవలెననియు. కుటుంబమనగా భార్యాభర్తలు ఒక పిల్లడు అనియు అంతకుమించి రెండు కుటుంబాలున్నచో రు 2 చొ॥ ఇవ్వవలెననియు నిర్ణయించిరి. (ఇదివరకు చాకళ్ళకు సం॥ 1కి రు 2 లు జీతం) పిమ్మట బ్రహ్మయ్యగారు తమ నిర్ణయములనిచ్చుటకు ప్రారంభించారు. దాదాపు ముఖ్యవిషయము లన్నింటిలోను ఎస్టేటువారు వ్యతిరేకిస్తూనే వచ్చారు. ప్రథమంలోనే ఈనాందార్లకు, రైతులకు విభేదాలు కల్గించాలని చూసారు. ఈనాములలోని ఎక్సెసును కౌలుదార్లకు పట్టాలిచ్చెదమని కుమారరాజాగారన్నారు. న్యాయతః ఈ ఎక్సెసులేదు. ఈనాములు పూర్వపు తప్పు కొలతలవల్ల విస్తీర్ణము తక్కువగా నమోజుచేయబడ్డవి. కాని సర్వేలో అదే హద్దు బందీలలోని ఈనాము, సరియగు సర్వే వల్ల హెచ్చు ఎకరాలు తేలినవి. ఈ హెచ్చు పరిమాణము తమ భూమి ఆక్రమణ అని ఎస్టేటువారి వాదన. ఆవిధంగా ఎక్సుపార్టీ కోర్టు డిక్రీని కూడా పొందారు. ఈనాందార్లను కంటెస్టు చేయకుండా నిర్బంధించారు. కాబట్టి అజాస్తి విస్తీర్ణపు ఈనాము న్యాయంగా ఈనాందార్లదే. బ్రహ్మయ్యగారున్నూ కుమారరాజాగారి వాదన నంగీకరించి రైతులకు ఆవిధంగా అంగీకరింపమని ఉపన్యసించారు. కాని ఈనాందార్లు వ్యతిరేకించారు. రైతులున్నూ ఆ ఎక్సెసు న్యాయతః ఈనాందార్లదే గనుక తమ కక్కరలేదన్నారు. ఈవిధంగా ప్రజలలోని కట్టుబాటువల్ల ఎస్టేటువారి పాచిక పారలేదు. పిమ్మట అక్రమంగా స్వాధీన పర్చుకోబడ్డ భూములను, వ్రాయించుకొన్న ప్రతిఫల రహితమగు ప్రోనోట్లున్నూ ఎస్టేటువారు వదలుకొనుటకు నిర్ణయింపబడెను. కాని దౌర్జన్యంగా ప్రజలను బాధించి వసూలు చేసిన జరిమానాలు తిరిగి యిప్పించబడుటకు అంగీకరింపబడలేదు. ఇది ప్రజలకు మిక్కిలి అసంతృప్తి కల్గించినది. పిమ్మట ఎస్టేటువారు ఆక్రమింపబడిన సాముదాయిక భూములను వదలుకొనుటకు నిర్ణయింపబడెను. 20, 30, ఏండ్లనుండి వర్తకులకు సప్లయి నిమిత్తము ఎస్టేటువారు ఇవ్వవలసిన బాకీని యిప్పించుటకు కూడా నిర్ణయింపబడినది. చెర్వు సెడ్డకల విషయంలో తగాదావచ్చి కలెక్టరుగారి పరిష్కారానికి వదలబడ్డది. చెట్లలో రైతులవేవో జమీందారువేవో నిర్ణయించుటకు తహశీల్దారుగారు కోరబడ్డారు.

నూతుల తగాదా

పిమ్మట పెద్ద తగాదా వచ్చింది. స్వంత నూతులక్రింద మెర్కలలో సాగుకు శిస్తులు వసూలు చేయరాదను రైతుల కోర్కెను బ్రహ్మయ్యగారంగీకరించారు. కాని ఎస్టేటువారు వ్యతిరేకించారు. నూతులన్నీ తమవేనని వారి వాదన. చివరకు ఏయే నూతులు ఎవరివో నిర్ణయమైన పిదప, రైతుల స్వంత నూతుల క్రింద మెర్కసాగులకు శిస్తు వసూలు చేయరాదని నిర్ణయింపబడింది. పిమ్మట స్వంత నూతులక్రింది వేసంగి సాగులపై శిస్తు విధించకూడదని రైతులుకోరారు. సర్కారు గ్రామాలలో కూడా శిస్తు విధింపబడుటలేదని సబ్ కలెక్టరుగారు తెల్పారు. కాని ఎస్టేటువారు అంగీకరించలేదు. అంగీకరించిన వారి ఆదాయం సగానికి తగ్గిపోవునట. కలెక్టరుగారున్నూ రైతుల కోర్కెను బలపర్చారు. దానిపై పెద్ద ఘర్షణ జరిగి ఇరుపక్షాల వారమున్నూ లేచిపోయాము. చివరకు అట్టి సాగులపై రైతులు శిస్తులు చెల్లించ నవుసరంలేదనియు, ఎస్టేటువారు టెస్టుసూటును వేసుకొనవలెననియు, ఆతీర్పు ప్రకారం శిస్తులు నిర్ణయం జరుగవలెననియు నిర్ణయింపబడింది.

వెట్టి చేయనక్కర లేదు

అటుపిమ్మట ఎవరున్నూ వెట్టి చేయించుకొనరాదనియు, సాంఘిక బహిష్కారమును సాగించకూడదనియు, శిస్తు వసూళ్ళ సమయంలో సర్వే ప్లానులు రైతులు కోరినచో చూపవలెననియు రైతు సంతృప్తి చెందనిచో ఇచ్చిన శిస్తుకు రశీదిచ్చి, పిమ్మట చట్టప్రకారం చర్య జరుపుకొనవలెననియు, పట్టాలలో హద్దులు వ్రాసియివ్వవలెననియు కొన్ని నిర్ణయములు చేయబడ్డవి. ఈనిర్ణయముల ప్రకారం ఒక్కొక్క రైతు కేసును విచారించి తీర్పులిచ్చెదమని బ్రహ్మయ్యగారు తెల్పారు. ఆ రాజీ పత్రముపై ఎస్టేటు పక్షమున కుమారరాజాగారున్నూ, ప్రజల పక్షమున నేనూ, వెలదండ రంగారావు, నల్లపాటి వెంకట్రామనర్సయ్య, కందుల రాములు, కోధాటి వెంకట నర్సింహారావు, ఉప్పల రామయ్యగార్లమున్నూ సంతకములు జేసాము.

బాధలు తప్పాయి

ఈ రాజీ ప్రకారం ప్రజలకు స్వల్పమైన మేలు కల్గునేగాని జమీందారీ బాధలనుండి సంపూర్ణముగా విముక్తులైనారని నేను తలచను. సర్వే ప్లానులు, అమరకం లెక్కలు ఇప్పించుటకు బెజవాడలో నిర్ణయం కాగా అవి [illegible]కివ్వబడినచో వారు వాటిని రాజాగారికిచ్చెదరను ఎస్టేటువారి సాకుపై సర్వే ప్లానులు ఎస్టేటువారు అడిగిన రైతుకే చూపించవలెనని నిర్ణయించిరి. మాలో పరిష్కారానికి ఒకరున్నూ కుమారరాజాగారున్నూ సంతకములు చేసిన పిమ్మట ఒక విషయమును కొట్టివేసి, చెట్ల మోతరఫా విషయమును చేర్చిరి. "గతాన్ని మర్చిపోవాలి. క్షమించాలి" అన్న దృష్టితో బయలుదేరి, ప్రతి విషయంలోను గతములో ఎస్టేటువారు అక్రమం జర్పుటవల్ల రైతులకు అననుకూలముగా ఉండగా ఈ పరిస్థితిని గమనించక అన్నియు సక్రమమే యన్నట్టు వ్యవహరించారు. కానిచో తప్పెడు కోర్టు తీర్పు ప్రకారం ఈనాములను జమీందారువని ఎట్లు ఒప్పుకొనగల్గుదురు! అయిననూ ఈ రాజీకి ఈ క్రింది కారణములవల్ల అంగీకరించితిమి. (1) ఈ రాజీవల్ల రైతులకు ఎక్కువ లాభము లేకపోయిననూ నష్టమేమీ లేదు. (2) రాజీ కంగీకరించనిచో అంగీకరించని నింద రైతులపై బడును. (3) తమ కష్టాలు తొలగింపబడినచో వెంటనే పోరాటమును మానుకొందురనీ న్యాయమైన హక్కుల కొరకేగాని, ప్రతీకార బుద్ధితో పోరాటమును సాగించుటలేదనియు రైతులు రుజువుపర్చవచ్చును. (4) ఈనాముల విషయంలో పోరాటము తప్పినది. గుడ్డిలో మెల్ల అనునటుల పట్టాలైనా యివ్వబడినవి. (5) వెట్టి పద్ధతి మానుకోబడినది.

రైతు సేవకుల నభినందించాలి

ఈ రాజీ నిర్ణయ ప్రకారం రైతులకెంత లాభించునో, షరతుల ప్రకారం ఎస్టేటువారు ఎంతవరకు నడచుకొందురో చూడవలసియున్నది. ఆంజనేయులు, పరంధామయ్యగార్లు ఇంకనూ ఇచ్చటనే కొంత కాలముందురు. ఈ రైతు రక్షణ వారంలో గ్రామ గ్రామాన సభలు జర్పించుటకున్నూ, రాజీ పరిష్కారమువల్ల రైతులు లాభము పొందుటకై వారి సాక్ష్యమును తయారు చేయుటకున్నూ ఎస్టేటులో సంచారము చేసెదరు. వీరిచ్చటనే కొంత కాలముండుట మిక్కిలి అవుసరం. నిజానికి వీరి కృషివల్లనే ఎస్టేటు ప్రజ యింత చైతన్యము పొందగల్గారు. ఇందుకు వారి నభినందించాలి.

స్వదేశ సంస్థానాలు

స్వాతంత్ర్య జ్యోతిని నిలిపే తిరువాన్కూరు యువకులు

తిరువాన్కూరు స్టేట్ కాంగ్రెస్, దివానుపై ఆరోపణలను చేస్తూ రాజాకు సమర్పించిన వినతిపత్రాన్ని ఉపసంహరించుకొన్నది. స్టేట్ కాంగ్రెసు నాయకులు విడుదల చేయబడ్డారు. వైస్రాయి రాక సందర్భంలో తిరువాన్కూరు సంస్థానంలో తాను జరుపదలచిన ప్రదర్శనాలను కూడా స్టేట్ కాంగ్రెసు విరమించింది. ప్రస్తుతము మద్యనిషేధ కార్యక్రమాన్ని స్వీకరించి గ్రామగ్రామాల ప్రచారం చేస్తోంది. బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటుచేసే ప్రయత్నాలను చేయకపోతే తిరిగి ప్రత్యక్ష పోరాటాన్ని స్టేట్ కాంగ్రెసు ప్రారంభింప నున్నదని నాయకులు ప్రకటనలు చేస్తున్నారు. జనవరి 17 వ తేదీని స్టేట్ కాంగ్రెసు వర్కింగుకమిటీ సమావేశమై రాజకీయ వాతావరణాన్ని పునర్విమర్శించి ముందువిధానాన్ని నిర్ణయింపనున్నది. తిరువాన్కూరు స్టేట్ కాంగ్రెసు తన సలహాపట్ల చూపిన విధేయతను కొనియాడుతూ మహాత్ముడు స్టేట్ కాంగ్రెసు కొక తంతి నిచ్చాడు.

స్టేట్ కాంగ్రెసుయొక్క నిర్ణయం పొరపాటనియు. పరిపాలనావిధానంలోనున్న అక్రమాలను తొలగించవలసినదని రాజాను కోరడానికి ప్రతి పౌరుడికీ హక్కున్నదనియు, అట్టి వినతిపత్రాన్ని నిషేధించడం పౌరసత్వపు హక్కు నరికట్టుటయేనని కొందరు కాంగ్రెసు వాదులు తలచుచున్నారు.

తిరువాన్కూరు స్టేట్ కాంగ్రెసు వర్కింగుకమిటీతో మొదటినుండియు కలసి పనిచేసిన తిరువాన్కూరు యువజనసంఘం ప్రత్యేకం యీహక్కును నిలబెట్టడానికి సత్యాగ్రహాన్ని సాగించుటకు నిశ్చయించింది. 333 సభ్యుల దస్కతులతో స్టేట్ కాంగ్రెసుచే తయారు చేయబడి ఉపసంహరింపబడిన వినతిపత్రాన్నే తాను స్వయముగా మహారాజాకు పంపుటకు తీర్మానించింది. యీ వినతిపత్రాన్ని బహిరంగ సభలలో చదివి నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తున్నారు. వాటిని బహిరంగంగా పంచిపెడుతున్నారు. చాలమంది యువజనసంఘ సభ్యులను ప్రభుత్వము అరెస్టు చేసింది.

తిరువాన్కూరు స్టేట్ కాంగ్రెసు వుపసంహరించుకొనిన వినతిపత్రాన్ని ఉపసంహరించుకోరాదనియు, యి. చె. కురువిల్లాగారు, ఏ. కె. పిళ్ళేగారు ప్రచారం చేస్తూ, స్టేట్ కాంగ్రెసుఉద్యమాన్ని చీలగొడుతున్నారని ఎం.ఆర్. మాధవన్ వారియర్‌గారు ఒకప్రకటన చేశారు.

ఈ ప్రకటనను ఖండిస్తూ ఏ. కె. పిళ్ళేగారు మర్రియొక ప్రకటనచేశారు. తాను వినతిపత్రాన్ని సమర్థిస్తూన్నప్పటికీ, బాధ్యతాయుత ప్రభుత్వం కోరుతూ, స్టేట్ కాంగ్రెసు సాగించే పోరాటానికి సంపూర్ణమయిన సహాయంచేస్తామని ఏ.కె.పిళ్ళేగారు సమాధానమిచ్చారు.

యువజనులు ఇకమీద ప్రతి గురువారంనాడు సత్యాగ్రహం ఇట్లే జరుపుతారని యువజనసంఘం ప్రకటించింది. స్టేట్ కాంగ్రెసు ఉద్యమాన్ని ఆపి ప్రజలలో కలిగించిన విస్తేజాన్ని యువజనుల ప్రతిఘటన రూపుమాపింది.

తిరువాన్కూరు విద్యార్థి సంఘానికి సంబంధించిన శ్రీ బషీర్, స్టీవెన్ అనువారిని తిరువాన్కూరు ప్రభుత్వము అరెస్టు చేసింది. అందుపై అఖిలతిరువాన్కూరు విద్యార్థి సంఘాధ్యక్షుడు ఒక ప్రకటన చేశాడు. "భారతదేశమందలి ఇతరప్రాంతాలలోవలెనే తిరువాన్కూరులో గూడ విద్యార్థుల లాభాలను, హక్కులను, అభివృద్ధిని కాపాడుటకొరకే విద్యార్థిసంఘం పనిచేస్తోంది. అనవసరంగా విద్యార్థులపై నిర్బంధ విధానాన్ని ప్రభుత్వము సాగిస్తే వారుకూడా రాజకీయ వ్యవహారాలలో కలుగజేసుకోవలసివస్తుంది. విద్యార్థుల ఎదుట చేయబడిన సవాలుకు వారు తప్పక సమాధాన మిస్తారు. అందుచే ప్రభుత్వం విద్యార్థులను రెచ్చగొట్టుట మానివేయాలి. వారి వాక్సభాస్వాతంత్ర్యాల నరికట్టవద్దు" అని తిరువాన్కూరు ప్రభుత్వానికి హెచ్చరిక నిచ్చాడు.

స్టేట్ కాంగ్రెసు తరపు సత్యాగ్రహం ఆగిపోయినప్పటికీ స్టేట్ కాంగ్రెసు సేవకులు సెక్యూరిటీ సెక్షన్ల పేరుతో అరెస్టు చేయబడుతూనే వున్నారు.

రాజనందగోన్

రాజనందగోన్ సంస్థానంలో సత్యాగ్రహం ఇంకా సాగుతూనే ఉంది. ప్రభుత్వ నిర్బంధ విధానం మితిమీరి పోయింది. వ్యవహార సంబంధమైన సభలు జరపడానికికూడా అవకాశం లేకపోయింది. ఈ నిర్బంధ విధానానికి అసమ్మతిని తెలుపుతూ జనవరి 3 వ తేదీ నుండి వారంరోజులు హర్తాళ జరిగింది. డ్రగ్ మున్సిపల్ కౌన్సిలర్లు 7 గురు తమ సభ్యత్వాలకు రాజీనామానిచ్చి నిర్బంధవిధానంపట్ల తమ అసమ్మతిని ప్రకటించారు.

సంస్థానంలోని రైతాంగం కూడా సత్యాగ్రహానికి దిగింది. స్టేట్ కాంగ్రెసు అటవీ సత్యాగ్రహాన్ని ప్రకటించింది. 4 రోజులలో 50 మంది రైతులు అటవీ శాసనాలను ధిక్కరించి అరెస్టు అయారు. ప్రభుత్వము వారిని మందలించి వదలివేసింది.

జనవరి 10 వ తేదీని ప్రభుత్వం తన నిర్బంధవిధానాన్ని కొద్దిగా తగ్గించి వ్యవహార సంబంధమైన సభలు జరుపుకోడానికి అవకాశాన్నిచ్చింది. సంస్థానములోని దుకాణాలన్నీ ఒక్కొక్కటే తెరవడం ప్రారంభమైంది.

రాజనందగోన్‌లో మిల్లు కార్మికుల సమ్మె జరిగితే ఆ కార్మికసంఘాధ్యక్షులు ఆర్. యస్. రూయికరుగారు కార్మికుల తరపున పనిచేయడానికి వెళ్ళుచుండగా, సంస్థానంలోకి వారు రాకూడదని సంస్థాన ప్రభుత్వం నిషేధించింది. ఆసమస్యపై ఏర్పడిన స్టేట్ కాంగ్రెసు పౌరసత్వపు హక్కులకు బాధ్యతాయుత ప్రభుత్వపు ఏర్పాటుకొరకు సత్యాగ్రహాన్ని నేటివరకూ సాగిస్తూనే వుంది.

రాజపిపాల

రాజపిపాల సంస్థానప్రజల మహాసభ డిసెంబరు 28 వ తేదీని వల్లభాయి పటేలు గారి అధ్యక్షతను జరిగింది. బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, స్థానిక సంస్థలలో ఎన్నికవిధానం ఏర్పాటు చేయాలనీ, చెట్లు కొట్టుకొనుటకు ప్రజలకు అధికారము ఇవ్వాలనీ, భూమి పన్ను తగ్గించాలనీ మొదలగు కోర్కెలుగల తీర్మానాలను మహాసభ ఆమోదించింది.

సభానంతరం సంస్థానాధీశుడు సర్దార్ పటేలును కలుసుకొని అయనతో సంప్రదించాడు. పన్నులు తగ్గించడానికి, చెట్లు కొట్టుకోడానికి ప్రజలకు అధికారము ఇచ్చాడు. పేదలు ప్రభుత్వస్థలములపై కొంపలు కట్టుకొనేటందుకు అవకాశాన్ని కలిగిస్తూ నామకార్థం కొద్దిరుసుము మాత్రమే ఏర్పాటు చేశాడు. స్థానిక సంస్థలు ఎన్నిక పద్ధతి మీద ఏర్పరచడానికి అంగీకరించాడు. ఆ యా సంస్థల ప్రెసిడెంట్లు కూడా ఎన్నిక ద్వారానే ఏర్పడేటట్లు అవకాశమిచ్చాడు. ప్రెస్సులపైగల నిర్బంధాన్ని తొలగించడానికి అంగీకరించాడు.

ఇదివరలో ఎన్నో సంవత్సరాల నుండి సమావేశమవకుండ ఉన్న శాసన సభను త్వరలో సమావేశపరచుటకు ప్రభు వంగీకరించాడు.

రాజపిపాలలో బాధ్యతాయుత ప్రభుత్వమును ఏర్పాటు చేయవలసినదని ప్రభువును కోరుటకు ఆ సంస్థాన ప్రజలు ప్రయత్నాలు చేస్తున్నారు.

కియోంజార్

ఒరిస్సా రాష్ట్రంలో కియోంజార్ ఒక సంస్థానం: ఈ సంస్థాన ప్రజల మహాసభను, గోవర్ధనపూర్‌లో జరుపుటకు ఏర్పాటు చేశారు. గోవర్ధనపూర్ సికిన్ధా ఠాణాకు సంబంధించిన ఏరియాలోది.

ఒరిస్సా రాష్ట్ర రైతునాయకులు ఫణీంద్రనాథపాల్ గారు మరి ఇద్దరు కలసి ఈ మహాసభను ఏర్పాటు చేశారు. సభ సమావేశము కాకపూర్వమే కటక్ జిల్లా మేజస్ట్రేటుగారు అక్కడకు వచ్చి సికింధా, ధర్మశాల, కొరై ఠాణాలకు చెందిన ఏరియాలలో సభలు జరుపుటకాని, మరి ఏ ప్రదర్శనములు జరుపుటకు గాని వీలు లేదని, వీరిపై 144 సెక్షన్ జారీ చేశారు.

భోపాల్

భోపాల్ సంస్థానంలో నిషేధింపబడిన పత్రికలపై నిషేధాన్ని సంస్థానాధిపతి జనవరి 10 వ తేదిని తొలగించాడు. 11 వ తేదీని సంస్థాన ప్రజలకు కొన్ని సంస్కరణలను ఇచ్చాడు. 1. లెజిస్లేటివు కవున్సిలుకు మరి రెండు స్థానాలను భోపాల్ సిటీ నుండి, శెహోరు కంటోన్మెంటు నుండి ఎన్నుకొనుటకు అధికారము నిచ్చాడు. 2. భోపాల్ మునిసిపాలిటీకి మరి 5 స్థానములు హెచ్చు చేయబడినవి. ఇవన్నీ ఎన్నుకోబడవలసినవే. 3. సంస్థానంలో స్థానిక పరిపాలన వ్యవహారాలను చూడడానికి 10 మందిగల ఒక కమిటీ ఏర్పాటు చేయబడింది. ఇందు 5 గురు ప్రజలచే ఎన్నుకోబడినవారు మరి 5 గురు సంస్థానాధీశునిచే నియమింపబడినవారు ఉంటారు. ఈ కమిటీ సభ్యులు 10 మందిలోనుండి ఒకరిని అధ్యక్షుడుగా సంస్థానాధీశుడే నియమిస్తాడు.

(తెరలో)

ధూప ధూమములు
దీప జ్యోతులు
రాతి బొమ్మలకు
రంజన మిడునా?
మాయల మారుల
మాగధ గీతులు
స్తోత్ర పాఠకుల
శుష్క ప్రియములు
శిలా విగ్రహము
చెవుల సోకునా?
దేవుని కోసము
జరిగే నాశము
దేవుని పేరను
జరిగే మోసము
దేవుడే నిజముగ
తెలిసికొన్నచో
చింత నొందడా?
సిగ్గు చెందడా?
అన్నెము పున్నెము
అసలే యెరుగని
పేదల నెత్తురు
పీల్చి క్రౌర్యమున
మతపు పిచ్చితో
మటు మాయలతో
కపట నటనతో
కలుష తాండవము
సలిపే లోకము
విశ్వనాథునకు
వేడుక యగునా?

[రంగమంతయు కారుచీకటి. విషాద వాద్యధ్వనులును, బలి పశువుల యార్తనాదములు మానవుల కేకలును, ఆ చీకటులను జీల్చుకొని వినవచ్చుచుండును. రంగముపై పెద్ద శిలావిగ్రహము: దాని ముందు మినుకు మినుకుమను గ్రుడ్డి దీపము. ఆ దీపమునకుపైన నల్లని గొలుసు వ్రేలాడుచు, "మానవుల మనసు మార్చుట ఆచేతనమునైన నా యార్తధ్వనికి దరమగునా?" అని కంపించు చున్నట్లు అటునిటు ఊగుచున్న జయగంట. క్రమంగా చీకటి రక్తవర్ణముగా మారుచుండును. గుంపుగా పెద్దలు, పిల్లలు, స్త్రీలు ప్రవేశింతురు. వారు నిరుపేదలు; శుష్కశరీరులు, క్షుధాతురులు; ఆర్తులు.]

అందరు (గొంతెత్తి)

స్వర్ణపీఠముపై శాంతముగ వేంచేసియున్న దేవా! మా మ్రొక్కు లందుకొనుము. నీవు మా మొరాలింపకుండుటయు మామేలు కొరకే నట! ఇనుప కాళ్ళ క్రింద అణగియున్న నిరుపేదలము మేము. ఆకలిచే కడుపు వెన్నునంటుకొని పోయినను, తనువు శల్యావశిష్టమైనను, మేము నిన్నే నమ్మియున్నాము. సాటి మానవులవలె నీవు మమ్ము నీచముగా జూడక రక్షింపుము దేవా!

[విగ్రహము వెనుకనుండి వెరపుగొల్పు వికటాట్టహాసము వినిపించును.]

ముసలిది

"ఎండి ఒరుగయ్యెనయ్య మా గుండెలెల్ల
వట్టిపోయెను మా పాడి పశుల మంద
నాల్గు దినియూర నేడ్చుచున్నారు శిశువు
లకట కొంపలో నొక్క గింజైన లేదు
ధనిక గృహముల కాపుండె ధాన్య లక్ష్మి
ఎంత కష్టించినను పొట్టకింత కూడు
కూడ కఱవయ్యె నింక నేనాడు మాకు
నీయనుగ్రహము లభించు నోయి దేవ!"

అయ్యయ్యో! నా కుమార్తె చచ్చుటకు సిద్ధముగా నున్నది. గింజల ధర పెరిగినది. నిలువ నీడలేని పేదవి పక్షులము స్వామీ! ఇది మా గ్రహచారమా?

యువతి

అయ్యో! పాపము! అవ్వా! నీకూతురు చావ సున్నదా! మన పొరుగామె తన గౌరవ మంతయు గొప్పవారికి కొద్ది డబ్బుకై యమ్ముకొని చచ్చినది. తిండిలేక చచ్చిన పిమ్మటగాని దేవుని దీవనలు మనపై కురియవట! జీవితంలో నవ్వను నది ధనవంతులకేగాని మనకు గాదట! ఈమాటలు విన్నావా? దేవుని చెవులకుఁ దీరుబాటు లేదట మన మొరాలకించుటకు!

యువకుఁడు

"శ్రీసువర్ణ పీఠాన వేంచేసియున్న
దేవ! మౌనమ్ము దాల్చియున్నావు నీవు
ఎండుచున్నవి మా పూల దండలేల
చేతిలో నల్గుచుండె తెచ్చిన ఫలాలు
అకట! గొంతార్చుకొని పోవునట్లు మేము
వేడు చున్నను గదలవు చూడవేమి?
కడకనఁగ రాని కష్టాలఁ బడుట కొఱకె
ఈ దరిద్ర జన్మమ్ము మా కిచ్చినావె
'మా మొరాలింపఁ జాలని మౌనమూర్తి!
పేదలకు లేదె నీ దయా భిక్ష మింత
మౌనమే నీయకుంఠిత జ్ఞాన మొక్కొ!"

గృహస్థు

ఓ దేవా!
"పేదలమై యుద్భవించిన మేము
ఆపదలైన ననుభవించెదము
కాని యాకటి మంట కాలుచునున్న
మా పసిపిల్లల మా చేమి స్వామి!
ప్రభుఁడవంట కృపారాశివంట
మాబోటు లాకట మాడుచు నుంట
మచ్చగాదే నీదు మహిమకు దేవ?
అయ్యయ్యో! ఇది యేమి యన్యాయమయ్య!
కఱవులే కాదు రోగమ్ములే కాదు
కూడు గుడ్డకు నోచుకొననట్టి మమ్మ
తొలి ముద్దఁ జేసి యాకలి నార్చుకొనును
ఎండ గాసిన వాన లెత్తి వచ్చినను
వరదవచ్చినను సాగరమ్ము పొంగినను
ముందు మా గుడిసెలే మునుఁగును దేవ!
పేదలైనను నీకు బిడ్డలు కారె
ఏల దీనుల మొరాలింపవు స్వామి?"

గృహిణి

మన నాయకులేమనుచున్నారో వినలేదా? వెనుకటి జన్మములలోని కర్మములే మన సిట్లు కట్టి కుడుపుచున్నవట! గాదెలలో చీమ దూరుటకైన చోటు లేకుండ ధాన్యము నింపుకొన్న వారందరు వెనుకటి జన్మములలో పుణ్యముఁ జేసికొన్నవారట! ఈ జన్మములో మంచియన్నదేదియు రవ్వంతైన చేయకున్నను దేవునకు వారిపై కోపము రాదట! సముద్రములోని బడబాగ్ని! వనములోని దావాగ్ని! పేదలపై భగవంతుని కోపాగ్ని! ధనవంతులు, కడుపుమాడి చచ్చుచున్న మనకుఁ బిడికెడు గింజలైన నీయకుండుట భగవంతుని శాసనమేయట!

మిల్లుకూలి

ఆకలి, కఱవు, కలరా, అగ్ని, వరదలు ఇవన్నియు దయచేత భగవంతుఁడు మనమీదికిఁ బంపుచున్నాడట! మిల్లుగొట్టము పొగ వదలుచున్నది. కాని నేను నిట్టూర్పునను విడువ లేకున్నాను. నా చేతుల పంటతో ధనవంతుని యిల్లు బంగార మగుచున్నది. నా చేతులతో పాటు నాకడుపు మండుచునే యున్నది. పన్నులు, ఎడతెగనిపని, పెద్ద జరిమానాలు, త్రాగి తిట్టు యజమానులు, ఇవియే మనకు భగవంతుని దయ. చల్లనిగాలి, మంచి యాహారము, అందమైన భవంతులు, తరగని పాడి, విలువకట్టరాని వేషము, ఆటలు, పాటలు ఇవి ధనవంతులయెడ భగవంతుఁడు చూపు దయ. అనుభవింపక తప్పదని మన నాయకులు. మతాధికారులు నిత్యము మనకు బోధించుచుందురు. అయ్యో దేవుడా! ఏమి బ్రతుకు!

ముదుసలి

"కడవపోతగఁ గురియు మా కంటి నీట
చెమ్మగిలదె నీ కర్కశ చిత్తమింత
విడని యాకట కాలు మా కడుపు మంట
అకట శోకదె నీకు రవ్వంతయేని
ఒకరి లోభమ్ముకై చెమటోడ్చి యోడ్చి
అస్థిపంజరాలైన దేహములు మావి
నీమనంబును కరగింపనేర వొక్కొ!
భువిని కోటాను కోట్లు మానవులు మృగము
లట్లు మాడుచుండుట కననైన కనవె
అకట! నిరుపేదలైన మాయట్టివారు
ఎడతెగని కష్టముల తోడఁ గడిపినట్టి
కాళరాత్రులలోన నొక్కటియు నాప
లేదె తుద కొక్కనాటి సూర్యోదయమును!"

అయ్యయ్యో! పేదల బాధలే దేవుని బలముకాబోలు! మనకై నెన్నెన్ని కష్టములు కల్పించినను ఆ భగవంతునకు మనము విధేయతనేఁ జూపవలయును: కష్టములు, బాధలు పడిన గాని భగవంతుని కృప కలుగదని పాడిన కవి యొక డున్నాడు. వారందరు మంచిస్థితిలోనుండియే మనకై యీ మాటలు చెప్పుచున్నారు. ఎంతకాల మీ యోర్పు?

యువకుడు

అదుగో, అదుగో, వారు వచ్చుచున్నారు. దేవుని కెట్టి యాపద కలుగకుండఁ దాళము వేసిననారు వారే! ఆ చెరలోని దేవుని కూడ మనమే రక్షింపవలెను.

ప్రజలు

రక్షింపుడు, రక్షింపుడు.

పూజారులు

ఈ పవిత్ర స్థలమును మీ గోలతో నింపుటకు వచ్చితిరా? పశువుల వలె నరచెద రేల? అదిగో! ఆ విగ్రహమును జూడుడు!

ప్రజలు

దేవుని యనుగ్రహమే కఱవు. అది తొలగించుకొనుటకు వచ్చితిమి.

పూజారులు

కాని మీరు వట్టి చేతులతో నేల వచ్చితిరి?

ప్రజలు

దుఃఖపూరితములయిన మా హృదయములను గానుకలుగఁ దెచ్చితిమి. కానుక లిచ్చిన గాని దేవుఁడు కూడ మా మొరాలింపఁడా? ఐన నిదిగో బాధ యనెడి యీ యెఱ్ఱని పూవును దేవుని కర్పించెదము!

పూజారి

ఆయర్పణము వట్టి నీడ; మీ జీవితములును వట్టి నీడలే! ఈ కాంతి కడకు ఆ చీకటి నేల తెచ్చెదరు? వెళ్ళుడు.

యువతి

నే నొక కొబ్బరి కాయను తెచ్చితిని.

పూజారి

కొంత నయము

ముదుసలి

దేవుని కర్పించుటకు నే నొక గొఱ్ఱెను దెచ్చితిని.

యువకుఁడు

నీ మొగమునకు గొఱ్ఱె కూడ! గొఱ్ఱెలు జమీందారులవి. నీకు డబ్బెక్కడిది? ఆహా! ఇంత బలిసిన గొఱ్ఱె నెచ్చట దొంగిలించితివి?

ముదుసలి

కాదు బాబు కాదు. నేనే తెచ్చితిని. ఇది నాదని ఆ భగవంతునికిఁ దెలియును. దేవుని మెప్పుఁ గోరిన నేను దొంగిలింతునా? ఈగొఱ్ఱె నా యనుంగు బిడ్డ!

పూజారి

అటులయిన దేవునికి బలి యిత్తము: దొంగిలించినది దేవుని సొత్తేగదా!

[గొఱ్ఱెను బలి పీఠముకడకుఁ దీసికొని పోవుదురు. అంతలో ప్రజలలో నుండి గుంపును ద్రోసికొనుచు నొక కవి ముందుకు వచ్చును.]

కవి

"అగుడయ్య పురాణ మహాంధకార
మగ్నులైన యీ నిరుపేద మనుజులిచ్చు
గ్రుడ్డి కాన్కలతో శిలామూర్తియైన
పాడు దేవుని మెప్పెడు వేడుకేల"

ప్రజలు

దారిద్ర్యమును పొగడిన కవియేనా యితడు! రాత్రింబగళ్లు ప్రకృతి సౌందర్యమును గానము చేసిచేసి యితనికి పిచ్చిపట్టినది.

కవి

నిరాహారులు నికృష్ట జీవులు
వినండి పేదలు. వినండి యనదలు
రెక్కాడక డొక్కాడని యట్టి
కార్మికులారా! కర్షకులారా!
నాపాటలు చెవులార వినండి
మేడగదులలో మెత్తని పరుపుల
సుఖ విశ్రాంతుల సోలుచు తూలుచు
సరిగి పట్టువస్త్రాలు గట్టుకొని
కలమానంబులఁ గడుపు నింపుకొని
సాటివారి కష్టాల చూడక
గొప్ప ధనాఢ్యుల మెప్పుకోసమై
బ్రతుకు తెరువుగా భగవంతుండని
ముఖస్తోత్రములు మురియుచు పాడే
వెనుకటి కవి యని యనుకోకండే.
పూడ్చిపెట్టితిని పూర్వపు పాటలు
మంటబెట్టితిని తొంటి పద్యములు
ప్రకృతి వర్ణనలు సుకృతి కీర్తనలు

స్వార్థ జీవితము వదలివైచితిని
అనదల యాకలి, ఆర్తుల బాధలు
నిరుపేదల దుర్భర జీవితములు
పాడుచున్న మీతోడి పేదను
వినండి పాటలు వినండి బాధలు
అమాయిక ప్రజలారా! వినుడు!

ప్రజలు

వినవలసిందేదో చెప్పు బాబూ! వేగమే

కవి

"సౌఖ్యభోగ విశ్రాంతుల కెప్పుడు
ప్రకృతి సిద్ధమగు ఫలమహారము
అన్నమన్నమను అనదల కేకల
దేవుఁడావిరై పోవును: సత్యము
కూడులేక యల్లాడువారికి
యెక్కడి దేవుఁడు యక్కడి లోకము
భగవంతుఁడు ధనవంతుల వాఁడే!
క్షుదాతురుల దయఁజూడని దేవుఁడు
కష్టజీవులను గానని దేవుడు
అనదల మొరల వినవట్టి దేవుడు
ఐశ్వర్యాంధుల కైనదేవుడు
పేదవారి భయపెట్టెడి దేవుడు
రాతి చరను విడిరాని దేవుడు
పొట్టమాడు మనబోట్ల కెందులకు?
యెక్కడి దేవుడు యెక్కడి దర్మము
అమాయిక ప్రజలారా! వినండి!"

పసరిది

నేను నిరుపేద దాననే. కాని దేవుని ప్రార్థించుట మానలేదు. చచ్చుచున్నను యిప్పటికిని నేను మేలు చేయుమని దేవుని ప్రార్థించుచున్నాను.

ప్రజలు

మన పూజారులు మన స్వాములు "ఉపవాసములు చేయుడు, దేవుని ప్రార్థించుడు; మీ పేదతనము పేకష్టములు అతని ప్రసాదము; భగవంతుని శోధన" అని చెప్పుచున్నారేమరి!

కవి

ఓ! ప్రార్థన! నల్లమందది. తరతరముల నుండి నిరుపేదల మగు మనమూ నల్లమందు

విగ్రహము

మత్తులో పడియున్నాము. మనకనుదినము ఉపవాసమే! జీవితమంతయు ప్రార్థనయే! కాని మన ప్రార్థనలను విన్నవారెవరైన యున్నారా!

"ఒక్కమారైనఁ ప్రార్థింపకున్నఁగాని
భాగ్యవంతున కెట్టి లోపమ్ము లేదు
దినదినోపవాసముల ప్రార్థనలఁ గొట్టు
కొనెడి పేదకు పట్టెడు కూడె కఱవు
ధనమదాంధులె పేదల కన్నుల గప్పి
కాచుచున్నారు దేవుని గౌరవంబు
దేవుఁడునుగూడ ధనిక విధేయుఁడగుచు
కొరుకుచున్నాడు పేదల గొంతు ముడులు"

పూజారి

పొండిపొండి. ఆ ప్రేలుచున్న పిచ్చివానితో కలిసి మీరుకూడ పొండి.

ప్రజలు

మా కడుపు మలమల మాడుచున్నది. మా కన్నము పెట్టునో లేదో యీ రాతిబొమ్మ నడుగుటకు వచ్చితిమి.

కవి

నోరులేనిది యీ రాతి బొమ్మ! ఈ బొమ్మపేరుతో నోరున్న పూజారులు తమ పొట్టలు నింపుకొనుచున్నారు. మన యాకలి! దీర్చెవారెవరయ్యా ఇక్కడా! అమాయికులారా, అజ్ఞానులారా! మీరును రాతి బొమ్మలైపోవుచున్నారే చివరకు!

పూజారి

ఇచ్చట దేవదూషణ పనికిరాదు. మీదౌర్జన్యము మాని పోకున్నచో రక్షకభటులను పిలిపించెదము.

ప్రజలు

అయ్యో! అయ్యో! ఆకవిని ఖైదీగా పట్టుకొని పోవుదురోయేమో!

కవి

దేవుఁడు సర్వశక్తిమంతుడుగదా! అతనికిఁగూడ రక్షకభటుల యాశ్రయము కావలెనా! దేవుఁడని చెప్పి మీకోసమే రక్షకభటుల సాయముగోరుచున్నాడు మీరు. దేవునికన్నను మీకన్నను రక్షకభటులు మాత్రమేమంత భయంకరులు? ఇంతకాలము మా కన్నులు గప్పి జడిపించిరి. మాకిక నే భయములేదు. ప్రజలారా! మిమ్ము చూచియే నేడు దేశమాత రొమ్ము చేపుచున్నది అయ్యయ్యో!

"భాగ్యవంతులపాలి బానిసలార!
అకటనల్లాడు అజ్ఞానులార!
రక్షక భటులన్న శిక్షలటన్న
బంది కానాలన్న భయమేల మీకు?
ఇప్పుడు మనమున్న యీయనంతాంధ
కార బంధము కంటె కారు వేరేమి?
పొట్ట కోసరమె దేవుని పెట్టుకొన్న
పూజాటులన్న స్వాముల వారులన్న
వెరచుటెందుకు? గౌరవించుటెందులకు
మనశక్తి మన మెరుంగని యంతవరకు
మనము జ్ఞానజ్యోతిని గననంత దాక
వచ్చును వారికి బంగారు కలలు
మన గ్రుడ్డితనమే వీరిని పెంచు శక్తి
మన కాన్కలే వీరిని మనిచెడు పంట
మనమెల్లఁ జల్లు విత్తనముల పంట
ఈ జన్మమందె భోగింతురు వీరు
దినమెల్ల చెమటోడ్చి పనిచేయు మనకు
అనుభవంబె జన్మమందైన లేదు
జన్మాంతరము మాట సత్యమో కాదో!
పరమార్థ మేమో యెవ్వరు చెప్పగలరు?
మింటమబ్బును జూచి కుంటలో నీరు
పారజల్లెడి వెట్టి పప్పులు గలరె!"

పూజారి

నాస్తికుడా! దేవుని దూషించు నిన్ను శపింతుము జాగ్రత్త!

కవి

ఇతరులను దీవింపలేని మీరు శపింతుమని మాత్రము భయపెట్టుచుందురు. పిల్లి శపించినంతమాత్రాన ఉట్లు తెగిపడునా! దేవుడు రక్షించునని మీరు మా నెత్తిని బెట్టు శఠగోపములతో మీ తలలు పగులగొట్టగలము.

పూజారి

ఇక నీవు పెదవి విప్పినచో నిన్ను నాశనము చేసెదము

కవి

మీ చేష్టలతోపాటు మీరందరును యిప్పుడే నాశనమై పోయెదరు. చూడుడు రండి ప్రజలారా! తరతరముల నుండి దేవునిపేరు చెప్పి యపహరించిన మన ధనరాసులు ఆవిగ్రహము క్రింద నున్నవి. రండు మన ధనమును మనము తీసికొందము.

[అని విగ్రహము కడకేగి దానిని గట్టిగా త్రోసివేయును. పెద్ద చప్పుడగును. ప్రజలందరును మూగుదురు.]

కవి

ప్రజలారా చూచుడు! నామాటలు నిజమేనా!

ప్రజలు

నిజము! నిజము! బంగారు నాణెములు! బంగారు నాణెములు!

కవి

నిజముగా ఒక్కొక్క నాణెము ఒక్కొక్క మన రక్తపు బొట్టు. ఇప్పుడు విగ్రహములేదు రండు పూజారులారా! మీ మత రహస్యము నేటికి వెల్లడయినది. రండి నిరుపేదలారా! ఇది మన యందరి స్వామ్యము.

(గాలిలో వికటాట్టహాసము వినిపించును. జయగంట యెడతెగక మ్రోగుచుండును. తెర పడును.)

పోలీసు ఆఫీసర్ల దౌర్జన్యం.

(ఆత్మకూరు సర్కిల్ యినస్పెక్టరు వారికథ)

మా తాలూకాలో ధనికుల సహాయంతో పోలీసుజులుం అంతులేకుండా సాగిపోతోంది. పల్లెలలో వున్న ధనికులు మునసబు, కరణాల సహాయంతో ఓద్మప్రజల వేపుకు తింటున్నారు. పోయిన సంవత్సరం వాశిలి గ్రామములో ఒక చోరీ జరిగింది. తెల్లవారి పోలీసులు వచ్చారు. వచ్చి రాకముందే గ్రామపెద్దలనబడు కొందరు ధనికులతో సలహాపడి అంతకుముందు ఈర్ష్యాభావంతో కూడుకొనియున్న వీరి మనసు దిక్కుమొక్కులేని కూలీలపైపు మరలింది. హరిజనవాడలో పెద్దగా వున్న చెలికా వెంకటేసును గ్రామ సత్రందగ్గరకు తీసి కేసునుగురించి అడిగారట. నాకు తెలియదన్నాడు. తెలియదంటావా అని బయట గుమిగూడియుండిన ప్రజలకు కనబడకుండా సందులో త్రోసి సర్కిల్ యినస్పెక్టరు తన చేతి లాఠీతో చావమోదుతుంటే బోరున యేడ్చుచుండే బయటప్రజలు ఉద్రేకపైనారు. అదిగాక క్రిందపడద్రోసి కాలిబూటుతో పుఖముపై సహా తన్నుతుంటే సర్కిల్ యినస్పెక్టరును మందలించక ప్రోద్బలం యిచ్చారట. ద్రోహులు కాని ప్రజలు ఆ నరహింసను సహించలేక చింతాక్రాంతులైరి. ఇదిగాక గ్రామములో వున్న అనాథులగు హరిజనులను యానాదులను సత్రంలోచేర్చి, పేము బెత్తములతో మోదారట. రెండవరోజు వెంకటేసును జైల్కు తీసుకుపోయి అక్కడకూడా భయంకరంగా కొట్టేరట. ఆ దెబ్బల ఫలితం ఇప్పుడు గుండె నొప్పికూడా పట్టింది. జైలులో కొట్టిన చావు దెబ్బలకు నోట రక్తం కారుతూ చేతు లెత్తి నమస్కరించి నాకు తెలియదని ప్రార్థించినా చేతులపై లాఠీలతో మోదినారట. 15 రోజులు జైలు చేసినతర్వాత అసలు దొంగ కావిలి తాలూకాలో సొత్తులతో కూడా దొరికిన తర్వాత వెంకటేసుని వదిలేరు. ఈఅపరాధిని యెంత కష్టపెట్టేరో గాక ఈనిర్దోషిని శరీరమంతా చితుకబొడిచి వదిలారు. ఈ సర్కిల్ యినస్పెక్టరే వోలగల్లు కూలీల సమ్మెను రాజీ చేస్తామని వచ్చి ఆయన చెప్పినట్లు రాజీపడకపోతే తుపాకులతో కాలుస్తామన్నారట. 26-12-28 తేదీ పోసుగోడు గ్రామంలో ఒక చోరీ జరిగిందట. ఆ రాత్రి 11 గంటలకు సబ్ యినస్పెక్టరు, కొంతమంది పోలీసులూ పోయి క్రిష్ణం కామయ్య, చెంచయ్య అనువారల ఆ అర్ధరాత్రిలో ఆగ్రామంలోనే చావమోదినారట. తెల్లవారి మళ్లీ వీధిలో పడద్రోసి వారి యిష్టం వచ్చినట్లు లాఠీలతో కొట్టి బూట్లతో తన్ని చెంచయ్యవద్ద 6-0-0 రూపాయలు తీసుకొని వదలివేసి, క్రిష్ణయ్యను జైలులో క్రుక్కిరట. వాశిలిగ్రామంలో వోబయ్య అను పోలీసు త్రప్పత్రాగి వళ్ల తెలియక మొల గుడ్డలతో సహావదలి అంగమొలతో వీధురెంబడి స్త్రీలను పురుషుల బూతులు తిట్టుతూ రాళ్ళతో విసరుతు సత్రంవద్దకుపోయి. గుడ్డల వేలంవాళ్ళదగ్గర దౌర్జన్యంగా రెండుచీరలు అపహరించి, అవి సారాదుకాణములో కుదువబెట్టి, మళ్ళీ త్రాగి ఆత్మకూరు పోయాడు. యీ విధంగా చిన్న మొదలు పెద్దవరకు పోలీసు ఆఫీసర్లు మా తాలూకాలో విచ్చలవిడిగా యీ దౌర్జన్యములు సాగించుచున్నారు. వీరిపై చర్య గైకొనవలసినదని కాంగ్రెసుప్రభుత్వమువారిని కోరుచున్నాము.

వాశిలి, 8—1—39. బి. సి. కొండయ్య.



మధిర తాలూకా తక్కెళ్ళపాడు నైజాం పోలీసు పటేలు దుండగములు.

అయ్యా. వీరి దుండగములు ఎలా వుంటవి అంటె కోడిపందెములు వేయించడము గెల్చినవారి దగ్గర కోడి లంచము, పేకాట ఆడించి వారి దగ్గర లంచము, బంగారు పనిచేయువారుంటే లంచం, ఆడవారి తగాదా మగవారిదాకా పురిగొల్పి ఇరుపక్షములవారిదగ్గర లంచము, ఏ పనివాడైనను తప్పక లంచము యివ్వవలసినదే. ఈ దుండగముల అష్టవేరే సృష్టించినారో లేక యెక్కడిదో తెలియదు ప్రతిబీదవారిని యిలా నిర్బంధం పెట్టుతూ వున్నారు యెవరైనా లంచం యివ్వనంటె సింహగర్జనలు చేస్తూ యేమేమో చేసెదనని భయపెట్టుతున్నారు. నోటికి వచ్చినట్లు తిడుతారు. ఇట్లు

ఒక విలేఖరి.

* * * * * *

కోలవెన్ను వ్యవసాయకూలీ సంఘస్థాపన

27-12-38 తేదీ యీ గ్రామములో వ్యవసాయ కూలీ ప్రేమీసంఘము స్థాపించబడినది. ఈ సందర్భములో పార్లమెంటరీ కార్యదర్శి బి. యస్. మూర్తిగారు, కాట్రగడ్డ వెంకటనారాయణ ఎం. యల్. ఏ. వి. కూర్మయ్య ఎం. యల్. ఏ. యన్. నాగప్ప యం. యల్. ఏ. గార్లు విచ్చేసారు. పైనాయకులు కార్మికులు సంఘాలు ఏర్పరచుకొని ఐకమత్యంగా వుండాలనియు, కాంగ్రెసుతో చేరాలనియు ఉపన్యాసం. దారు వందనములతో సభ ముగిసింది.

ఏ. ప్రసాద

"బాటా" ఫ్యాక్టరీ కార్మికులపై పోలీసు కాల్పులు

కలకత్తాలోని, బాటా చెప్పుల ఫ్యాక్టరీలో జనవరి 4 వ తేదీనుండి 2500 మంది కార్మికులు సమ్మెను ప్రారంభించారు. వీరి జీతాలు నెలకు రు. 30-0-0 లకు మించవు. రు. 20-0-0 కనీస జీతము.

సమ్మెకు కారణాలు

1. కార్మికుల ఇండ్లపై కప్పులు మంచివి ఏర్పాటు చేయాలి. 2. కార్మికుల యిండ్లకు అద్దెలు తగ్గించాలి. (ప్రస్తుతపు రేట్లు మనిషి 1 కి వారానికి రు. 0-5-0) 3. కార్మికులకు జీతముతో సెలవులు యివ్వాలి. 4. ఉద్యోగము ఖాయము చేయాలి. 5. కార్మిక సంఘాన్ని యజమానులు గుర్తించాలి.

జనవరి 1 వ తేదీని సౌమ్యేంద్రనాధ టాగూరు అధ్యక్షతను "బాటా" కార్మికుల సభ జరిగింది. సభనుండి తిరిగి వస్తూనే కార్మికులు కంపెనీ యజమాని వద్దకు పోయి తమ యిబ్బందులను నెరవేర్చవలసినదని కోరారు. కార్మికుల యిబ్బందులను విచారణ చేయడానికి కంపెనీ యజమానులు సూపర్వైజర్లను రెండవ తేదీ పంపాటు. సూపర్వైజర్లు తమ రిపోర్టును యజమానులకు తెలియజేశారు. యజమానులు తమ అభిప్రాయాన్ని 7 వ తేదీని తెలియజేస్తామన్నారు. కాని 4 వ తేదీ మధ్యాహ్నము నుండి తోళ్ళ ఫ్యాక్టరీ రబ్బరు ఫ్యాక్టరీలలోనున్న కార్మికులు సమ్మె చేశారు. యజమానులు బలవంతముగా కార్మికులను మోటారు లారీలలో తీసుకొని పోవాలని ప్రయత్నము చేయడమువల్ల 7 వ తేదీని సమ్మెదారులు పికెటింగు ప్రారంభించారు. ఆనాడే యజమానులు తమ అభిప్రాయాన్ని కార్మికులకు తెలియజేశారు. కార్మికులు తమ అభిప్రాయాన్ని యజమానులకు తెలియజేయడానికి బుధవారం వరకూ తమకు అవకాశం కావాలని కోరారు.

కాని, సమ్మెను భగ్నం చేయాలని యజమానులు చేసే ప్రయత్నాలు తీవ్రమయాయి. దానిని బట్టియే కార్మికుల పికెటింగు తీవ్రతకూడ హెచ్చింది. జనవరి 8 వ తేదీని 144 సెక్షను ప్రయోగించారు. తుపాకులతో పోలీసులు గస్తీ తిరిగారు.

జనవరి తొమ్మిదవ తేదీ వచ్చింది. అప్పటికప్పుడే సమ్మె ప్రారంభమయి 5 రోజులయింది. సమ్మెదారుల సంఖ్య 3000 కు వృద్ధి పొందింది. పికెటింగు తీవ్రమయింది. కంపెనీ యజమానులు కూలీలను కొందరిని లారీలో ఎక్కించుకొని ఫ్యాక్టరీలోకి తీసుకు వెళ్ళుతున్నారు. 3000 మంది పికెటర్లు అడ్డుపడ్డారు. లారీ ఆగిపోయింది.

పోలీసులు లాఠీ చార్జి చేశారు. సమ్మెదారులు దానిని లక్ష్యం చేయలేదు. పోలీసులు తుపాకి మడమలతో పొడిచారు. ఉన్న చోటుల్లోంచి పికెటర్లు కదలలేదు. సమ్మెదారుల నాయకుడయిన వినయ చటర్జీని అరెస్టు చేశారు. ప్రజలను చెదరగొట్టడానికి ఇక ఒకటే మార్గం మిగిలింది. పోలీసులు తుపాకులు కాల్చారు. 4 గురు మరణించారు. 12 గురు పికెటర్లను పోలీసులు అరెస్టు చేశారు. వెంటనే కర్ఫ్యూ ఆర్డరుకూడ మూడు రోజుల వరకూ అమలులో వుంటుందని ప్రకటింపబడింది. సూర్యాస్తమయం మొదలు సూర్యోదయం వరకూ ఎవరూ బయట మసలకూడదు.

యిప్పుడు బాటా నగరంలోగాని, బాటా నగరం చుట్టూ ఫర్లాంగు దూరం లోపుగా ఎవరూ మసలడానికి వీలులేదు. కార్మికులందరూ ఇళ్ళల్లోనే దాగియున్నారు. మిలిటరీ, పోలీసులు తుపాకులతో వీధుల వెంబడి గస్తీ తిరుగుతున్నారు.

యీ సమ్మెలో అరెస్టు చేయబడిన కార్మికులపై కేసులు పెట్టారు. విచారణ జనవరి 12 వ తేదీని ప్రారంభమయింది. 21 వ తేదీకి తిరిగి వాయిదా వేశారు.

బందరు

నేషనల్ కాలేజీ వర్కుషాపు పనివారి కడగండ్లు

బందరు కాలేజీ వర్కుషాపు సుమారు 20 సం॥ల క్రిందట స్థాపించబడినది. ఆంధ్రరాష్ట్రములో మెకానికల్ కోర్సు యివ్వగల్గిన జాతీయసంస్థ ఇది ఒక్కటే! జాతీయ కళాశాల అధిపతులు దీనిని పోషించలేక మునిసిపాలిటీకి స్వాధీనము చేశారు. పూర్వము దీనియందు 100 పనివాళ్ళు ఉండేవారు. 4 గురు ఉపాధ్యాయులుండేవారు. విద్యార్థులకు, పనివారలకు తగిన ప్రోత్సాహం లేక నానాటికి దుస్థితికి వచ్చినది. ప్రస్తుతము దీనిలో

కార్మిక సమస్యలు

30 మంది పనివారలున్నారు. అందులో 10 మంది పర్మనెంటు స్టాఫ్. మిగిలినవారు రోజుకూలీలుగా పని చేస్తున్నారు. వారికి కూలి 12 అ॥ మొదలు 2 అణాల వరకు వుంది. పనివారలు పూర్వమొకసారి సమ్మె కూడా చేశారు.

బొంబాయి కార్మిక చట్టము

22 వ తేదీ అఖిల భారత నిరసన దినము

సోదరులారా!

అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు, బొంబాయి కార్మిక తగాదా నట్టము యెడల నిరసన తెల్పుటకు 22 వ తేదీ నిర్ణయించింది. కాన కార్మిక సంఘాలు, కార్మిక శ్రేయస్సు కోరువారందరు 22 వ తేదీ సభలు, ఊరేగింపులు అసమ్మతి తెలియ చేయ ప్రార్ధన.

పిల్లలమర్రి వెంకటేశ్వర్లు,
ఆ॥ రా॥ ప్రెస్ వర్కర్సు సంఘ కార్యదర్శి.

వారు సంఘము పెట్టుకొనినప్పటినుండి, సూపర్వైజర్లు పనివారలలో చీలికలు కలిగించి సంఘమును విచ్ఛిన్నము చేయ ప్రయత్నిస్తూ వచ్చారు. పనివారలు వారి కష్టాలను గురించి మునిసిపాలిటీ అధికారులకు యెన్ని అర్జీ లిచ్చినను వారు గమనించలేదు. పైగా వర్కుషాపు వల్ల మునిసిపాలిటీకి నష్టము వచ్చుచున్నదని పనివారలను తీసివేసెదమని అధికారులు బెదరించుచున్నారు. ఆ సంస్థను వ్యాపారదృష్టితో చూచుట శోచనీయము. ఆంధ్రరాష్ట్రములో జాతీయ భావములు గల్గిన విద్యార్థులకు మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులు నిచ్చు సంస్థ ఇది ఒక్కటే.

ఇటీవల క్రిస్టమస్ పండుగ అనే సాకుతో వారము రోజులు సెలవులిచ్చి, రోజు కూలీయిగా నున్న ఇరవై మంది పనివారలకు నాగాలు వేశారు. పండుగలకు, ఆదివారాలు, శనివారము ఒక పూట, వారికి నాగాలు కట్టుచున్నారు. పనివారలు సంఘము పెట్టుకొని మునిసిపల్ కమీషనర్ గారికి అర్జీలపై అర్జీల నిచ్చుచున్నారు. కాని మునిసిపాలిటీ కాంగ్రెసువారి చేతులలో లేదు. అందుచే వర్కుషాపు యొక్క మేలు చూచేవారు లేరు. కాంగ్రెసు మంత్రులు యీ విషయమై తగు శ్రద్ధ తీసుకొని నేషనల్ కాలేజీ వర్కుషాపును ఉద్ధరించాలి.

తెనాలి

ప్రెస్ వర్కరు చేతి వేళ్లు తెగుట 11-1-39

తెనాలి జానకిరాం ప్రెసులో కంట్రాక్టు పనిచేయుచుండు, రెట్టా రత్తయ్య అను ట్రెడిల్‌మన్ 6-1-39వ తేదీ రాత్రి 10½ గంటలప్పుడు అచ్చువేయుచుండగా ట్రెడిల్‌లో చేతివేళ్లు పడెను. చిన్న వేళ్ళు పూర్తిగా తెగిపోయినవి. మిగిలిన వేళ్ళు పగిలి నలిగిపోయినవి. వెంటనే అతను డాక్టరు కాజ నరసింహారావుగారి దగ్గరకు పోయి చెప్పెను. డాక్టరుగారు మందు వేసి కట్టు కట్టేరు. ఒక నెల రోజులు మందు వేస్తేగాని చెయ్యి నయంకాదని డాక్టరుగారు చెప్పారు. రోజుకు 6 అణాలునుంచి 8 అణాలవరకు సంపాదించుకొను ఈ వర్కరు పనిచేయటానికి వీలులేక కూలి నష్టపడినందువల్ల మామూలు కుటుంబ పోషణకు, మందు ఖర్చుకు చాలా ఇబ్బంది పడుతున్నాడు.

విశాఖపట్నం

హార్బరు, పోర్టు కార్మిక సంఘం నూతన సంవత్సరమునుండి నూతన చరిత్రను వ్రాస్తోంది. ఎన్నడూలేని దయ ఈ సంవత్సరం జనవరి 1 నుండి హార్బరు అధికారులు కార్మికులపై చూపిస్తున్నారు. ఈ జనవరి 2 వ తేదీ అధికారులు కార్మికులందరికి నూతన సంవత్సర అశీర్వాదములు పంపారు. "ఈ సంవత్సరములో మీ జీవితం అభివృద్ధి అవుతుంది," అని. అందరికీ అప్పుడే అనుమానం కలిగింది. యూనియనుకు రిపోర్టు చేశారు. యూనియను ఈ విషయం ఆలోచించటానికి 6 వ తేదీని బహిరంగ సభ నిర్ణయించింది. వెంటనే హార్బరు అధికారులు కొత్త చర్యలకు దిగారు. ప్రతి వొక్కని వద్దకు వెళ్ళి "మీకెవ్వరికి రిట్రెంచిమెంటు లేదు. నష్ట పరిహారాలకై బయటివారి సహాయం అపేక్షించకండి మీ డబ్బును వృధాగా ఖర్చుచేసుకొనకండి," అని ప్రచారం సాగించడం మొదలు పెట్టారు. ఈ ప్రచారన్ని కార్మికులు ఎదుర్కొన్నారు. యూనియను నిర్ణయించిన మీటింగుకు (6 వ తేదీ) యూనియను ప్రదర్శనోత్సవము నిర్ణయించక పోయినప్పటికి, అన్ని సెక్షనులలోని కార్మికులు పవర్‌హౌసువద్ద కలశారు. బ్రహ్మాండమైన ఊరేగింపు సాగించారు. బహిరంగ సభలో అధికారుల చర్యలను ఖండించి, యూనియను చందాను ఈ నెలతోనే అందరూ చెల్లించవలసినదిగా తీర్మానించారు. హార్బరు అధికారులు అన్ని సెక్షనులలోను నోటీసులంటించారు. "కార్మికులెవ్వరికి రిట్రెంచిమెంటు లేదు. మీ డబ్బు వృధాగా ఖర్చుపెట్టుకోకండి. యూనియన్ చందా చెల్లించకండి" అని. యూనియను వల్ల వచ్చే లాభాలను గ్రహించారు కార్మికులు. ఈనెలలోనే అన్ని సెక్షనులలోని కార్మికులు యూనియను కీయవలసిన పూర్తి చందా(సంవత్సరచందా) చెల్లించారు. హార్బరు అధికారులను ధైర్యముతో ఎదుర్కొన్నచో కార్మికులు తప్పకుండా జయింపగలరు.

రాష్ట్రి కాంగ్రెసు సంఘ సభ్యులగు సోషలిస్టుపార్టీ సభ్యులకు హెచ్చరిక.

రాష్ట్రి కాంగ్రెసు సంఘానికి ఎన్నుకోబడిన కాంగ్రెసు సోషలిస్టు పార్టీ సభ్యులందరు. రాష్ట్ర కాంగ్రెసు సమావేశమునకు ముందు రోజు సాయంకాలం కాకినాడ పట్టణంలో గాంధినగరములో డాక్టరు వీరయ్యగారింటిలో సమావేశమయి తమ కర్తవ్యాన్ని నిర్ణయించుకోవలెను. కాన సోషలిస్టుపార్టీ సభ్యులందరు ఆరోజుకు తప్పక రావలయునని కోరుచున్నాను.

ఇట్లు
పుచ్చలపల్లి సుందరయ్య
కార్యదర్శి

* * *

13-1-39 శుక్రవారం ఉదయం గుంటూరు పట్టణ కాంగ్రెసు సోషలిస్టుపార్టీ 9 గంటలకు కామ్రేడ్ పి. వి. శివయ్య **(B. Sc.,)** గారి అధ్యక్షతను సమావేశమై ఆంధ్రరాష్ట్రి కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ ప్రధానకార్యదర్శి కామ్రేడ్ పి. సుందరయ్యగారిపై ఆంధ్రాకాంగ్రెసు సంఘాధ్యక్షులు డాక్టరు పట్టాభిగారు యిచ్చిన స్టేటుమెంటును చర్చించి యీ క్రింది తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడమైనది.

1. ఆంధ్రరాష్ట్రి కాంగ్రెస్ సంఘాధ్యక్షులు డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు అహింసా విధానముమీద నమ్మకమున్న ప్రతివారికి తావొసంగుచున్న అఖిలభారత కాంగ్రెసులో వున్న సోషలిస్టు కమ్యూనిస్టు సభ్యులమీద చూపిన దృష్టికి ఆశ్చర్యపడుచూ కాంగ్రెసులోని సోషలిస్టుపార్టీని, కమ్యూనిష్టుపార్టీగా చెప్పుటను యీసభవారు తీవ్రముగా నిరసించుచు ఇది అతివాదులను కాంగ్రెసు నుండి తరుమివేయుటకు చేయు ప్రయత్నమని అభిప్రాయపడుచున్నారు.

2. ఇటీవల మద్రాసు గవర్నమెంటువారు ప్రకటించిన నోటీసు కారణంగా కామ్రేడ్ సి. యల్. నారాయణ, పార్టీ కార్యనిర్వాహక వర్గ సభ్యత్వానికి రాజీనామా నిచ్చినందుకు ఈ సభవారు విచారపడుచూ, విద్యార్థులు రాజకీయాల్లోపాల్గొనకూడదని, మద్రాసు గవర్నమెంటు పెట్టిన నిర్బంధానికి యీ సభవారు తీవ్ర అసమ్మతిని జూపుచున్నారు.

గుంటూరు, ఓ. యల్. నరసింహం,
14-1-39. సహాయకార్యదర్శి.

* * *

నెల్లూరుజిల్లా కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ తృతీయ వార్షిక సమావేశము.

డి 29-1-39 ఉదయం 8 గంటలకు నెల్లూరులోని జిల్లాబోర్డు కాంగ్రెసుపార్టీభవనములో జరుగును.

నెల్లూరుజిల్లాలోని కాంగ్రెసు సోషలిస్టుపార్టీ సభ్యులందరును కార్యదర్శి ఆహ్వానించిన ఇతరులుమాత్రమే యందు పాల్గొందురు.

డెలిగేటుఫీజు రు 0-2-0 లు మాత్రమే

తీర్మానములు పంప దలచుకొన్నవారు డి 25-1-39 లోపల పంపవలెను.

కార్యక్రమము :

డి 29-1-39 ఉదయం 8 గంటలకు అధ్యక్షుని యెన్నిక, అధ్యక్షోపన్యాసము, కార్యదర్శి రిపోర్టు.

మధ్యాహ్నము 11 గంటలకు భోజనం
1 గంటకు తీర్మానములు
5 గంటలకు కార్యనిర్వాహక వర్గ ఎన్నికలు,

30-1-39 ఉదయం 7 గంటలకు మిగిలిపోయిన తీర్మానములు, అధ్యక్షుని అంత్యోపన్యాసము.

బి. శంకరయ్య,
కార్యదర్శి. 11-1-39.

* * *

బాపట్ల తాలూకా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ సమావేశము.

11-1-39 తేదీన బాపట్ల పట్టణ కాంగ్రెస్ కార్యాలయములో కామ్రేడ్ పెండ్యాల లోకనాధం అధ్యక్షత క్రింద జరిగిన సమావేశంలో ప్యాసుచేసిన తీర్మానములు.

1. ప్రకాశంకమిటీ రిపోర్టును బలపరచుచు ఆంధ్రరాష్ట్రి రైతు సంఘ సూచనలను దానిలో చేర్చవలయునని కోరడమైనది.

2. ఆదిమాంధ్ర క్రైస్తవులు హరిజనుల వలె ఆర్థికముగ బాధపడుచున్నను వారి బిడ్డలు పాఠశాలలలో చదువుకొనుటకు జీతములు చెల్లించవలయునని ప్రభుత్వమువారు ప్రకటించుట అన్యాయమని దానిని వెంటనే రద్దు చేసుకొనవలయునని ప్రభుత్వమును కోరడమైనది.

ఆచంట ఫిర్కా ప్రాథమిక కాంగ్రెసు సభ్యులకు కృతజ్ఞత.

నేను ప్రకాశం కమిటీ నివేదికాందోళనా నిమగ్నుడనై ఫిర్కా ఓటర్లను స్వయముగా చూడజాలకపోయినప్పటికిని, తమకు రైతుఉద్యమముపట్ల గల గాఢాభిమానమును రాష్ట్రికాంగ్రెసు ఎన్నికలలో నాకు అఖండ విజయం చేకూర్చుట ద్వారా ప్రదర్శించినందులకు ఓటర్లకు, ప్రచారకులకు నా కృతజ్ఞతా పూర్వక వందనము లర్పించుచున్నాను.

ఇట్లు
కొ॥ సత్యనారాయణమూర్తి
అధ్యక్షుడు
ఆం॥ రా॥ రైతుసంఘం

* * *

యువజన సంఘ వార్షికోత్సవము

12-1-39 తేదీని అయిభీమవరంలో యువజన సంఘ వార్షికోత్సవము అత్యంత ఉత్సాహముతో జరిగెను. మధ్యాహ్నం 1 గంటకు కామ్రేడ్ సత్యనారాయణగారు జాతీయ పతాకోత్సమును జరిపిరి.

గమనించండి

చైనా, స్పైన్ ఫిల్ములు
కామ్రేడ్ బెండూల్కరు సంచారం
వాయిదా పడింది

కామ్రేడ్ బెండూల్కరు ప్రస్తుతం ఉత్తర దేశంలో కార్యక్రమం నిర్ణయించుకొనుటచే చైనా, స్పెయిన్ ఫిల్ములు ఆంధ్రదేశానికి యిదివరకు ప్రకటించినటుల ఫిబ్రవరిలో రావు. కాన వెనుకటి కార్యక్రమం అంతా రద్దుచేయబడినది. మార్చి ఏప్రియల్ నెలలో దక్షిణదేశానికి వస్తారు. కార్యక్రమం ముందు ప్రకటించబడును. యీమార్పు గమనింప ప్రార్థన.

పుచ్చలపల్లి సుందరయ్య.
కాం. సో. పార్టీ కార్యదర్శి.

2. బాపట్ల బోర్డు హైస్కూలు విద్యార్థులు అనాగరికమైన డిటెన్షనుల పద్ధతి పోవలయునని చేసిన సమ్మెకు హృదయపూర్వక సానుభూతి చూపడమైనది.

పెదనందిపాడు } ఇట్లు
13-1-39 } లావు అంకమ్మ.
కార్యదర్శి, తా. కాం. సో. పార్టీ.

* * *

కృష్ణాజిల్లా కాంగ్రెసు సోషలిస్టుపార్టీ.

తృతీయ కృష్ణాజిల్లా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ కాన్ఫరెన్సు ఫిబ్రవరి 2 వ వారము ప్రారంభములో జరుగును. 3 నెలల క్రితం చేసిన ప్రాథమిక సభ్యులందరును పార్టీకాన్ఫరెన్సుకు డెలిగేటులే. పార్టీ సభ్యులెవ్వరైనను కాన్ఫరెన్సులోకి తీర్మానము లుపపాదింప గోరుచో ఫిబ్రవరి 2 వ తేదీకే పార్టీ శెక్రటరీకి చేరులాగున పంపవలెను.

స్థల, కాల నిర్ణయము చేసినవెంటనే ప్రాథమిక సభ్యులకు తెలియజేయబడును.

ఇట్లు,
బెజవాడ, } వెల్లంకి విశ్వేశ్వరరావు,
14-1-39. } ప్రధానకార్యదర్శి.

అనంతరము కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణగారి అధ్యక్షత క్రింద సభ ప్రారంభమయ్యెను. శ్రీయుత గుడిపాటి లింగరాజుగారు సభను ప్రారంభించిరి. సత్యనారాయణగారు దేశములోని యువజనోద్యమమును గూర్చియు, యువకుల కర్తవ్యమునుగూర్చియు, కాంగ్రెసు మహాసభకు యువజనుల తోడ్పాటునుగూర్చియు విపులముగా ఉపన్యసించిరి.

ఈక్రింది తీర్మానములు ఆమోదించబడెను.

త్రిపుర కాంగ్రెసు మహాసభకు మరల బోసుగారినే ఎన్నుకొనవలెననియు, ప్రకాశం కమిటీ రిపోర్టు బలపరుస్తూ, ఫెడరేషన్ కాంగ్రెసు నాయకులు ప్రతిఘటించ వలెననియు, అల్లూరి సత్యనారాయణ వగైరాలమీద డిసిప్లినరీ చర్య తొలగించవలెననియు తీర్మానింపబడెను.

(స్వకీయ విలేఖరి)

* * *

బందరు తాలూకా రైతు సంఘము చెన్నూరు.

ది 25-1-39 బుధవారం మధ్యాహ్నం 1 గంటకు చెన్నూరు గ్రామ గ్రంథాలయ భవనములో బందరు తాలూకా రైతు సంఘ ప్రతినిధులు సమావేశమయి తాలూకా రైతు సంఘ కార్యనిర్వాహక వర్గ ఎన్నికలు జరుగును. సభ్యులందరు సదరు ఎన్నికలలో పాల్గొనగోరుచున్నాను.

పామిరెడ్డి వెంకట సుబ్బారావురెడ్డి.

* * *

ఆంధ్రరాష్ట్రి ప్రెస్‌వర్కర్సు యూనియన్ కార్యనిర్వాహక సమావేశం.

ఆంధ్రరాష్ట్రి ప్రెస్ వర్కర్సు యూనియన్ కార్యనిర్వాహకవర్గం 15-1-39 నాడు సాయంత్రం 3 గంటలకు బెజవాడ ప్రెస్‌వర్కర్సు యూనియన్ ఆఫీసులో కామ్రేడ్ యిల్లూరి తాతయ్యగారి అధ్యక్షతక్రింద సమావేశమైనది. ప్రధానకార్యదర్శి స్థానికయూనియన్ల పరిస్థితులనుగూర్చి తాను స్వయముగా గమనించిన విషయములను తెలియజేసిన తరువాత యీ క్రింది తీర్మానములు ఆమోదింపబడినవి.

1. కార్యదర్శి ప్రవేశపెట్టిన అకౌంట్లు సరిచూచిన తరువాత ఆమోదింపబడినవి.

2. క్యాజుయల్ లీవు, సిక్కు లీవు మొదలగు కనీసపు కోర్కెలనుగూర్చి తీవ్రముగా ఆందోళన సభ్యులమధ్య ప్రచారముగావించి, ఫిబ్రవరి 25 వ తేదీలోపు ఆఫలితములనుగూర్చి రాష్ట్రిసంఘ ఆఫీసుకు తెలియ జేయవలెనని స్థానిక సంఘములను హెచ్చరించడమయినది. ఆ ఫలితములనుగూర్చి ఆలోజించుటకు రాష్ట్రి కౌన్సిల్ సమావేశము జరుపుటకు తీర్మానించడమైనది.

3. ఈ సంఘము మద్రాసు రాష్ట్రి ట్రేడు యూనియన్ కాంగ్రెసుకు అనుబంధముగా చేర్చుటకు తీర్మానించడమైనది.

4. మద్రాసు ప్రెస్ లేబరుయూనియన్ కార్యదర్శులగు శ్రీ కామ్రేడ్ సోమేశ్వరరావు గారిమీద ప్రభుత్వము పోలీసు అధికారులు (పోలీసు దౌర్జన్యము నశించాలని) నినాదములు వేసినందులకు పోలీసు చర్యపట్ల ఈ సమావేశమువారు అసమ్మతిని తెలియజేయుచు వీరిపై బనాయించిన కేసు ఉపసంహరించుకోవలెనని మంత్రివర్గమువారిని కోరుచున్నారు.

యం. మల్లిఖార్జునరెడ్డి.
సహాయకార్యదర్శి.

Published by M. Chandrasekhara Rao } at Navasakti Press, Governorpet, Bezwada.
Printed by Tummala Venkata Ramiah }

END OF ISSUE